ఓ౩మ్

వైదిక ధర్మము

మాసపత్రిక

పంజీకరణ సం॥ ౨౨౨౫ / ౨౨ తపాల హెచ్/నిజామాబాద్/౬౨

మనుర్భవ జనయా దైవ్యం జనమ్ ॥ఋగ్వేదము॥

సంపుటి ౧౩ సంచిక ౨–౧౨

కర్మఫల సిద్ధాంతము

హిందీ మూలము

పండిత గంగాప్రసాద్ ఉపాధ్యాయ, ఎం.ఏ.

తెలుగుసేత

లోకా లక్ష్మీనారాయణ 'మనస్వి'

ముఖ్య సూచన

గత పదునాల్గేండ్ల నుండి నేనే వైదికధర్మ పత్రికకు ప్రకాశకునిగా వ్యవహరిస్తున్నాను. మధ్యన పేరు మార్పిడి జరిగినది నామకార్థమే. బాధ్యత నాపైననే యుండెను. అనాటి నుండియేనే నీ ప్రకాశక బాధ్యతల నుండి తప్పుకో జూచుచుంటిని. నా శారీరక, మానసిక స్థితులలో క్రమేణ సంభవిస్తున్న మార్పులను దృష్టియందిడుకొనియే అట్లు తలచుట జరిగినది. మధ్యన పత్రిక ఆపివేయ వలయునని నిర్ణయించితిమి. కాని ఒక వ్యక్తి పత్రిక ప్రచురణ, ప్రబంధ బాధ్యతను తాను స్వీకరింతునన్నందున నేను విరమించుకోలేక పోయితిని. ఏ కారణముననో వారా బాధ్యతను స్వీకరింపరైరి. కావున నాపైన గల భారమట్లే కొనసాగుచున్నది. పత్రికను నాచేత నైనంతవరకు ప్రతినెల వెలువరించితిని. ఆ పిదప మొదటనే సూచించి నావల్ల అయినంతమేర దానిని అప్పుడప్పుడు పుస్తకముల రూపమున ప్రచురిస్తూ సంవత్సరమున కొసగవలసిన పుటలను అందజేయ ప్రయత్నించితిని. దీనివలన గ్రాహకులలో అపోహలేర్పడినవి. ఇప్పుడు పత్రిక ప్రకాశక బాధ్యతను నిర్వహింపలేని స్థితిలో మరొకరికి దీని ప్రకాశక బాధ్యతను అప్పగించబూనితిని వారుది ఇగువ సూచనల మేరకు బాధ్యతలను నిర్వహింప సమ్మతించిరి.

౧ ప్రకాశక సంపాదకుల నామములు పూర్వమువలెనే కొనసాగవలెను.

౨ పత్రిక యథాప్రకారమే గురుకులము నుండియే వెలువడవలయును.

౩ పత్రికకు ఇదివరకు గల ఆజీవన గ్రాహకులను, ఇష్టపడిన వారిని పంచవర్షీయ గ్రాహకులుగా మార్చివారికి క్రొత్త గ్రాహక సంఖ్య యొసగవలయును.

౪ అట్లు కొనసాగ దలచనివారు కోరినచో వారు చెల్లించిన శుల్కము తిరిగి ఇచ్చి వేయవలయును.

౫ ఇకముందు చేర్చుకొనబడు గ్రాహకులు పంచవర్షీయ గ్రాహకులై యుండవలయును. ఆజీవన గ్రాహకులను చేర్చుకొనరాదు.

౬ పంచవర్షీయ గ్రాహక శుల్కము రూ॥ ౩౦౦/- లుంచవలయును.

ఈ పత్రికకు మొదట గ్రాహకులు రూ॥ ౨౦౦; ౨౧౬లు చెల్లించి ఆజీవన సభ్యులైరి. తరువాత ఆజీవన శుల్కము క్రమంగా ౨౫౦, ౩౦౦ చేయబడినది.

పత్రికకు గ్రాహకులుగా కొనసాగదలచిన వారు రూ॥ ౩౦౦/-లకు కొరతగా ఉన్న ౧౦౦, ౮౮, ౫౦లు పంపి పంచవర్షీయ గ్రాహకులుగా చేరగలరు. క్రొత్త గ్రాహక సంఖ్యను పొందగలరు. ఇష్టపడని వారు, పత్రికను చదువని వారు మాకు సూచించినచో వారి శుల్కము తిరిగి చెల్లించబడును. లేదా వారికి సమ్మతమేని దానిని పత్రిక స్థిరనిధిలో చేర్చబడును.

ఇట్లు
ప్రకాశకుడు

ఓ౩మ్

కర్మఫల సిద్ధాంతము

హిందీ మూలము

పండిత గంగాప్రసాద్ ఉపాధ్యాయ, ఎం.ఏ.

తెలుగుసేత

లోకా లక్ష్మీనారాయణ (మనస్వీ)

ప్రకాశకులు

ఆర్ష గురుకులము, వడ్లూరు, కామారెడ్డి - ౫౦౩ ౧౧౧

ప్రమాధినామ సం॥ర పుష్య కృష్ణ సప్తమి

గ్రంథము : కర్మఫల సిద్ధాంతము

హిందీమూలము : పండిత గంగాప్రసాద్ ఉపాధ్యాయ

తెలుగుసేత : లోకా లక్ష్మీనారాయణ 'మనస్వీ'

ప్రథమ ముద్రణ : ౨౦౦౦

విక్రమాబ్దము : ౨౦౫౬

దయానందాబ్దము : ౧౭౬

ప్రమాధినామ సం॥ర పుష్యకృష్ణ సప్తమి

మూల్యము : ౨౦/-

ప్రతులకు : ఆర్షగురుకులము, వడ్లూరు, కామారెడ్డి.

తొలి పలుకులు

కీ.శే. గంగాప్రసాద్ ఉపాధ్యాయ ఆర్యసమాజ జగత్తున ప్రసిద్ధి వడసిన రచయిత. అనేక ప్రామాణిక, విమర్శనాత్మక గ్రంథాలు రచించి వాసికెక్కిన విద్వాంసుడు. ఆయన రచనలు విద్వాంసుల ప్రశంసలందినవి. బహుమతులందుకొన్నవి.

నాకు వైదిక సిద్ధాంత పరిచయము లేని దానితో సమానముగ నున్న కాలమున అనగా ౨౪ సంవత్సరములకు పూర్వము శ్రీ గంగాప్రసాద్ ఉపాధ్యాయ రచించిన "కర్మఫల సిద్ధాంతము"ను చదివితిని. ఆ సమయమున నన్ను అశాంతికి గురిచేసిన యొక సమస్యకు నాకు సమాధానము లభించినది. దానిచే ప్రోత్సాహితుడనై నేనా పుస్తకమును తెనిగించబూనితిని. అందులోని కొన్ని యంశములపై నాకు సంశయము కలిగినందున వైదిక సిద్ధాంతజ్ఞు లెవరైన దానికి విమర్శనాత్మకముగ అభిప్రాయము వ్రాసిన బాగుండునని తలచితిని. నేను గత ౧౮ సంవత్సరముల నుండి గురుకులమున నివసించుచున్నందున గురుకులములో ఆచార్యులైన శ్రీ వేదవ్రత మీమాంసక గారే దానికి విమర్శనాత్మక భూమిక వ్రాసిన బాగుండునని తలచితిని. ఆయనకు తీరిక యుండదని తెలిసియు విమర్శ వ్రాయగోరితిని. ఆర్య భాషలోనున్న మూల గ్రంథమును చదివియే వారు కొన్ని టిప్పణులు వ్రాసిరి. నా అనువాదము చూచుటకు వారికి తీరిక లభించలేదు. వారు వ్రాసిన టిప్పణులు పుస్తకము చివర చేర్చబడినవి. అట్లు చేయుట వలన పుస్తకమును నిర్బాధకముగ చదువుటకు వీలగును. పాఠకులు తమ ప్రతి క్రియను తెలుపగోరుచున్నాను. టిప్పణులు వ్రాసిన శ్రీ ఆచార్యుల వారికి నేనెంతవో కృతజ్ఞుడను.

ఈ పుస్తకము వైదిక ధర్మ పాఠకుల కందింపబడుటకు ఇరువురు దాతల ఉదారతయే కారణము.

శ్రీ జాడె సూర్య ప్రకాశరావు ఎల్లారెడ్డి మండల నివాసి, బట్టల వ్యాపారి. ధర్మాత్ముడు, సహృదయుడు, ఉదారుడు. ఈ ఆర్షగురుకులములో జరుగుచుండు యోగ శిబిరములన్నింట తప్పక పాల్గొనుచుండును. అప్పుడప్పుడు పరివార సహితముగ గురుకులమునకు వచ్చిన పరివారము వైదిక సిద్ధాంతములు తెలిసికొనునట్లు ప్రయత్నించుచుండును. తన యింటిలోనే సాప్తాహిక సత్సంగములు జరుపుచుండును. నేను కోరగనే పుస్తక ముద్రణకు ఉదారతతో పదివేల రూపాయలు సహాయమందించుట కంగీకరించుటయే గాక తానే స్వయముగ ఆ రాశిని గురుకులమునకు తెచ్చి యిచ్చెను. ఈయన గురుకులమునకు తరచుగా వచ్చుచుండును. వైదిక సిద్ధాంతములు తెలిసికొను చుండును. గురుకులమునకు ఉదారముగ ఆర్థిక సహాయమందించుచుండును. పరమ కారుణికుడైన పరమేశ్వరుడు ఆయనను పరివార సహితముగ ధర్మ మార్గమున నడచుటకు ప్రేరేపించుగాక! ఆయనలోను ఆయన పరివార జనులలోను శాంతిని ఆనందమును నింపునుగాక!

శ్రీ బెజుం నర్సింహులు పిట్లం నివాసి. ఆయన చిన్ననాటి నుండి ఆర్య సమాజముతో సంబద్ధుడైనాడు. తన యింటిలో సంస్కారములన్నియు వేదోక్తముగ జరిపించుచుండును. ఆర్షగురుకులముపైనను దాని ఆచార్యులపైనను ఆయనకు అభిమానము మెండు. కోరుటతోనే పుస్తక ముద్రణకై ఐదువేల రూపాయలు విరాళ మొసగినాడు. ఆయనకు, ఆయన పరివారమునకు పరమేశ్వరుడు దీర్ఘాయువును ఆరోగ్యైశ్వర్యమును శాంతి - ఆనందములను ప్రసాదించుగాక! వైదిక ధర్మముపట్ల వారికి గల అభిమానమును నిరంతరము పెంపొందించుచుండును గాక !

పై దాతలిరువురికిని హార్దిక కృతజ్ఞతలు.

పుష్యము ౨౦౫౬ వి. సం॥

ప్రకాశకులు

ఓమ్

కర్మకు మూలాధారము

ప్రశ్న:- కర్మసిద్ధాంత మూలాధార మేమి?

ఉత్తరము:- కర్మసిద్ధాంతము రెండు దార్శనిక సిద్ధాంతములపై ఆధారపడి యున్నది. అవి (౧) జీవుడు కర్మ చేయుటలో స్వతంత్రుడు, ఫలము పొందుటలో తన కర్మ కాశ్రితుడు. (౨) కర్మఫలము నిచ్చువాడు ఈశ్వరుడు. అతడు తన (న్యాయ) వ్యవస్థ ప్రకారము జీవుడు చేసిన కర్మల కనుగుణమైన ఫలము నిచ్చును.

ప్రశ్న:- కర్మసిద్ధాంతము పద్మవ్యూహము వంటిదనుచు దానిని నమ్మని వారెందరో కలరు గదా?

ఉత్త:- మూలసిద్ధాంతముల నెవ్వరును కాదనరు. జీవుడు తానెట్టి కర్మల జేయునో అట్టిఫలమునే పొందునని అందరు ఒప్పుకొందురు. పరమ నాస్తికులు గూడ సదాచారపు ఈ మూల సిద్ధాంతమును కాదనరు. ఈ సిద్ధాంతమును నమ్మనిచో ఒక క్షణమైనను పనిజరుగదు. ఈ మూల సిద్ధాంతమునకు శాఖలరూపమున కలుగు ప్రశ్నలకు విభిన్న వ్యక్తులు వేర్వేరు సమాధానముల నిత్తురు. కొందరకు కొన్ని కాల్పనిక నమ్మకములున్నవి. వారి యా నమ్మకములే వారిని సరిగా నాలోచింప నీయవు. ఎట్లన - ఒకవ్యక్తి మొదటినుండియే ఈశ్వరుడు లేడని, జీవుడు అజరుడు; అమరుడు, లేదా అజన్ముడు కాడని, పునర్జన్మ ఉండదని నమ్మినచో ఇట్టి నమ్మకములు అతనికి కర్మసిద్ధాంతము నొప్పుకొనుటలో ఆటంకము కలుగజేయును. ఐనను శుభకర్మలకు మంచి ఫలితము అశుభకర్మలకు చెడుఫలము లభించునని ఒప్పుకొన వలసియే యుండును. శుభాశుభకర్మల లక్షణములను పేర్కొనుటలో భేదముండిన నుండవచ్చును. కాని కర్మఫలము యొక్క మూల సిద్ధాంతములు మాత్రము అందరికి సమ్మతమైనవే. ఒక నాస్తికుడు గూడ తన కొడుకు చెడు పని చేసినచో "నీవు తప్పు చేసితివి. కాన దండనీయుడ" వని దండించును. ఇదియును కర్మఫలమే గదా!

ఈశ్వరుడు న్యాయకారి మరియు దయాళువు

ప్రశ్న:- ఈశ్వరుడు న్యాయకారియా లేక దయాళువా? అతని దయ లేక న్యాయమునకు కర్మసిద్ధాంతముతో గల సంబంధ మేమి?

ఉత్త:- ఈశ్వరుడు న్యాయకారియే. ఏలన అతడు జీవుని కర్మల ననుసరించియే హెచ్చు తగ్గులు కాకుండునట్టి ఫలము నిచ్చును.

జీవునికి మేలుకలుగు రీతిలో కర్మఫలము నిచ్చు విధానము నేర్పరచినందువలన పరమేశ్వరుడు దయాళువుఅనబడును. శుభకర్మలకు మంచి ఫలము నిచ్చుటలోను, అశుభకర్మలకు దండన విధించుటలోను జీవుని కల్యాణమే కలదు. అందువలన కర్మఫలసిద్ధాంతము ఈశ్వరుని దయాళువుగనే గాక న్యాయకారిగను ప్రమాణీకరించుచున్నది. దయకు అర్థము జీవుని హితము గోరుటయే. న్యాయమున కర్థము అట్టి హితచింతనలో ఏ మాత్రము హెచ్చు తగ్గులు లేనట్టి వ్యవస్థ నేర్పరచుటయే.

అట్లుగాక కర్మలకన్న ఎక్కువ ఫల మిచ్చినచొ జీవునిలో ఆలస్య ప్రమాదములు వృద్ధియగును. ఇది అతనికి అహితకరమే. కావున అది దయ గాని న్యాయము గాని యెట్లగును? ఒక కర్మకు ఎంతఫల ముండవలెనో సరిగా లెక్కించుటయే న్యాయము. ఆ న్యాయము యొక్క ఉద్దేశ్యము జీవునికి హితమై యుండవలెను. న్యాయాధీశుడు దయాప్రేరితుడైయే న్యాయ మొనర్చును. న్యాయము చేయకున్న అహిత మగు ననియే అతడు భావించును. ఈ అహితమే నిర్దయ.

ఒక పరీక్షకుడు పరీక్షార్థికి అతడు వ్రాసిన దానికన్న అధిక గుణముల నిచ్చెననుకొందము. మూర్ఖులు దీనిని "దయ" యందురు. కాని యిది ఇతర పరీక్షార్థులకు అన్యాయము చేయుటయే గాక వారి యెడ నిర్దయగ ప్రవర్తించుటయు నగును. అంతేగాదు ఆ పరీక్షార్థి యెడయు నిర్దయే యగును. ఏలన అతని స్వభావము చెడిపోవును. ఈశ్వరుడు దయాళువు మరియు న్యాయకారి అగుటవలననే కర్మఫలములను హెచ్చుతగ్గులు కాకుండా కర్మల ననుసరించియే యొసగును.

ప్రశ్న:- పరమాత్మ దయాళువై యుండియు సహింపరాని దుఃఖముల నెందుకు కలిగించును ?

ఉత్త:- ఈశ్వరుడు దయాళువు. కావుననే అతడు జీవుని అశుభకర్మలనుండి తప్పింపదలచును. దుఃఖములు సహింపలేనంతటి వైనపుడు జీవునకు మూర్ఛ వచ్చును. మూర్ఛావస్థలో ఎంతటి సహింపరాని దుఃఖమైనను సహ్యమే యగును. అంతేకాదు, జీవుడు అశుభకర్మలను వీడుటలో దుఃఖము లెంతయో తోడ్పడును. సుఖ దుఃఖములు రెండును ఆత్మవికాసమును ప్రభావిత మొనర్చును. ఈ ప్రభావము అదృష్ట, అనిర్వచనీయ రూపమునుండును. దీనిని ఒక ఉదాహరణము ద్వారా తెలిసికొనవచ్చును.

ఆరోగ్య, అనారోగ్యములు రెండును జన్మనుండియే శరీరము నంటిపెట్టుకొని యుండును. శరీర వికాసముపై ఈ రెంటి ప్రభావ ముండును. ఆరోగ్యము తన పద్ధతిలో శరీరవికాస మొనర్చును. రోగములు తమ పద్ధతిలో శరీరము నుండి అనిష్ట పదార్థములను తొలగించుటలో సహాయపడును. ఆరోగ్యానారోగ్యములు రెండును శారీరక వికాసమున కవసరమే. దీనినే సుఖదుఃఖములకును అన్వయించుకొనుడు.

ఈశ్వరుని వ్యవస్థ

ప్రశ్న:- సమస్త సృష్టి ఈశ్వరుని యాధీనమై మనమెల్లరము సృష్టిలో భాగమే యైనపుడు సత్యాసత్యము, కర్తవ్యాకర్తవ్యము, కర్మ భోగము అనువాని చిక్కులో నెందుకు పడవలెను? ఈశ్వరుని వ్యవస్థానుసారము జరుగవలసినదే జరుగును గదా!

ఉత్త:- ఈశ్వరుని వ్యవస్థ జడచేతనముల కొకటిగా లేదు. జడ చేతనములలోని భేధమును వ్యక్త పరచుటయే సృష్టి యొక్క అత్యంత జటిలమైన సమస్య. ఈశ్వరుని వ్యవస్థ జడపదార్థములపై పూర్ణాధిపత్యము కలిగియుండి చేతనపదార్థములకు వాని కర్మక్షేత్రమున సంపూర్ణ స్వేచ్ఛ నొసగును. సృష్టి నిర్మాణమందు చేతనశక్తుల సంపూర్ణ సహకారము గలదు. చేతన శక్తులు నైసర్గిక శక్తులను బుద్ధిపూర్వకముగ ప్రయోగించుచుండును. చీమల పుట్టలు, పిచ్చుకగూళ్ళు, తోడేళ్ళ గుహలు, ఇతర

వేలాది జీవుల (కృత్యములు) కార్యములు చేతనజీవులు ఈశ్వరీయ నియమములను నిరంతరము బుద్ధిపూర్వకముగ నుపయోగించుకొనుచు సృష్టియందు మార్పుచేయుచుండుటను సూచించుచున్నవి. సభ్యజాతులు నిర్మించిన నగరములు, రాచబాటలు మున్నగునవి మనము నివసించు సృష్టి కేవల మీశ్వరనిర్మితమైనదే కాదు, అందు మానవులయు, అన్యప్రాణులయు పాత్ర గూడ కల దను విషయమును సూచించును. గిజిగానిలో గూడు నిర్మించుకళ ఎంత స్వాభావికము, స్వాతంత్ర్యశూన్యము లేదా శిక్షణ నపేక్షింపని దైనప్పటికిని గూటి నిర్మాణమునకు అవసరమగు సామగ్రిని ప్రోగుచేసికొనుట మున్నగు నంశములందు దానికి తగు నిర్ణయము గైకొనవలసి యుండును. కావున కర్మ చేయుటలో జీవుడు స్వతంత్రుడే యనుట స్పష్టము. సృష్టికి జీవుని భోగములు, కర్మలు అను రెండే ప్రయోజనములు కలవు. ఈ రెంటి సిద్ధికి సృష్టి పూర్తిగా అనుకూల మైనది. భోగముయొక్క పరిణామము బుద్ధివికాసము. ఆ వికాసముయొక్క ప్రభావము కర్తవ్యనిర్వచనముపై పడును. దాని నుండి కర్మ లుత్పన్నమగును. కర్మల ననుసరించియే భోగము లుండును. ఈ శృంఖల-పరంపర కల్పితము గాదని సహజముగనే గ్రహింపవచ్చును. శిశువు జన్మించుటతోడనే భోగములవలన అతని బుద్ధి వికసించును. దాని ననుసరించియే అతడు నిర్ణయపూర్వకముగ 'కర్తుం, అకర్తుం, అన్యథాకర్తుం' యొక్క స్వేచ్ఛను ఉపయోగించును. ప్రతి కర్మయు మున్ముందు భోగము నుత్పన్న మొనర్చును. ఆభోగమువలన భావివికాసము జరుగును. ఈ చక్ర మెప్పుడు నాగిపోదు. దీని నుండి భయపడియో, దీనిపై విశ్వాసముంచకయో ఉపేక్షవహించినంత మాత్రమున ఈ చక్రమునుండి తప్పుకొనలేము. కాని ఈ చక్రమును బాగుగా తెలిసికొని మన కర్తవ్యములను చక్కగా పాలించినచో మనము తప్పక ఉన్నతిని పొందుదుము. పరిస్థితు లెంత నిశ్చితములై యున్నను అందు జీవుని స్వాతంత్ర్యమునకు అవకాశముండును.

కారాగారమున బందీ సంపూర్ణముగా పరాధీనుడే. ఐనను చెప్పిన పనిని చేయుటలో అతడు తన బుద్ధి నుపయోగింపగలడు. పనిని చక్కగా చేసినచో అధికారులు సంతసింతురు. లేనిచో అప్రసన్ను లగుటయే గాక అప్పుడప్పుడు దండింతురు. కావున కారాగారములోని బందీ గూడ కర్మ చేయుటలో స్వతంత్రుడును, భోగము లనుభవించుటలో పరతంత్రుడు నని తేలినది.

స్వాతంత్ర్య, పారతంత్ర్యపు టెల్లలు తప్పక భిన్నములే. అట్లు భిన్నముగనే యుండవలెను. ఏలన ఇవిగూడ కర్మఫలములే. లోకమందు శ్రేష్ఠ పురుషులకు హీనజనులకన్న అధికస్వేచ్ఛ యుండును. రక్షకభటులు దొంగపైననే దృష్టిని కేంద్రీకరింతురు గాని సాహుకారిపైన గాదు. ఈ మానవకృత్యము లన్నియు ప్రాకృత నియమముల యనుకరణ మాత్రమే.

ప్రశ్న:- పరమేశ్వరుడు జీవులను కర్మచేయుటలో స్వతంత్రులుగా నెందుకు సృజించెను? మనకు (జీవులకు) ఈ స్వేచ్ఛ లేకున్నచో మనము పాపములను చేయకుండెడివారము, దుఃఖితులము కాకుండెడి వారము కదా!

ఉత్త:- మీయాలోచన అసమగ్ర మైనది. స్వతంత్రులము కాకున్న పుణ్యకార్యములు గూడ చేయకుందుము, సుఖమునుగూడ పొందకుందుము. పరీక్షార్థి స్వతంత్రుడైనందుననే చక్కగా వ్రాసి బహుమానము పొందును. లేనిచో బహుమాన మెట్లు పొందును ?

కర్మవాదము ఈశ్వరుడు జీవుల నుత్పన్న మొనర్చెనని యంగీకరింపదు. ఈ విషయమును బాగుగా గుర్తుంచుకొనవలెను. ఈశ్వరుడే జీవులను సృష్టించి యుండిన ఎన్నియో చిక్కు లేర్పడెడివి. ఉదాహరణకు - జీవుని అస్తిత్వము, అతని కర్మలు, అతని స్వాతంత్ర్యము మున్నగు నంశముల సంపూర్ణ భాధ్యత ఈశ్వరునిపైననే యుండెడిది. ఈశ్వరుడు మనలను పాప మొనర్చుటకు సమర్థులుగా నెందుకు సృజించెను? సత్యము పలుకుటకు మాత్రమే మన నోరు తెరచుకొనునట్లు చేసి యుండినచో మనము అసత్యమును పలుకగలిగెడివారమే కాదు గదా!

ప్రశ్న:- ఎంత అన్యాయము! జీవుల నీశ్వరు డుత్పన్నము చేయలేదా? ఇది ఈశ్వరునిపై నేరారోపణ చేయుటయే గదా!

ఉత్త:- అన్యాయము కాదు, ఇది నిజమే. ఏయుక్తి చేతను ఇందుకు భిన్నముగా నిరూపితముకాదు. ఈశ్వరుడు జీవుల సృష్టించినచో అతడే దోషి అయ్యెడివాడు. ఏలన ఈ సమస్త ప్రపంచము అతడు సృష్టించిన జీవులకొరకే గదా! ఐన జీవులను పుట్టించిన దెందులకు? తనకొరకా? ఇతరుల కొరకా? అన్యు డెవడును లేకుండెను.

గాన తనకొరకే యనుచో ఈశ్వరుడు స్వార్థపరుడని ఋజువగును. ఇట్లు భావించువారు (పలువురు ఆస్తికులు ఇట్టి భ్రమలోనే యున్నారు.) ఈశ్వరు డిట్టి దుఃఖమయ సృష్టి నేల చేసెనో వివరింపలేకున్నారు. ఇదే విధముగ జీవుడు కేవలము ఈశ్వరాంశుడని నమ్మువారు గూడ కర్మవాదమును గూర్చి సమగ్రముగ నాలోచింపరు. జీవుడు ఈశ్వరాంశుడని భావించినచో ఈశ్వరుడు అఖండుడు, అఖండనీయుడు అని ఒప్పుకొననట్లేయగును. ఈ దోష మీశ్వరునిదే యగును. ఈశ్వరునియంశ మొకటి పాప మొనర్చగా మరొక యంశము దానిని దండించునా? ? కుమారుడు సిరా ఒలికింపగా తండ్రి అతని చెంపలు వాయించెను. ఇరువురును ఈశ్వరుని యంశములే కదా! ఇట్టివి కేవలము కల్పితములే. మనము వాస్తవిక సృష్టిని గూర్చి ఆలోచింపవలెను గాని కాల్పనిక సృష్టిని గూర్చి కాదు.

ప్రశ్న:- మీయీ వాదము విచిత్ర మనిపించు చున్నది

ఉత్త:- జనులు చిత్రవిచిత్రములైన కల్పనల జేసికొని యున్నందుననే నామాటలు విచిత్రముగ దోచుచున్నవి. సర్వత్ర ఇట్టి కాల్పనిక వాతావరణమే యుండుటవలన అందుకు భిన్నమైన సత్యమును జనులు విచిత్రమని యందురు. మీరు యుక్తితో నాలోచింప గలుగునట్టి విషయమునే మేము చెప్పుచున్నాము.

ఒకే ఒక సత్తాను అంగీకరించి మీరీ సృష్టికి వ్యాఖ్యానము చేయగలరా? మీరు స్వంత సృష్టినే కల్పించుకొనదలచినచో మీ యిష్టమైన రీతిలో మీ మనస్సును తృప్తి పరచుకొనుడు. కాని ప్రస్తుత సృష్టికి మూలాధార తత్త్వములను వెదుక దలచినచో జీవు డొక అనాది, అజన్మ సత్తా యనియే నిర్ధారింపవలసి యుండును. జీవునికొరకే యీ సృష్టి రచింపబడును. జీవు డల్పజ్ఞుడు కానిచో జీవుని నిర్మాణా వశ్యకతయే గాని, సృష్టి రచనావశ్యతయే గాని లేకుండెడిది. ఈశ్వరుడు సర్వజ్ఞుడు కాడేని సృష్టిలోని జీవుల అవసరములను దృష్టియం దుంచుకొని సృష్టిని ఎవరు నిర్మించెడివారు? ఈశ్వరునికన్న భిన్నమైన మరొక సత్తాను అనాది, అమరము అని యనుకొనుట ఈశ్వరుని అవమానించుటే యగు నని తలంచు మతావలంబులు ఈశ్వర స్వరూపమునే గాక సృష్టి స్వరూపమును గూడ తమ కిష్టము వచ్చిన రీతిని కల్పించి తమ స్వరూపములనే మరచిపోయిరి. వారు ఈశ్వర విశ్వాసము యొక్క మిథ్యాభిమానమున జీవులు లేకున్నచో ధర్మము ఎవరికి? ఎందుకు? అవసరమను

విషయమును గూడ ఆలోచింపలేదు. జీవుడు సత్వతంత్రుడు, అజరుడు, అమరుడు, అజన్ముడు కానిచో ఆధ్యాత్మమున కర్థ మేమి?

జీవుని అజరత్వ అమరత్వములను తెలిసికొనలేని కారణముననే కొందరకు కర్మవాదమున చిక్కులు కనబడును. జీవుని పుట్టుకను అంగీకరించినచో పుట్టుకకు సహచారులగు సుఖదుఃఖములు ఎట్టి కర్మగాని కారణముగాని లేకుండ లభించినట్లు ఒప్పుకొనవలసి యుండును. దీనివలన కర్మఫలవాదరూప వృక్షముయొక్క మూలము గూడ నశించును. అప్పుడు శుభాశుభమున కాధారమే మిగులదు. 'సత్యం-శివం-సుందరం" యొక్క స్వరూపమేగాని ఆధారమే గాని యుండనేరదు. క్రైస్తవ మహమ్మదీయాది మతములు గ్రీకు దార్శనికుల అనుకరణ వలన జీవుడు అనిత్యుడు, ఉత్పత్తి యగువాడు అని నమ్ముచున్నవి. దీని దుష్పరిణామ స్వరూపమున జీవుని స్వాతంత్ర్యము నష్టమైనది. సృష్టి యుత్పత్తికి యుక్తి సంగతమైన కారణము లేకుండ పోయినది. ఈశ్వరుడు తాను తలంచినది చేయగలుగునని నమ్ముట జరిగినది. ఐనను తమ కర్మలే సృష్టి ఉత్పత్తికిని, శుభాశుభములకును మూలము అను ఝుంఝూటమునుండి తప్పించుకొనలేక కపోలకల్పితయుక్తులతో సమాధానపడవలసివచ్చినది. ఇది సమాధానము కాదు, కేవలము ఓదార్పు మాత్రమే. కర్మఫలవాదము నంగీకరింపనిదే నీతి శాస్త్రము యొక్క పునాది దృఢము కానేరదు. జీవుడు అనాది, కర్మయొనర్చుటలో స్వతంత్రుడు అని యంగీకరింపనిదే కర్మఫలవాదము బలపడజాలదు.

ఈశ్వరేచ్ఛలేనిదే ఆకైనను కదలదా ?

ప్రశ్న:- ఈశ్వరేచ్ఛ లేనిదే ఆకైనను కదల దందురు గదా ?

ఉత్త:- ఆకు కదలునో లేదో కాని అసత్యవాది నాలుక మాత్రము ఈశ్వరేచ్ఛ లేకయే కదలును. ఈశ్వరేచ్ఛవలననే అసత్యవాది అబద్ధమాడుచో అతనికి పాప మేల కలుగును? ఒక దొంగ ఇతరుల మామిడి తోటలోనికి వెళ్ళి చెట్లను ఊపి మామిడి పండ్లను రాల్చిన యెడల ఆ వృక్షముల ఆకులన్నియు ఈశ్వరేచ్ఛలేకయే కదలును. కావున ఆకులు మున్నగు జడపదార్థములు స్వయముగా కదల వనియు, ఏదేని చేతనము-మనుష్య, పశు పక్ష్యాదుల, ద్వారా కదలింపబడినపుడే కదలు నని ఋజువగుచున్నది. కావున ఈశ్వరుని ప్రేరణయో, ఇచ్ఛయో లేనిదే ఏయాకైనను

కదల దనుట సరికాదు. ఏదేని జడ వస్తువు అన్య చేతన వస్తువు యొక్క ప్రేరణ లేకుండగనే కదలుచు కనిపించిన యెడల అది ఈశ్వరుని ప్రేరణవలన కదలుచున్న దనుకొనవలెను.

ప్రశ్న:- క్షుద్ర చేతన జీవులు ఈశ్వర ప్రేరణకు వ్యతిరేకముగ వస్తువులను కదిలింపగలిగినచో ఈశ్వరుని వ్యవస్థ ఎక్కడుండును ?

ఉత్త:- దీని వలన ఈశ్వరీయ వ్యవస్థ కెట్టి యాటంకము కలుగనేరదు. మేమిదివరకే స్పష్టపరచినట్లు ఈశ్వరుని వ్యవస్థ జీవుని కర్మమైన స్వాతంత్ర్యమున కెట్టి యాటంకము కలుగని రీతిలో నుండును. జీవుని యోగ్యమైన స్వేచ్ఛకు ఆటంక మేర్పడనిచో న్యాయవ్యవస్థయే నష్టమైన దనవలసి యుండును. అట్టితరి ఈ సృష్టి కర్మక్షేత్రముగా నుండక తోలుబొమ్మ లాటగా మారును.

ప్రశ్న:- మీరు యోగ్యమైన స్వాతంత్ర్యమని యంటిరి. అనుచిత స్వాతంత్ర్యము గూడ ఉండునా? ఈశ్వరుని వ్యవస్థ అనుచిత స్వాతంత్ర్యమును తగ్గనీయకుండునా?

ఉత్త:- ఔను, స్వాతంత్ర్యము అనుచితమైనదియు కావచ్చును. అప్పుడది స్వాతంత్ర్యము కాక ఉచ్ఛృంఖలత యగును. దీనికి స్థూల నిదర్శనము దేశముయొక్క రాజకీయశాసనమందు కనిపించును. ప్రతి శాసనమందును ప్రజలకు కొంతయైనను స్వాతంత్ర్య ముండును కాని (లాలెస్) శాసనము నుల్లంఘించు జనులును ఉందురు. వారికి శిక్ష లభించును. లేదా వారి స్వాతంత్ర్యము తొలగింపబడును. ఈ నియమమునే సృష్టికిని వర్తింపజేయవచ్చును.

జీవుడు కర్మ చేయుటలో స్వతంత్రుడు ఫలమనుభవించుటలో పరతంత్రుడు

ప్రశ్న:- జీవుడు కర్మచేయుటలో స్వతంత్రుడు, ఫలము పొందుటలో పరతంత్రుడు అనుట కర్థ మేమి?

ఉత్త:- జీవునకు ఏ పనియైనను చేయుటకు గాని, చేయకపోవుటకు గాని, తలక్రిందుగా చేయుటకు గాని పూర్ణాధికారము గల దనియే దీని యర్థము. మాట్లాడుటకు, మాట్లాడకుండుటకు లేక అబద్ధములు పలుకుటకు నాకు

అధికారము గలదు. కాని మాట్లాడు పని పూర్తి యగుట తోడనే పరిస్థితి నా చేయిదాటి పోవును. నేను దాని పరిణామము ననుభవింపవలసి యుండును. మాటలాడవలసినచోట నేను మౌనముగా నుంటినేని దాని పరిణామముగ కలుగు హానిని నే ననుభవింపవలసి యుండును. నేను అబద్ధమాడినను, దుర్భాష లాడినను దాని దుష్పరిణామము ననుభవించుట యందు నేను పరతంత్రుడను. మాటలాడుటకు పూర్వమైనచో నా కధికార ముండెను. కాని ఇప్పుడు విశ్వవ్యవస్థాపకుని ఆధీనము లోనికి పోయినది. ఇప్పుడు నేను పూర్తిగా పరతంత్రుడను. భగవద్గీతలో గూడ ఇటులే చెప్పబడినది.

కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన
మా కర్మఫలహేతుర్భూః మా తే సంగో ఽ స్త్వకర్మణి॥ ౨-౨॥

అనగా మనుష్యునకు కర్మచేయు అధికారము గలదు. కర్మచేయుట పూర్తి కాగానే దాని ఫలము కర్త ఆధీనము నుండి తొలగి ఈశ్వరుని వ్యవస్థలో నొక అంగముగ మారును. మీకు మామిడి లేక నేరేడు వృక్ష బీజమం దేదానినైనను నాటు స్వేచ్ఛగలదు. కాని మామిడి బీజమును నాటినంతనే జగన్నియంతయొక్క వ్యవస్థ ననుసరించి మామిడి బీజము నుండి మామిడి అంకురము, ఆకులు, పూలు, ఫలములే ఫలించును గాని నేరేడువి మాత్ర మెన్నటికిని ఫలింపవు. మీరు కర్మ చేయుట పూర్తియైనంతనే పరతంత్రులైపోవుదురు. కావున మీరు పని పూర్తియగులోపలనే ఏదైన ఆలోచన చేయవలసి యుండును. కర్మ (పని) పూర్తి యైన పిదప కర్మ ఫలమును గూర్చి విచారించుట వ్యర్థమే. మామిడి విత్తును నాటి నేరేడు ఆకుల నాశించుట వ్యర్థము. కావున కర్మత్యాగము వలన గాని కర్మ చేసిన పిదప కర్మఫలచింతవలన గాని ఎట్టి ప్రయోజనముండనేరదు. కర్తవ్య కర్మ చేయకపోవుట అశుభమే, దానిని తలక్రిందుగా చేయుటయు అశుభమే.

ప్రశ్న:- మనుష్యుడు కర్మ చేయుటలో స్వతంత్రుడు కాడు. అతడు పరిస్థితులకు వ్యతిరేకముగా నేమియు చేయలేనంతగా అతనిని సృష్టికర్త పరిస్థితులలో బంధించివేసినాడు. కావున మనుష్యుడు స్వతంత్రుడనుట అబద్ధమే. మనను ఊరకనే స్వతంత్రుల జేసి మన కర్మలకు శిక్ష విధింపబడుచున్నది. మనము దైవము చేతిలో కీలుబొమ్మలము. అతడు తన యిష్టమున్నట్లు మనను ఆడించును.

ఉత్త:- ఇట్లనుట సరికాదు. మీరు కొంత మీ జీవితమును గురించి ఆలోచింపుడు. మీ కెపుడైన మనసునందు పని చేయవలె ననెడి భావము కలుగునా? మీ హృదయమునం దెపుడైనను కొండొక పనిని చేయనా ? వలదా? యను ప్రశ్న ఉదయించునా? అట్టిచో మీరు పరిణామముల గురించి ఆలోచించి బుద్ధి ద్వారా సరిచూచుకొని ఇట్లు చేసెదను, అట్లు చేయును అను నిర్ధారణకు వత్తురు గదా! అట్లైన కర్మ చేయుటలో మీరు స్వతంత్రులని స్పష్టమగుటలేదా? మీ ముందు ఒకటి కాదు, అనేక మార్గము లున్నవి. వాని నుండి మీరు ఒక దానినే ఎన్నుకొని మిగిలిన వానిని వదలివేయుదురు.

ప్రశ్న:- మీరు పారతంత్ర్య స్వాతంత్ర్యముల రెండింటిని అంటిపెట్టుకొని యున్నారు. ప్రపంచమందలి పదార్థములన్నియు ఒక నియంత యాధీనమున నున్నవని, అతని ఆజ్ఞ లేనిదే ఆకైనను కదలదని ఒప్పుకొనుడు. లేదా జీవుడు కర్మచేయుటలో స్వతంత్రుడని యైనను ఒప్పుకొనుడు. రెండు పరస్పర విరుద్ధవిషయములు సరియైన వెట్లు కాగలవు ?

ఉత్త:- మీరు పరస్పర విరోధము లనుకొను విషయము లట్టివి కానే కావు. వాటిని అర్థము చేసికొనుటలోనే మీరు పొరపడుచున్నారు. 'భిన్నము', 'విరోధము' ' అను పదముల అర్థములో భేదము కలదు. పసుపు, ఎరుపు వర్ణములు పరస్పర విరోధములు కావు. కాని "వెలుతురు" , "చీకటి" పరస్పర విరుద్ధములైనవి. ఏ సమయమున ఎక్కడ వెలుగుండునో ఆ సమయమున అక్కడ చీకటి యుండదు. అట్లే జీవుని స్వాతంత్ర్యమునకును ఈశ్వరుని నియంత్రణకును సీమ(ఎల్ల)లు కలవు.

ఆలోచింపుడు. మీరు మాటాడుదురు.మీ నాలుక మీ స్వాధీనమందున్నది. దానితో మీరు శుభాశుభముల రెంటిని ఉచ్చరింపవచ్చును. మీ స్వేచ్ఛ నాలుకతో పని గైకొనునంతవరకే. ఆ పైన ఈశ్వరుని నియంత్రణ గలదు. మీ నియంత్రణ ఏమియు నుండదు. మీరు దానిని నిర్మింపలేదు. నిర్మాణములో ఏదేని దోషము కలిగించుట మీ చేతిలో లేదు. ఐనను అది మీ నాలుకయే. మీ కిష్టమైనట్లుగా దాని నుపయోగించుకొనవచ్చును.

దీని వలన స్పష్టమగున దేమన నీవు కొంతవరకు ఈశ్వరుని నియంత్రణ యందున్నావు. కొంత వరకు స్వాధీనుడవై యున్నావు. స్వేచ్ఛ నీ అనుభవములోనిదే, నీ ఊహ గాదు.

ఉదాహరణకు - ఒక నదిపై గల వంతెనకు రెండువైపుల మనిషి నిలువెత్తున గోడ యున్నది. నీవు దానిపై నడుచుటకు స్వతంత్రుడవు, పరతంత్రుడవు గూడ. ఆ గోడల మధ్య నీవు సంతోషముతో నడువవచ్చును. పరుగెత్తవచ్చును. కాని గోడలను మాత్రము దాటలేవు. వంతెనను నిర్మించినవాడు నీకు కొంతవరకు మాత్రమే స్వేచ్ఛ నొసగెను. ఆపైన పరతంత్రు నొనర్చెను. ఇది నీ మేలును దృష్టియందుంచికొనియే చేయబడినది. ఇదే విధముగా జగన్నియంతగూడ నీ స్వాతంత్ర్య పారతంత్ర్యములకు ఎల్లలుండునట్లు సృష్టి వ్యవస్థను చేసినాడు. ఇది సృష్టి కర్త బుద్ధికిని, నీకల్యాణమునకును సూచకము. నీవు సంపూర్ణ పరతంత్రుడవైనచో నీ వికాసము జరిగెడిది కాదు. నీకు నీబుద్ధిని ప్రయోగించు అవసర మేర్పడెడిది కాదు. ఒకవేళ పూర్ణస్వతంత్రుడవై యుండినచో నీవు చెడుపనుల నొనర్చియు మంచి ఫలముల నాశించెడివాడవు. మరొక విషయము - జీవుడు ఒకడే లేడు గదా! పలువు రున్నారు. జీవులందరకు పూర్ణ స్వేచ్ఛనిచ్చుట అసంభవము. ఏలన ఒకని స్వాతంత్ర్యము రెండవ వాని పారతంత్ర్యమునకు కారణ మగును. బాటలో ప్రయాణికు లందరును స్వేచ్ఛ నుపయోగించ సాగిరేని వాహనములు ఒకదానితోనొకటి ఢీకొనగలవు. కావుననే స్వాతంత్ర్యమునకు గూడ సీమ - పరిమితి ఉండును.

మరొక ఉదాహరణము - పరీక్షార్థి పరీక్షాభవనమున కూర్చొని యున్నాడు. అతని చేతిలో ప్రశ్నపత్రము, సమాధాన పత్రము రెండును గలవు. అందే ప్రశ్నకైనను సమాధానము వ్రాయు స్వేచ్ఛ అతనికి గలదు. కాని అన్యపరీక్షార్థులతో మాట్లాడవీలు లేదు. అనగా అతడు స్వతంత్రుడు, పరతంత్రుడు గూడ. స్వాతంత్ర్య పారతంత్ర్యములకు ఎల్ల లున్నవి. ఈ రెండును పరీక్షార్థి హితమును దృష్టియందిడుకొనియే నియమింపబడినవి. పరీక్షార్థి తాను వ్రాసినదానికి ఫలము గుణముల రూపమున పొందుటకు స్వతంత్రుడే. కాని పరీక్షా సమయము గూడ నియమితమై యుండును గదా! మీరే మందురు? పరీక్షార్థి పూర్ణ స్వతంత్రు డనియా లేక పూర్ణ పరతంత్రు డనియా? రెంటిలో ఏదియును గాదు. జీవులు అసంఖ్యాకులైనందున స్వతంత్రులు కానేరరు. ఒకే యొక దశలో అనగా జీవులు నియమములను స్వయముగా గ్రహించి వాని నుల్లంఘించనంతటి ఉత్తమోత్తమ వికాసము బడసినపు డిది సంభవము కావచ్చును. పరీక్షార్థులందరూ అత్యంత విశ్వాసపాత్రు లైనచో పర్యవేక్షకుల అవసర ముండదు. జీవు లెల్లరు పూర్ణ జ్ఞానులు

లేక ముక్తులు నైనచో ఎవరికిని ఎవరివలనను ఎట్టి భయము నుండదు. జను లెల్లరును పూర్ణ సుశిక్షితులు, విచారశీలురు నైనచ బాటల మలుపులందు రక్షకభటుల నియమించు అవసరము లేకుండెడిది. అప్పుడు సృష్టి అవసరమే లేకుండెడిది. కాని ఏ సృష్టిని గూర్చి మనము సమాలోచించుచున్నామో అందు విభిన్న యోగ్యతలు గల అల్పజ్ఞులైన జీవులున్నారు. కావున వారి స్వాతంత్ర్య పారతంత్ర్యములకు పరిమితులు గలవు. ఆ పరిమితులు కర్మవాదమును బలపరుచునే గాని ఖండింపవు.

ప్రశ్న:- స్వేచ్ఛ ఎప్పుడు సమంజసమో ఎప్పుడు కాదో తెలుపుడు

సమా:- సృష్టి నిర్మాణోద్దేశము జీవుల వికాసమే. వికాసము కొరకు జీవులు తమ బుద్ధిని చొప్పించునట్టి పరిస్థితు లవసరము. అనగా ఆ పరిస్థితులు ఏమి చేయవలెనో, ఏమి చేయగూడదో ఆలోచింపచేయు నట్టివై యుండవలెను. మనుజు డొకవేళ తన యీ స్వతంత్రబుద్ధిని తగినట్లుగా ప్రయోగించినచో అతని పరిస్థితి క్రమ క్రమముగా వికసించును. కాని అతడు బుద్ధి నికృష్ట రీతిలో ఉపయోగించినచో స్వాతంత్ర్యముండును. కాని ఆ స్వేచ్ఛ పరిస్థితుల ప్రతిదినము దూషితము చేయుచుండును. ఈ సృష్టి వ్యవస్థయందు ప్రతి విషయమునకు పరిమితి కలదు. జీవునిస్వాతంత్ర్యము ఈ సీమను చేరుకొని ఆ పైన అది అనత్యపు పారతంత్ర్యమునకు కారణమైనపుడు ఆ స్వాతంత్ర్యము అతనినుండి తొలగింపబడును. సృష్టి నియమము - " ఆగుము ఇంత వరకే. ముందు కేగకుము' అని తెలుపును. మీరు దీని నెన్నో విధముల ఉదాహరణలతో పరీక్షింపవచ్చును. మీకు తీపి ప్రియమైనది. మీరు దానిని మీ యిష్టమున్నంత తినవచ్చును. మిఠాయి పరిమాణమును నిర్ధారించుటయందు మీరు స్వతంత్రులు. ఒకటి, రెండు కాదు పది మోదకములు (లడ్డూలు) తినుడు. మోదకముల పళ్ళెము మీ ముందుంచ బడినది. మీ కవి రుచికరముగా నున్నవి. మీరు తినుచునే యున్నారు. కడుపు నిండిపోయినది. కాని మీరు తినుట మానలేదు. సృష్టి నియమము మీకు పూర్తి స్వేచ్ఛ నొసగుచున్నది. మిమ్మది ఆపుటలేదు. కాని మీరు 'అతి' యొనర్చితిరి. ఆ సీమ సమీపించెను. ఎవరో మోదకము రుచిని తగ్గించినట్లు మీ మనసుకు తోచెను. మోదకము లవియే కాని రుచి తొలగిపోయినది. ఇప్పుడు మీరు తినదలచినను

తినలేరు. సృష్టి విధానము మిమ్ము పరతంత్రు నొనర్చినది. ఏలన మీరు అనుచితమైన స్వాతంత్ర్యము నుపయోగింపదలచితిరి.

పలువురు బందిపోటు దొంగలు బాల్యమునుండి చిన్న చిన్న పనులలో తమ స్వేచ్ఛను దురుపయోగమొనర్చిరని చరిత్ర తెలుపుచున్నది. వారు మొదట మోసగాండ్రుగను, పిదప చిన్న బందిపోటు దొంగలుగను ఆ పిదప గొప్ప అక్రమణదారులుగను, ఆపైన దేశములనే వినాశమొనర్చునట్టి విజేతలు నైరి. ఇదంతయు స్వేచ్ఛ మూలముననే జరిగినది. కాని ఒక సీమకు చేరగనే ఈశ్వరశక్తి "ఇకచాలును"! మీ పరీక్ష జరిగినది, ఇక మిమ్ము ఒక అంగుళమైనను ముందుకు సాగనీయను" అనును. అదియే వారి పతనమున కారంభము. "అసంభవము" అను పదము మూర్ఖుల నిఘంటువు నందే లభించు ననుచుండెడి నెపోలియన్ 'సెంట్ హెలీనా" అను చిన్న ద్వీపమున బందీగా నున్నపుడు తన కిష్టమైన భోజనమును గూడ పొందలేకపోయెను. స్వాతంత్ర్య ప్రేమ అతనిని విశృంఖలు నొనర్చినది. దేశ స్వాతంత్ర్యమునే తన గుప్పిట నుంచుకొని ముందంజవేసిన అతడు దీనుడుగా మరణించెను. ఇట్టి చిన్న పెద్ద ఉదాహరణ లెన్నియో 'జీవుడు తప్పక స్వతంత్రుడే. కాని అతని స్వేచ్ఛకును పరిమితి గల''దని మనకు తెలియపరచుచున్నవి. బాలుడు కత్తితో తన ముక్కును కోసికో బూనినంతనే తండ్రి అతని చేతి నుండి కత్తిని లాగికొనుటకు వివశుడగును. పరీక్షార్థులు పరీక్షభవనమున పరీక్షాపత్రములు వ్రాయుటకు మాత్రమే స్వతంత్రులు గాని బల్లలు విరుగగొట్టుటకు కాదు. స్వేచ్ఛకును నియమములు గలవు.

ప్రశ్న:- సీమిత స్వేచ్ఛ స్వేచ్ఛ యెట్లగును? అది పారతంత్ర్యముగ మారదా?

సమా:- మీరే ఆలోచింపుడు. కర్మ చేయుటలో మీరు స్వతంత్రుని మేమనినపుడు "మీరు" అనగా సమస్త జీవులనియే మా యభిప్రాయము. స్వాతంత్ర్యమునకు సీమ లేర్పరచకున్న ప్రతివానికి పూర్ణ స్వాతంత్ర్యము లభింపజాలదు. ఉదాహరణకు ప్రతివ్యక్తికిని ఎల్లప్పుడు నిరాటంకముగ రాచబాట పై నడచుట కనుమతి యొసగబడినచో ఒకే సమయమున ఇరువురు వ్యక్తులు ఆ యధికారమును వినియోగించుకొన దలచిన ఎట్టి పరిణామ మేర్పడునో ఊహింపుడు. వారిరువురును పరస్పరము ఢీకొనగలరు. ఇరువురి స్వాతంత్ర్యము

గూడ వారి పరతంత్రతకు కారణము కాగలదు. మీ రనెడి స్వాతంత్ర్యము నికృష్టమైన పారతంత్ర్యమునకు మారు రూప మగును. మోహన్ తనను నడువనీయుట లేదని సోహన్ అనును. మోహన్ గూడ సోహన్ తనను నడువనీయుట లేదని నిందించును. ఇదియే స్వాతంత్ర్య దుర్వినియోగమునకు నిదర్శనము. సృష్టిక్రమము మనహితము కోరేదే ఇట్టి స్వాతంత్ర్యము నాటంకపరచును. మనుష్యుడు స్వాతంత్ర్యమును సద్వినియోగమొనర్చినపుడెల్ల అతడు స్వతంత్రుడుగనే యుండును.

జీవుడు శుభాశుభ కర్మల నెందుకు చేయును ?

ప్రశ్న:- జీవుడు శుభాశుభ కర్మల నెందుకు చేయును ?

సమా:- కర్తృత్వము (కర్మ చేయుట) జీవుని స్వాభావిక గుణము. అగ్ని తన గుణమగు వేడిని వదలనట్లుగనే జీవుడు నిష్క్రియుడుగ నుండలేడు.

ప్రశ్న:- కర్తృత్వము జీవుని స్వాభావిక గుణమైనచో అతడు అశుభ కర్మల నేల చేయును ?

సమా:- కర్మ చేయుటకు జ్ఞాన మవసరము. జీవుడు స్వాభావికముగ అల్పజ్ఞుడు. అతనికి పదార్థములను గుర్తించుటకు జ్ఞానమును సంపాదించుట అవసరము. పసి బాలుడు దీపజ్వాలను పట్టుకొని చేతిని కాల్చుకొనును. అట్లే యథార్థ జ్ఞానము లేనందున జీవుడు పొరపాటు చేయును.

జీవుని హితము -కర్మఫలము

ప్రశ్న:- జీవుని హిత మేది? ఈ హితముతో నాతని కర్మల కెట్టి సంబంధము గలదు?

సమా:- తన స్వరూపమును తెలిసికొనుటయే జీవుని హితము.జీవుడు ప్రపంచములోనికి వచ్చి తన స్వరూపమును మరచిపోవును. అతడు తనను జడమనియో, జడపదార్థముల కాశ్రితుడనియో భావించును. ఈయజ్ఞానముతో చేసిన కర్మలు అశుభదాయకము లగును. ఏలన ఇట్టి(అజ్ఞాన)కర్మలెంత అధికముగ చేయునో జీవుడు వానియందు చిక్కుకొని అంతే అధికముగా తన స్వరూపమును మరచిపోవును. కాని తన స్వరూపజ్ఞానమును కలుగజేయునట్టి కర్మలన్నియు శుభకర్మలే.

ప్రశ్న:- ఈశ్వరుని వ్యవస్థ జీవునికి కర్మఫలము ద్వారా హితాహితము ౧ నెట్లు కలుగజేయును ?

సమా:- మన పొరపాట్లు మనను జ్ఞానవంతుల జేయుననుట ప్రత్యక్షమే. ఒకసారి చేతిని కాల్చుకొన్న బాలుడు రెండవసారి దీప జ్వాలను పట్టుకొనడు. ఏలన అతని అజ్ఞానము కొంత తగ్గును. అన్ని కర్మల విషయముననను నిట్లే యని గ్రహించునది.

కర్మఫలముయొక్క రూపము

ప్రశ్న:- పరమేశ్వరుడు కర్మఫలము నే రూపమున నిచ్చును ?

సమా:- కర్మఫలము సుఖదుఃఖముల రూపముననే యుండును. కాని యీ సుఖదుఃఖములను కలిగించు నిమిత్తము లనేక ముండును. ఆ నిమిత్తములు స్వయముగ సుఖమో, దుఃఖమో కాక సుఖము లేక దుఃఖమునకు తప్పక సాధనములై యుండును. ఒక నిమిత్తము ఎప్పుడు సుఖమునకు సాధనమగునో ఎప్పుడు దుఃఖమునకో తెలిసికొనుట కష్టము. ఏలన ఇది యొక క్లిష్టమైన వ్యవస్థ. ఈ వ్యవస్థ చిక్కైనది. దీనిని సంపూర్ణముగ ఈశ్వరుడే యెరుగును. కాని విద్వాంసులు గూడ తమ అనుభవము, తర్కము మరియు శాస్త్రములద్వారా తెలిసికొన గలుగుదురు.

ప్రశ్న:- విషయము స్పష్టముగా లేదు. ఉదాహరణ మొసగి తెలుపుడు.

సమా:- తలను మర్దించుట యొక నిమిత్తము. దీనివలన సుఖము, దుఃఖము రెండును కలుగవచ్చును. సమయము మరియు పరిస్థితి ననుసరించియే దీని నిర్ణయము జరుగును. ఇట్టి సంఘటన లెన్నియో ఒకప్పుడు మనుజుని సుఖమునకు మరొకప్పుడు అతని దుఃఖమునకు సాధనము లగును. ఒకప్పు డొక మనుజునకు సుఖసాధనము లగు నట్టివి మరొకనికి దుఃఖసాధనములు కాగలవు. ఇట్టి యుదాహరణ లందరకు తెలియును.

ప్రశ్న:- ఈశ్వరుడు జీవుడు చేసిన స్వీయ కర్మలకే ఫలము నిచ్చునా లేక ఇతర జీవులు చేసిన కర్మల ఫలము గూడ ఒసగునా ?

సమా:- ఈశ్వరుడు జీవుడు స్వయముగా చేసిన కర్మలకే ఫలమును ఇచ్చును.

ఇతరులు చేసిన కర్మల ఫలము నొసగడు. పరీక్షకుడు పరీక్షార్థికి అతడు వ్రాసిన సమాధానములకు గాక అన్యపరీక్షార్థుల సమాధానములకు గూడ గుణముల నొసగునా? అట్లు చేసినచో అన్యాయమగును. దేవదత్తుడు కర్మ చేయగా దానిఫలము యజ్ఞదత్తునకు లభించినచో అది దయగూడ కాజాలదు. ఏలన జీవుని భవిష్యన్నిర్మాణము ఇతర వ్యక్తుల కాశ్రితమై పోవును. ఒక జీవుని కర్మలకు ఫలము మరొకనికి లభింప మొదలిడెనేని వ్యవస్థయు నిలువజాలదు. జీవులు అసంఖ్యాకములు. కావున ఎవరికర్మఫల మెవరికి లభింపవలె నను నొక జటిల సమస్య యెదురగును. సోహన్ వ్రాసిన దానికి గుణములు మోహన్‌కు ఒసగబడెనేని అది సోహన్ యెడ అన్యాయమగును. కావున ఈశ్వరుడు ఎవరికైనను వారు చేసిన కర్మననుసరించి కర్మచేసిన వారికే ఫలమునిచ్చునుగాని ఇతరుల కివ్వడు.

ప్రశ్న:- **కర్మఫలము ఏరూపమున లభించును?**

సమా:- ఫలమునకు సుఖము లేదా దుఃఖము అనెడి రెండే రూపములు గలవు. శుభకర్మలకు ఫలము సుఖరూపమునను అశుభకర్మలకు దుఃఖరూపమునను లభించును. చిరస్థాయియైనట్టి దుఃఖము లేని సుఖమునే ఆనందమందురు. సుఖమే సుఖము గలట్టి స్థితియే స్వర్గము, దుఃఖమధికముగ నుండు నట్టి స్థితియే నరకము అనబడును.

కర్మఫల వ్యవస్థ

ప్రశ్న:- **కర్మఫల విషయమున ఈశ్వరుని నిర్ణీత వ్యవస్థ ఏదైనా కలదా లేక ఈశ్వరుడు ఎప్పు డెట్లు ఇష్టమున్న అప్పుడట్లే చేయునా ?**

సమా:- ఈశ్వరుని వ్యవస్థ యంతయు నిర్ణీతమైనది, అపరివర్తనశీలమైనది. అందు ఎంతమాత్రము మార్పు జరుగదు. సమస్త జీవుల కర్మకు ఆవ్యవస్థ ననుసరించియే ఫలము లభించును.

ప్రశ్న:- **వ్యవస్థారూపయంత్రము పూర్తిగా నిర్ణీతమైయున్నచో ఈశ్వరుని నమ్మవలసిన అవసరమేమి? సృష్టిక్రమము మాకు వ్యవస్థ కలదని తెలుపుచున్నది. కాని మేము ఈశ్వరుని చూడగలుగుట లేదు. మాకు వ్యవస్థ తోడనే పని గాని వ్యవస్థాపకునితో గాదు. ఈశ్వరుని అస్తిత్వమును గుర్తింపకున్నను వ్యవస్థ అట్లే యుండును. అందు పరివర్తనము కాదుగదా?**

సమా:- వ్యవస్థ నిశ్చితము, అపరివర్తనశీలము ననుట సరియైనదే. కాని వ్యవస్థను స్వీకరించి వ్యవస్థాపకుని గుర్తింపని వ్యక్తి అజ్ఞానదోషమునకు గురియగును. అజ్ఞాన మొక గొప్పదోషము. దాని పరిణామము చెడుగా నుండును. వ్యవస్థాపకుని మరచినచో అతని గుణముల యెడ ప్రీతి యుండదు. వ్యవస్థాపకుడులేని జడవ్యవస్థనే నమ్మునట్టి మనుష్యులు తమ చేతనస్వరూపమును మరచి జడబుద్ధులైపోవుదురు. వారియందు వ్యవస్థాపకుని శుభగుణములు ప్రవేశింపవు.

వ్యవస్థాపకుని విశ్వసించినను విశ్వసింపకున్నను వ్యవస్థానుసారము జీవుని కర్మలకు లభింపవలసిన ఫలమే లభించు నని స్వీకరింతును. కాని వ్యవస్థాపకుని నమ్మకున్నను, అతనిని మరచినను గొప్ప హానియే. ఏమన జీవుని గుణశీలము క్షీణించి దాని ప్రభావ మాతని భావి జ్ఞానకర్మలపై పడును. ఇతరులు తన యునికిని స్వీకరించినను స్వీకరింపకున్నను న్యాయాధీశుడు న్యాయమునే చేయును. కాని తాత్కాలిక కర్మఫలప్రాప్తి కన్న వేరైన న్యాయాధీశుని వ్యక్తిత్వ ప్రభావమునుండి ఆ మనుష్యుడు వంచితుడగును. ఏలన అతడు కేవలము తాత్కాలిక న్యాయముతోనే సంబంధ మేర్పరచుకొని న్యాయము వెనుక గల న్యాయాధీశుని (వ్యక్తిని) చూడనొల్లడు.

కాళిదాసు కావ్యములకన్న కాళిదాసు గొప్పవాడు. అతని కావ్యముల ద్వారా కావ్యములకన్న ఎంతో మిన్నయైన అతని గొప్పతనము పరిచయ మగును. ఏ వ్యక్తి ఆ కావ్యములను జడము లని భావించి కాళిదాసు గుణములను తెలిసికొనదలచడో ఆవ్యక్తి అసంపూర్ణుడే. అతడు ముఖ్య లాభమునుండి వంచితుడును కాగలడు. ఈశ్వరుడు మనకర్మలకు న్యూనాధికము గాకుండ తగిన ఫలము నిచ్చు ననుట సరియైనదే. ఐనప్పటికినీ ఈశ్వరుడు వ్యవస్థాపకుడను విశ్వాసము జీవునియందు అతని భావికర్మలపై ప్రభావము కలుగజేయునట్టి అన్యగుణములను అలవరచుకొను యోగ్యతను గలిగించును. ఈశ్వరుని మరచి కేవలము జడవ్యవస్థనే స్వీకరించువారు జడవాదులై చివరకు జడబుద్ధులే యగుదురు. అంతే గాక వారిలో ఆధ్యాత్మిక సంబంధము కొరవడును.

మనము ఈశ్వరుని వ్యవస్థాపకుడని యంగీకరింపక కేవలము వ్యవస్థ

వరకే మనను సీమిత మొనర్చుకొంటిమేని ఇట్టి వ్యవస్థ ఒక జ్ఞానశూన్య యంత్రముతో సమాన మగును. చేతన జీవనము అచేతన యంత్రమున కధీనమైపోవును. దానివలన వ్యవస్థ శబ్దమే నిరర్థకమైపోవును. చేతనుడు, సర్వజ్ఞుడునైన వ్యవస్థాపకునిపై విశ్వాస ముంచుటవలన మనయాత్మయం దాధ్యాత్మిక భావములు జాగృతమగును. అప్పుడు ఒక మహాచేతన సత్తా మన హితమును దృష్టియందుంచుకొనియే స్థిరము, నిశ్చితము నైనట్టి యొక వ్యవస్థ నేర్పరచె నని మనము గ్రహింపగలుగుదుము.

ఈశ్వరుని వ్యవస్థ నిశ్చితమై, అందెట్టి మార్పునకు అవకాశము లేకున్న ఈశ్వరుని చేతనత్వమే నష్టమై పోవునుగదా యని కొందరనుకొందురు. కాని వ్యవస్థ పరివర్తనశీల మని యంగీకరింతుమేని ఈశ్వరునియందు విశృంఖలత్వ దోషము సంభవించును. ఈ దోషము నుండి తప్పించుటకు ఈశ్వరుని వ్యవస్థ జ్ఞానయుతమును నిశ్చితమును నైనదని అంగీకరించు టొకటే మార్గము. వ్యవస్థను నిశ్చిత మొనర్చుటయు జ్ఞానఫలమే. ఏలన జీవుని కర్మలు శుభములో, అశుభములో విచారించిన పిదపనే గదా ఫలము యొక్క వ్యవస్థ జరుగునది.౨

నిమిత్తము - కారణము

ప్రశ్న:- నిమిత్తమునకును కారణమునకును గల భేదమేమి? కార్యమునకు సరిగా ముందు జరిగిన సంఘటనను నిమిత్త మనియు కారణ మనియు ననవచ్చును గదా?

సమా:- అట్లనుకొనుట పొరపాటు. ప్రతి కార్యమునకు పూర్వమెన్నియో సంఘటనలు జరుగుచుండును. ఎవరు గూడ వాటిని కారణమని భావింపరు. దత్తు అనెడి బందిపోటు హత్యలు చేసిన ఫలితముగ ఉరితీయబడె నని యనుకొనుడు. ౧౦ అక్టోబరు నాడు ఉదయము ౮-00 గంటల కాతడు ఉరితీయబడెను. హత్యలు జరిగి మూడు సంవత్సరములైనది. ఉరితీయబడు క్షణమునకు పూర్వము ఉరితీయబడు స్థానమునను, అన్యస్థానములందును లక్షలాది సంఘటనలు జరిగినవి. ఉరితీయువాడు అతని కంఠమున త్రాడు బిగించెను. అతని బంధువులెందరో ఏడ్వసాగిరి. జైలు వైద్యుడు నిందితుని పరీక్షించు ఏర్పాట్లు చేసెను. ఇతర సంఘటనలెన్నియో ఆక్షణమున జరిగినవి. ఇవన్నియు

ఉరితీయబడుటకు కారణము లని మీ రనగలరా? ఎన్నటికిని అనలేరు. ఉరితీయువాని చర్యలు ఉరికి కారణములు కావు. కాని నిమిత్తములు మాత్ర మగును. ఉరి శిక్షకు మూల కారణ మేదో అది ఉరితీయబడిన క్షణము కన్న చాల పురాతనమైనది. నిమిత్తములే కాని, కారణములే కాని కానట్టి అన్య సంఘటనలు ఎన్నియో ఉండును. ఉదాహరణకు కాకి అరుచుట,జైలులోని కుక్క మొరుగుట మున్నగునవి. ఇవి నిమిత్తములు గాని కారణములు గాని కావు. ఏ క్రియకైనను ముందు జరిగిన సంఘటనలు మూడు రకములుగ నుండును. అవి (౧) కారణములు (౨) నిమిత్తములు (౩) కారణములు నిమిత్తములు కానట్టివి, ఆ కార్యమునకు పూర్తిగా సంబంధించనట్టివి.

మరొక దృష్టాంతము - మోహన్ అనెడి తపాలా బంట్రోతు మీకు ఏబది రూపాయల ధనాదేశము తెచ్చియిచ్చెను. ఆక్షణముననో లేక దానికొక క్షణము పూర్వమో మీ కుక్క మొఱిగెను. మీ ధనప్రాప్తికి కారణమేమనునది ప్రశ్న. కుక్క మొఱుగుటకు ధన ప్రాప్తితో నెట్టి సంబంధమును లేదు. మోహన్ వచ్చుట నిమిత్తము మాత్రమే. ధనాదేశము పంపువాని క్రియయే మీకు ధనము లభించుటకు మూల కారణము.

ప్రశ్న:- నిమిత్తములు మారవచ్చునా? ఒక కార్యమున కెన్ని నిమిత్తములైన నుండవచ్చునా?

సమా:- తప్పక ఉండవచ్చును. ధనాదేశము మోహన్ అను తపాలా బంట్రోతు కాక బలదేవ్ తేవచ్చును. దానివలన మీ కర్మఫలమునందెట్టి ఆటంకము కలిగెడిది కాదు. ఏబది రూపాయలు పదేసి రూపాయల ఐదు నోట్లకు బదులు ఐదేసి రూపాయల పదినోట్లు గాని ఒక్కొక్క రూపాయవి ఏబది నోట్లుగాని ఉండెడివి. మీ పట్ల పరిణామ మొకటే. నిమిత్త కారణముల నొకటిగా భావించుటవలన నెన్నియో భ్రమ లుత్పన్నమగును.

ప్రశ్న:- హిరోషిమా యందు అమెరికావారి బాంబు పడి లక్షల జనులు మరణించిరి. బాంబు వారి మృత్యువునకు కారణమా లేక నిమిత్తమా?

సమా:- మరణించువారి కర్మలే కారణము. బాంబు నిమిత్తము మాత్రమే(3).

ప్రశ్న:- **మరి, అమెరికావారి దోషమేమి?**

సమా:- నిమిత్తమును కారణ మనుకొనుటయే వారి దోషము. కారణమని భావింపనిచో బాంబు వేయుటకు నిశ్చయించుకొనెడివారే కాదు.

ప్రశ్న:- **ఏమీ! ఈ లక్షలాది మనుజులు తమ పాపముల ఫలితముగానే కలిసికట్టుగ మరణము పాలైరా?**

సమా :- కొందరి కర్మలు శుభములును మరికొందరివి అశుభములును నై యుండవచ్చును. వాని పరిణామము మాత్రము మనుష్యుని సామర్థ్యమున కందనిది. మరణించినవారందరకును మంచి యోనులే (జన్మలే) లభించె నని గాని చెడువే లభించె నని గాని నిశ్చయముగా నెవరును చెప్పజాలరు. జీవుని నిత్యత్వమును విశ్వసింపనివారు మరణించినవారు ఝంఝాటమునుండి ముక్తులైరని, అభావమును పొందిరనియే నమ్మవలసియుండును. ఈ సిద్ధాంతము అసంగతమైనదే. కాని మృత్యువు పిదప గూడ జీవుని ఉనికిని నమ్మువారు గూడ మరణించినవారి భవిష్యత్తు చెడుగనో మంచిగనో పరిణమించినట్లు ఎట్టి ప్రమాణమును చూపలేరు. చాలామందికి చెరుపు జరుగవచ్చును. పెక్కు మందికి మేలు జరుగవచ్చును. ఇక మిగిలినది కలిసికట్టుగ అకస్మాత్తుగా మరణించు విషయము. ఈ ప్రశ్న గూడ మన అవివేకమువలననే ఉత్పన్న మగును. ప్రపంచమున ప్రతి క్షణము కోట్ల కొలది ప్రాణులు మరణించుచుండును. ఒక నగర మందలి కసాయిదుకాణమున ప్రతి ప్రాతఃకాలమున వేల సంఖ్యలో పశువులు మృత్యువునకు గురియగుచుండును. ఒకే దినమున నొక దేశమునం దెందరు వ్యక్తులు మరణింతురో మనకు తెలియదు. ఒక స్థలమున జరిగినది మన కళ్ళముందు కాబట్టి మనము భయభీతుల మైతిమి. భేద మింతియే.

ప్రశ్న:- **కర్మఫల సిద్ధాంతము, కారణ కార్య సిద్ధాంతము రెండునొకటేనా? భిన్నములా? భిన్నములేయైన వానికి పరస్పర సంబంధమున్నదా? లేదా? ఉన్నచో అదేమి? లేనిచో ఎట్లు?**

సమా:- కారణకార్య సిద్ధాంతము, కర్మఫల సిద్ధాంతము ఒకటి గావు. వానియందు సాదృశ్యము మాత్రము గలదు. విశేష కారణమువలన విశేష కార్యము

జరుగును.విశేష కార్యమునకు విశేష కారణ ముండును. అట్లే విశేష కర్మకు విశేష ఫల ముండును. విశేష ఫలము విశేష కర్మ పరిణామమే. ఐనను కారణ కార్యమునకు విశేషించి జడ జగత్తుతో నెట్టి సంబంధము నుండదు. జడ జగత్తునందు గతి లేక క్రియ జరుగును. కాని దానిని మనము కర్మ అనజాలము. దాని విషయమున "కర్మణ్యేవాధికారస్తే" ఇత్యాది గీతా శ్లోకములను గాని "సతిమూలే తద్విపాకః" మున్నగు యోగ దర్శన సూత్రములను గాని అన్వయింపలేము. నిప్పునుండి పొగ వెడలును. నిప్పు కారణము, పొగ కార్యము. మట్టితో కుండ సిద్ధమగును. మట్టి కారణము కాగా కుండ కార్య మగును. నిప్పునుండి పొగ తప్పక పుట్టును. మట్టి నుండి కుండ తప్పక ఏర్పడును. కాని అగ్నికి పొగ నుత్పన్న మొనర్చునట్టి, లేదా మట్టికి కుండను చేయునట్టి యోగ్యత కలదని యనలేము కదా! పొగ నుత్పన్నము చేయకుండుట అగ్నివశమున లేదు.కాని దొంగతనము చేయుటయు చేయకుండుటయు మనుష్యుని వశమున నున్నది. అందువలన దొంగతనము మనుష్యుని కర్మ కాగా దండింపబడుట ఆ కర్మఫలమగును. కుండయందు మట్టివలె, మురుగులందు బంగారము వలె, అగ్నియందు పొగవలె కార్యమందు కారణము వ్యాపించి యుండును. కాని ఫలమందు కర్మ వ్యాపించి యుండదు. కారణ కార్యములకు ఘనిష్ఠ సంబంధ ముండును. కాని అట్టి సంబంధము కర్మకును ఫలమునకును ఉండదు. పొగ యున్నచోటెల్ల అగ్ని యుండును. కాని కర్మయుండు చోటనెల్ల ఫల ముండు నని చెప్పజాలము. కారణమందు కార్యము తిరిగి విలీనమగును. ఉదాహరణకు కుండపగిలి మట్టియగును. కాని ఫలము సమాప్తమై అది కర్మయందు లీనముగాదు.

ఇక సాదృశ్యమేమన - కారణము కార్యము కన్న పూర్వ ముండును. కర్మ గూడ ఫలమునకు పూర్వమే జరుగును. కార్యమునకు పూర్వము జరుగు ప్రతి సంఘటనము ఆ కార్యమునకు కారణము కానట్లే ఫలమునకు పూర్వము జరుగు ప్రతి క్రియయు ఆ ఫలమునకు కర్మ కాదు. ఉదాహరణకు - ఒక మనుష్యుడు మరణించెను. ఈ దుర్ఘటన ఒక కార్యము. సరిగా అతని మరణమునకు పూర్వము ఇతర సంఘట లెన్నియో జరిగినవి. కుక్క మొఱిగెను. వృక్షపు ఆకులు కదిలెను, గడియారము గంటలు కొట్టెను. రైలు వచ్చెను. ఇంటి పైకప్పు పడిపోయెను. కాని వాని మరణమునకు కేవలము ఒకే కారణ ముండెను.

అది ఇంటిపై కప్పు పడిపోవు రూపమున కనబడు అతని కర్మఫలమే. ఏలన ఇల్లు కూలుట మరణించినవాని కర్మ కాదు. మృత్యురూప ఫలము మరణించిన వ్యక్తికి సంబంధించిన వేరొక కర్మదే యై యుండనోపు.

కారణ-కార్యము మరియు కర్మఫల సిద్ధాంతము లందు రెంటి నొకటిగానే భావించునంతటి సాదృశ్యము గలదు. కారణ-కార్యమును నిర్ధారించుటయందును తరచుగ పొరపాటు జరుగుచుండును. తరచుగ మనము మొదట జరిగిన ఏదేని సంఘటనను తరువాత జరిగినదానికి కారణ మని యనుకొందుము. ఉదాహరణకు - మనము వ్యాజ్యము కొరకు న్యాయాలయమునకు బోదలచితిమి. ఇంటి నుండి వెడలు నపు డెవరో తుమ్మిరి.మనమువ్యాజ్యమున నోడిపోయితి మనుకొనుడు. అప్పుడు ఆ తుమ్మునే మన ఓటమికి కారణ మందుము. ఇది పూర్తిగ అసత్యము. న్యాయాలయమున తీర్పు అంతకు పూర్వమే జరిగియుండ వచ్చును. అది మనకు తెలియక పోవచ్చును. ఇట్లే ఒకని శత్రువు అతనితో "నీ కుమారుడు మరణించు గాక!" అని యనగా తలవని రీతిలో అతని కుమారుడు చనిపోయినచో అతడు శత్రువు శపించుట కారణము, కొడుకు చనిపోవుట ఫలమని భావించును. ఇటువంటి మంత్ర తంత్రములును, శాపములు పెట్టుటలును తరచుగ జరుగుచునే యుండును. సాధారణ జనులలోను, కావ్యములందును వీని ప్రాచుర్యము గలదు. దిలీపమహారాజు కామధేనువునకు ప్రణామము చేయలేదు. కామధేను వతనిని శపించెను. తత్ఫలితముగ దిలీపునకు సంతానము కలుగలేదు. ఈ కథనమందు కార్యకారణ సంబంధము గాని కర్మఫల సంబంధము గాని గోచరింపదు. సామాన్య జనుల కల్పనలు చాలా వరకు అవైజ్ఞానికములుగను, అదార్శనికములుగను నుండును. కవుల కల్పనలు గూడ నిట్టివే. పురూరవ చక్రవర్తి ఊర్వశి వియోగమున విలపించుచు నడచుచున్న హంసను గాంచి " ఓహంసే! నీవు ఊర్వశి గమనము నపహరించితివి. ఊర్వశి యెచట నున్నదో తెలుపుము" అనెననుట కావ్యకల్పనయే గదా! ఇందు మోహము అజ్ఞానమే గలదు. విజ్ఞానము కాని దర్శనము కాని లేదు.

క్రియమాణ (జరుగుచున్న) కర్మ ఆరంభము నుండి కర్మపరిపాక మగుచు ప్రారబ్ధమునకు చేరుకొని ఫలవంత మగువరకు వానియందు కారణకార్య

సంబంధ ముండును. కారణకార్య సంబంధము గల సంఘటన లెన్నియో యున్నను అది ఒకదాని కొకటి ఫలము మాత్రము కావు.

స్పష్టీకరణకై దిగువ సంఘటనలను పరిశీలింపుడు -

(౧) మోహన్ గోపాలుని ఇంట దొంగతనము చేసెను.

(౨) రెండువందల రూపాయ లతని చేజిక్కెను.

(౩) ఆరూపాయలతో అతడు పిండి, నేయి, చక్కెర కొనెను.

(౪) అతని పరివారము వాని నారగించెను.

(౫) అందరు కలిసి భోజనసుఖము ననుభవించిరి.

(౬) గోపాలుడు తన యింట దొంగతనము జరిగినట్లు రక్షకభటులకు తెలియపరచెను.

(౭) రక్షకభటులు దొంగలను పట్టుకొనుటకు మనుషులను నియోగించిరి.

(౮) నాలుగు మాసముల వరకు అన్వేషణ జరుగగా దొంగతనము చేసినది మోహను డని తెలిసెను.

(౯) మోహనునిపై మరి నాలుగు మాసములవరకు అభియోగము నడచెను.

(౧౦) చివరకు నేరము ఋజువయ్యెను. న్యాయాధీశు డాతనికి ఒక సంవత్సరము శిక్ష విధించెను.

(౧౧) మోహన్‌ను రక్షకభటులు కారాగారమునకు పంపిరి.

వందలాది సంఘటనలు సంక్షేపము కొరకు పైన సూచించినట్లు పదునొకండు విభాగములుగ చేయబడినవి. వాస్తవ మేమన దొంగతనము చేసిన

కర్మకు ఫలితమే కారాగారవాసము. మిగిలిన వందలాది సంఘటనలలో కొన్ని కొన్నిటికి కారణము కాగా కొన్ని అసంబద్ధములును కావచ్చును. ఉదాహరణకు పైన పేర్కొన్న సంఘటనలలోని పరివారము మిఠాయి తినుట మరియు రక్షక భటులకు సూచన- ఈ రెంటికి కర్మతోగాని ఫలముతో గాని ఎట్టి సంబంధము లేదు.

కర్తవ్యము - అకర్తవ్యము

ప్రశ్న:- ఏది కర్తవ్యము ? ఏది అకర్తవ్యము ?

సమా:- ఒక ఉదాహరణను పరిశీలింపుడు. రాజభక్తి యేది? రాజద్రోహ మేది? రాజశాసనమున కాధారభూతమైన మూలతత్త్వములతో సహకరించుట రాజభక్తియు, అందుకు విరుద్ధాచరణము రాజద్రోహము నగును. రాజోద్యోగులకు అనుచితమైన లంచ మిచ్చుట రాజద్రోహ మగును. ఏలన ఈ చర్య శాసనమునకు ఆధారభూతమైన మూల తత్త్వములకు విరుద్ధమైనది. రాజుయొక్క ముఖస్తుతి యొనర్చుట రాజద్రోహ మగును. ఏలన శాసనము యొక్క మూలతత్త్వము రాజు యొక్క స్వేచ్ఛాచరణ సంతృప్తి పై నాధారపడియుండదు. బలహీనులు, స్వార్థులు నైన రాజులు అప్పుడప్పుడు రాజభక్తిని రాజద్రోహముగను, రాజ ద్రోహమును రాజభక్తిగను భావింతురు. ఇది గ్రహణ శక్తి దోషమే.

ఈ యుదాహరణమునే ప్రపంచమునకు వర్తింపజేయుము. విశ్వశాసనమునకు కొన్ని మూలతత్త్వములు గలవు. జీవుల హితమే వాని వాస్తవిక ప్రయోజనము. కావున ఆ మూలతత్త్వములతో సహకరించుట కర్తవ్యము. లేదా శుభకర్మ యగును. వానికి విఘ్నము కలుగజేయు నాలోచన అకర్తవ్యము లేక అశుభకర్మ యగును. వీనినే పురుషార్థము-అపురుషార్థము లందురు. పురుషార్థ శబ్దమున కర్థము "పురుషుని యొక్క అర్థము (ప్రయోజనము) అనగా "జీవుని హితము" అని. జీవుడు కోరినదే జీవుని హితము కాజాలదు. మనుష్యుడు మంచిని, చెడును గూడ కోరుచుండును. కాని అంతిమ ఆధ్యాత్మికోన్నతీ వికాసమే హిత మగును. కావున ప్రపంచము యొక్క ఆధ్యాత్మిక వికాసమున సహాయపడు కర్మయే పురుషార్థమనియు, సహాయపడనట్టి లేక భాధకమగు కర్మయే అపురుష్ఠామని

నిర్ధారణ యగుచున్నది. బాలుకు వ్యాధి స్థితిలో సరిపడని పదార్థములు తినగోరును. వానిని సమకూర్చి పెట్టుటలో బాలుని హితము కాని ప్రయోజనము కాని లేదు. కావున బాలుని కోరికను తీర్చుటయే హితమని భావించుట పొరపాటే.

జీవుడు - బుద్ధి

ప్రశ్న:- మన బుద్ధి మనలను సదా సన్మార్గముననే నడిపింపదు గదా!

సమా:- ఐననేమి? బుద్ధినెట్లు నడిపింపవలెనో అది మీరు చేయవలసిన పనియే కదా! బుద్ధి ప్రయోగము మాత్రమే మీ స్వాతంత్ర్యమును సూచించును.

ప్రశ్న:- ఈశ్వరుడు కొందరకు సద్బుద్ధిని మరికొందరకు దుర్బుద్ధిని ప్రసాదించి మననుండి వివేక స్వాతంత్ర్యములను తొలగింపలేదా? మనకు శ్రేష్ఠబుద్ధియే లభించి యుండిన అసన్మార్గము నవలంబింప కుందుము.

సమా:- కారణము లేనిదే ఈశ్వరుడు మీకు దుర్బుద్ధి నొసగలేదు. మీరు మీ వివేకశూన్య కర్మల ద్వారా మీ బుద్ధిని భ్రష్టమొనర్చుకొంటిరి. మీకు లభించిన త్రాసు మీ అజాగ్రత్త వలన తెగిపోయినచో దోష మెవరిది? ఐనను మీత్రాసు మీచేతనే గలదు. బుద్ధిని ప్రయోగించు అధికారము మీకు ఎల్లప్పుడు నుండును. త్రాసు చెడిపోయిన దని మీకు తెలిసినచో మీరు దానిని సరిచేయ గల్గుదురు. ప్రతి మనుజుడు తన బుద్ధిని జ్ఞాన, కర్మ, జాగరూకతల ద్వారా క్రమముగా ఉత్కృష్టముగ నొనర్చుకొనగల్గును. లేదా చెడగొట్టుకొనగల్గును. సారాయి త్రాగుట వలన బుద్ధిచెడిపోవును. కాని నేయి, పాలు మున్నగువానిని తగురీతిలో నుపయోగించినచో బుద్ధివికసించును. కావున బుద్ధి తారతమ్య దోషమును జగన్నియంతయం దారోపించుటయే దోషము.

ప్రశ్న:- మన బుద్ధులు భిన్నములైనపుడు మన కర్మలును, వాని ఫలములును భిన్నములుగనే యుండును. ఇంక స్వాతంత్రమెక్కడిది?

సమా:- తీక్ష్ణ బుద్ధి గల వ్యక్తి చేయగలుగు పనిని మందబుద్ధి చేయలేడనుట నిజమే. కాని వారిరువురకును కర్మ నెన్నుకొను స్వేచ్ఛ యుండునందుకా లేదా? ఔనన్నచో స్వాతంత్రమున్నదని బుజువగుచున్నది. తనముం దనేక మార్గములు

గలవని చీమకైనను తెలియును. అది యోచించి ఒక మార్గము నెన్నుకొని దాని ననుసరించును. పశుపక్ష్యాదుల పరిస్థితియు నిట్టిదే. మీ ప్రాంగణములోనికి వచ్చెడు కాకులు, ఇతర పక్షులు గూడ ఆలోచించియే ఒక మార్గమును వదలి మరొక మార్గము ననుసరించుచున్నట్లు గోచరించును. అందువలన వానికి కర్మ చేయుటయందు స్వాతంత్ర్యము కలదని ఋజువగుచున్నది. యజమాని ననుసరించి నడచుచున్న కుక్కను మీరు నిశితముగ పరిశీలించితిరేని ఏమి చేయవలెనో, ఏమి చేయగూడదో యని అది నిరంతర మాలోచించుచున్నట్లు మీకు తెలియును.

భాగ్యము ప్రబలమా? పురుషార్థమా?

ప్రశ్న:- భాగ్యముప్రధాన మైనదా ? లేక పురుషార్థమా?

సమా:- పురుషార్థమే ప్రధానమైనది. ఏలన భాగ్యము పురుషార్థము యొక్క ఫలమే గదా! కర్మచేయనంతవరకు ఫలము లభింపజాలదు.

"కర్మ ప్రధాన్ విశ్వ కర్ రాఖా, జో జస్ కరై తో తస్ ఫల్ చాఖా."

పురుషార్థము కర్మకాగా అదృష్టము దాని ఫలమగుచున్నది.

ప్రశ్న:- మరి పురుషార్థమే చేయుచుండవలెనా?

సమా:- ఔను, కాని ఏది పురుషార్థము, ఏది కాదు అనునదే సమస్య.. మనుజుడు చేయునట్టి ప్రతికర్మ పురుషార్థము గాని, పారిభాషికార్థమున కర్మ గాని కాదు.

"కిం కర్మ కిమకర్మేతి కవయోఽ ప్యత్ర మోహితాః ॥ గీత ౪ -.౬॥

పలువురు కుకర్మలను గూడ పురుషార్థ మని భావింతురు. ఒక పరీక్షార్థిని ఉదాహరణగ గైకొనుడు. ఏదేని పరీక్షలో నుత్తీర్ణత నొందుట ఫలము. ఆఫలమును పొందుటకై యత్నించ వలసియుండును. సరియైన పద్ధతి ననుసరించి జాగరూకతతో నిరంతర మధ్యయన మొనర్చుట పురుషార్థమగును. అనిష్ట పద్ధతుల నవలంబించి పరీక్షాభవనమున చూచి వ్రాయుట, పరీక్షకులను బెదిరించుట, వారిపై ఒత్తిడి తెచ్చుట లేక యితర యుక్తుల ప్రదర్శించుట కర్మ లనబడును. కాని వానిని శుభకర్మలందు గాని పురుషార్థమునందు గాని గణింపజాలము. ప్రతి చతురతను,

వంచనను, కపటమును, మోసమును పురుషార్థ మని భ్రమించి జనులు దుష్కర్మలందు తగుల్కొనియుందురు. ఆ దుష్కర్మలకు ఫలము చెడుగనే యుండును. సామాన్యముగ జనులందు ఉపాయము, భాగ్యము గురించి చర్చ జరుగుచునే యుండును. చాతుర్యముతో చేయబడు ప్రయత్నమునే ఉపాయము లేక పురుషార్థమని భావించుట జరుగుచున్నది. లంచ మిచ్చుట, అబద్ధమాడుట, చాతుర్యమును ప్రదర్శించుట మున్నగున వన్నియు పురుషార్థము లని యనుకొనబడును లంచ మొసగని, మాయోపాయములు పన్నని వ్యక్తిని ''ఇతడు నిదురబోవుచు ఎట్టి ప్రయత్నము చేయలేదు, పురుషార్థము చేయకుండనే ఫలము లభించునా యేమి?" అందురు. ఇట్లు లోకమున శుభకర్మలను పురుషార్థములుగ భావించుట లేదు. ఈ కారణముననే పాపకార్యములందు ప్రవృత్తి పెరుగుచు అది దుఃఖమునకు కారణ మగుచున్నది. వాస్తవమున కర్తవ్యపాలనమే పురుషార్థము. మిగిలిన వన్నియు పురుషార్థమునకు, నిజమైన ఉపాయములకును భిన్నములు మాత్రమే.

యోగదర్శనము - కర్మ

ప్రశ్న:- యోగదర్శనమందు కర్మవిషయమున ఈ క్రింది రెండు సూత్రములు గలవు

"సతి మూలే తద్విపాకో జాత్యాయుర్భోగాః ।। యోగ.॥ 3-౧౩॥

తే హ్లాద పరితాపఫలాః పుణ్యాపుణ్య హేతుత్వాత్॥ యోగ. 3-౧౪ ॥

కర్మ మూలము మిగిలి యున్నపుడు అది పరిపక్వము జెంది జాతి లేక జన్మ, ఆయువు మరియు భోగముల రూపమున ప్రకట మగును. జన్మ, ఆయువు భోగము లనునవి వ్యక్తియొక్క పుణ్యాపాపముల ననుసరించి సుఖదుఃఖరూప ఫలముల నొసగును.

ఇచట కర్మఫలము సుఖదుఃఖముల రూపమున నుండునా లేక ఆయుఃపరిమాణము మరియు భోగముల రూపమున నుండునా? అను ఒక ప్రశ్న పొడమును. భోగ మనునది సుఖదుఃఖములకు భిన్నమైన పదార్థమా? ఐనచో అది

యేమి? అనునది రెండవ ప్రశ్న. మూడవ ప్రశ్న - కర్మఫలము సుఖము లేక దుఃఖమే యైనచో "జాతి, ఆయువు" అను అవసర మెందు కేర్పడినది? నాలుగవ ప్రశ్న - ఈ జాతి, ఆయువు, భోగములు పూర్వకర్మలననుసరించియే నియతమై యుండుచో భవిష్యత్తులో స్వతంత్ర కర్మ లొనర్చు అవకాశమేమైన ఉండునా? మన ప్రతికర్మయు కేవలము భోగము ననుభవించు నొక విధానమేనా? తెలుపుడు.

సమా:- జాతి, ఆయువు, భోగము ఈ మూడును జీవితమునకు ఒక విధమగు అంగప్రత్యంగములే గదా! నేను మానవునిగనో కుక్కలేక పిల్లిగనో జన్మించితి ననుకొనుడు. ఇదియే జాతి. అనగా నేనొక విశేష యోనియందు ప్రవేశపెట్టబడితినని శ్రీభావము. నేను కొంతకాలము ౬౦ - ౭౦ సం ॥లు ఆ యోనియందే యుందును. ఇదియే ఆయువు. విభిన్న వయస్సులలో విభిన్న అనుభూతు లేర్పడును. ఇవియే భోగములు. సుఖదుఃఖము లనునవి భోగములకు గలరెండు రూపములే. కాని మన యనుభూతు లన్నియును కేవలము దుఃఖములో, సుఖములో గాక సుఖదుఃఖముల మిశ్రమమై యుండును. జీవుడు కేవలము సుఖదుఃఖముల ననుభవించువాడే కాదుగదా! కర్తృత్వ జ్ఞాతృత్వములు గూడ అతని గుణములే. మన మేదో యొక జ్ఞానమును పొందుచునే యుందుము. ఒకే విధమైన జ్ఞానము వలన నొకప్పుడు సుఖమును మరొకప్పుడు దుఃఖమును కలిగినను నా జ్ఞానము సుఖదుఃఖములకు భిన్నమైనది. ఉదాహరణకు - నాపొలమున పదిమణుగుల గోధుమలు పండిన వనుకొనుడు. ఇది తెలిసి నాకు సుఖము, దుఃఖము రెండును కలుగవచ్చును - ఎట్లన - మొత్తము గ్రామమందలి కర్షకుల క్షేత్రములందు ఐదేసి మణుగుల పంటయే పండగా నా క్షేత్రమున పది మణుగులు పండినట్లు తెలిసిన నాకు మిగతావారికన్న అధిక పంట పండినందున సంతోషమే కలుగును. అట్లు గాక నా పొరుగువారి క్షేత్రమందు ౧౫ మణుగులు పండినట్లు తెలిసినచో నా క్షేత్రమున తక్కువ ఎందుకు పండెనా యని నాకు దుఃఖము కలుగును. నాకు పండిన పదిమణుగుల జ్ఞానము పై రెండు సందర్భములందును ఒకటిగనే యుండెను. కాని అది ఒకప్పుడు సుఖమును మరొకప్పుడు దుఃఖమును కలుగజేసినది. మనము నిరంతరము కర్మచేయుచునే యుందుము. ఆ కర్మలవలన ఒకప్పుడు సుఖమును మరొకప్పుడు దుఃఖమును కలుగుచుండును.

మనశరీరమున ఐదు జ్ఞానేంద్రియములును, ఐదు

కర్మేంద్రియములును గలవు. భోగేంద్రియములు లేవు. ఐనను ప్రతి కర్మయు, ప్రతిజ్ఞానమును ఒకప్పుడు సుఖ రూప ఫలము మరొకప్పుడు దుఃఖ రూపఫలము గలదిగా నుండును. ఇట్లు పూర్వకర్మలు మనకు జాతి, ఆయువు, భోగముల రూపమున ఫలించినట్లు గోచరించును. కాని యిది జీవితవికాసమే. జీవితమునకు వీనికి భిన్నమైనట్టి స్వీయోద్దేశమొకటి గలదు. అది జ్ఞాన,కర్మలకు సంబంధించినది. జ్ఞానము లేనిదే మోక్షము కలుగదను నానుడి కలదు. ఋతేజ్ఞానాన్న ముక్తిః. జ్ఞానమునకు అజ్ఞాన (అవిద్యా) నాశన మని అర్థము. దీనికి స్వస్వరూప జ్ఞానము లేక తన స్వరూప విషయమున అజ్ఞాననివృత్తి అను అర్థాపత్తి కలదు. ఈ జ్ఞానోపలబ్ధియు, అజ్ఞాననివృత్తియు ప్రయత్నము లేనిదే కానేరదు. కొన్ని కర్మలు తప్పనిసరిగ చేయవలసియుండును. కావున జీవిత ముఖ్యోద్దేశము స్వతంత్రకర్మలును, వానివలన నుత్పన్నమగు జ్ఞానము లేక జ్ఞానశక్తియే యగుచున్నది. అందువలన కర్మవిపాక రూపములు జాతి, ఆయువు, భోగము లని సూచించిన సందర్భమున జీవన రూపసాధనాంగముల వర్ణన చేయబడినది. జీవనోద్దేశ వర్ణన చేయబడలేదు. యోగదర్శనమున తరువాతి సూత్రము శిష్యుని హెచ్చరించుచున్నది.

పరిణామ తాప సంస్కార దుఃఖైర్గుణవృత్తివిరో ధాచ్చ
దుఃఖమేవ సర్వం వివేకినః ॥ యోగద. ౨-౧౫॥

అనగా జ్ఞానియైన మనుజునకు సుఖదుఃఖ రూపఫలములొసగు జాతి, ఆయువు, భోగములు గూడ దుఃఖకారణములే యగును. జ్ఞానులు దీనివలన సంతోషము పొంద రనియే దీని భావము. ఈ సంతోషలేమికి నాలుగు కారణములు చూపబడినవి.

౧ <u>**పరిణామములు**</u> :- ఇవి ఎల్లప్పుడు (ఏకరసముగ) ఒకే విధముగ నుండవు. వీనిని సంతోషసాధనము లనుకొనుట సరికాదు.

౨.<u>**తాపములు**</u> :- వీని సుఖము గూడ దుఃఖమిశ్రిత మైనదే.

3. <u>**సంస్కారములు**</u> :- ఇవి మనస్సును ప్రభావితమొనర్చి మనో వృత్తులను రంజిత మొనర్చును.

౪. దుఃఖములు౹౹౪౹౹- వీని వలన సాక్షాత్తు దుఃఖమే కలుగును. ఇవిగాక ఆయువునకు సమస్త వస్తువులతో సత్వరజస్తమోగుణ సంబంధమైన ప్రాకృతిక గుణవిరోధము వెన్నంటియే యున్నది. కావున మనుజుడు వీనితోడనే సంతుష్టుడు గాక ఇంకా ఉన్నత స్థానమును చేరి అంతిమధ్యేయమును గూర్చి ఆలోచింపవలసి యున్నది. మనుష్య డింతటితోనే తృప్తి జెందక ఉన్నతిని బడయుటకై సూత్రకారుడు సాధనపాదమందు విభిన్న సాధనములను పేర్కొనినాడు.

కర్మ, జ్ఞాన, ఉపాసనా కాండములు

ప్రశ్న:- కర్మ, జ్ఞాన, ఉపాసన అనెడి మూడు కాండముల నామములను వినుచుందుము. ఈ కాండములకు కర్మ సిద్ధాంతముతో గల సంబంధమేమి ?

సమా:- జీవుని లక్షణము -"కర్తృత్వజ్ఞాతృత్వభోక్తృత్వవానణుః జీవ ఇత్యుచ్యతే॥" కర్తృత్వ జ్ఞాతృత్వ భోక్తృత్వమను మూడుగుణములు దేనియం దగుపడునో అదియే జీవుడు లేక చేతనుడు. జడవస్తువు నుండి చేతన వస్తువును వేరుపరచి చూపు గుర్తు ఇదియే. కీటకములు, పక్షులు మొదలు మనుష్యుల వరకు గల చేతన పదార్థము లన్నింట జ్ఞానము, క్రియ, మరియు సుఖ దుఃఖములు (భావము) గోచరించును. ఆధునిక వైజ్ఞానికులు గూడ మానవ మస్తిష్కమున మూడు విశిష్టతలు గలవని తెలిపినారు. అవి జ్ఞానము (నాలెడ్జి లేక కాగ్నిషన్), సుఖ దుఃఖము లేదా భావము (ఫీలింగ్ లేక కొనేషన్), క్రియ లేక ఇచ్ఛా శక్తి (విల్ లేక వోలిషన్) అనునవి. ఇవియే జ్ఞానోపాసన కర్మకాండములు . ఉపాసనా కాండమును భావనాకాండ మనియు నందురు. ఈ కాండములు మూడైనను ఇవి సర్వథా భిన్నములు, అసంబద్ధములు గావు. మానవ మస్తిష్కపు జ్ఞాతృత్వ, కర్తృత్వ, భోక్తృత్వ శక్తులను పూర్తిగా వేరుచేయ జాలము. ఏలన ఇవి ఒకే పదార్థమునకు గల మూడు గుణములు. అట్లే జ్ఞాన, కర్మ, భావనా కాండములను గూడా పూర్తిగా వేరుపరచలేము. ఏలన ప్రతి ప్రాణి జీవనమున ఈ మూడు కాండములు గోచరించును. ప్రాణి ఏదేనొక క్రియ యొనర్చు చుండును. ఇదియే కర్మకాండము. అతనికి కొంత సుఖమో, దుఃఖమో ప్రాప్తించును. ఇదియే ఉపాసనా కాండము లేక భావనాకాండము. గోడ యొక్క పొడవు, వెడల్పు, మందములను గోడనుండి వేరు పరచి చూపలేము. ఐనను పొడవు, వెడల్పు, మందము లనునవి మూడు

గుణము లని అర్థము చేసికొనునట్లే జ్ఞాన, కర్మ, భావములను గూడ గ్రహింపగలము.

జ్ఞానకాండమునందు సమ్యక్ జ్ఞానము, అసంపూర్ణ జ్ఞానము, విపరీతజ్ఞానము మున్నగునవి ప్రమాణము, విపర్యయము, వికల్పము, నిద్ర, స్మృతి మొదలుగునవి అన్నియు చేరియుండును. భ్రమ మూలకమైన జ్ఞానము గూడ జ్ఞానకాండములోని భాగమే. మనస్సుతోను కర్మేంద్రియములతోను చేసిన శుభాశుభకర్మ లన్నియు కర్మకాండమున చేరును. పలువిధములైన సుఖదుఃఖములును, సర్వోత్కృష్టమైన ఆనందమును ఉపాసనాకాండమున చేరియున్నవి.

కర్మ సిద్ధాంతమున ఈ మూడును చేరియున్నవి. ఎట్లన మనము స్వతంత్రముగ కర్మలు చేయబూనినపుడు ఏ పని (క్రియ) చేయదగునో, ఏది చేయదగదో యని ఆలోచింతుము. ఇందు జ్ఞానము లేక జ్ఞాతృత్వశక్తిని ఉపయోగింపవలసి వచ్చును. ఆ కర్మకు సుఖము లేక దుఃఖరూపమున లభించు ఫలము భావనా (ఉపాసనా) కాండమున చేరును. జ్ఞానకాండ సంబంధమైన సర్వోత్కృష్ట విషయమును విద్య లేక విజ్ఞానమందురు. ఇందు భ్రమలేక అవిద్య యెంత మాత్ర ముండదు. కర్మకాండ యొక్క సర్వోత్కృష్టమైన విషయమునకే పరోపకార మని పేరు. ఇందు స్వార్థము ఎంతమాత్ర ముండదు. భావనాకాండపు సర్వోత్కృష్టమైన విషయమునకు ఆనంద మని పేరు. ఇందు దుఃఖ మేమాత్ర ముండదు.

జీవుడు చేతనుడు. ఈశ్వరుడు గూడ చేతనుడే. ఈశ్వరునియం దీ మూడు కాండములను చూడవచ్చును. కాని ఈశ్వరుడు పూర్ణజ్ఞాని - సర్వజ్ఞుడు. అతని యందు అవిద్య లేనేలేదు. అతని జ్ఞానకాండము శుద్ధజ్ఞానమయము. మానవుని జ్ఞానకాండమున అంతటి స్వచ్ఛత గోచరింపదు. ఏ కొంతయైనను అజ్ఞానము, విపరీత జ్ఞానము లేక అసంపూర్ణజ్ఞానము ఉండును. ఈశ్వరుని కర్మకాండయందు లవలేశమైనను స్వార్థములేదు. పరిశుద్ధమైన పరోపకారము గలదు. అతని కార్యములనంతములు. ఐనను ఒక్కటి గూడ స్వార్థమునకు సంబంధించి యుండదు. అన్నియు పరుల కొరకే. అందువలన శుభాశుభములనెడి

ప్రశ్నయే యుదయింపదు. ఈశ్వరుడు శుభమునే చేయును. అశుభమును చేయనే చేయడు. కావున నాతని కర్మలకు సుఖదుఃఖరూప ఫలముల ప్రసక్తియే యుండదు. అతని భావనా (ఉపాసనా) కాండము సంపూర్ణముగ శుద్ధము, నిర్మలము. ఆతని యానందమున కెప్పుడును లోపము కలుగదు. కావున దుఃఖముగూడ కలుగదు. సుఖము సమకూడిన మనుజునకు ఆ సుఖము నష్టమగునదేయను నాలోచనవలన దుఃఖభావన సదా వెన్నంటియే యుండవచ్చును. కావున ఈశ్వరుడు ఇతర చేతన పదార్థములకన్న విలక్షణుడు. ఈ విషయమును ప్రదర్శించుటకు యోగదర్శనమున దిగువ సూత్రము చెప్పబడినది:

"క్లేశకర్మవిపాకాశయైరపరామృష్టః పురుష విశేష ఈశ్వరః ॥౧ ౨౪॥

ఈశ్వరుని కర్మలు శుభాశుభములనెడి రెండు భాగములలో విభజింపబడవు. అందుచే అతని కర్మలకు సంచిత, క్రియమాణ, ప్రారబ్ధ భేదములు గాని, కర్మవిపాకములు గాని ఉండవు. కావున కర్మ సిద్ధాంతము ఈశ్వరునకు వర్తింపదు. శాసనమున దండవిధానము (క్రిమినల్ కోడ్) శుభకర్మల నొనర్చువారికి గాక అశుభకర్మలు చేయువారికి, చేయగలుగువారికి మాత్రమే ఉద్దేశింపబడును. అట్లే కర్మ సిద్ధాంతము లీశ్వరునకు వర్తింపవు. మనుష్యుడు ఈ మూడు కాండముల పరస్పర సంబంధమును తెలిసికొని తన జ్ఞాన, కర్మ, భావములను సర్వోత్కృష్టముగను లేదా ఇంచుమించుగ ఈశ్వరునివలె నొనర్చుకొనినచో నతడు కర్మబంధనము నుండి విడివడి మోక్షమును పొందును. ఉపనిషత్తులో -

భిద్యతే హృదయగ్రంథిశ్ఛిద్యంతే సర్వసంశయాః।

క్షీయంతే చాస్యకర్మాణి తస్మిన్ దృష్టే పరావరే॥

అని చెప్పబడినది. అనగా ఎప్పుడైతే మనుష్యుడు ఈశ్వరుని సర్వవ్యాపకుడను భావముతో చూచునో అప్పుడే అతని హృదయ గ్రంథి విడివడును. అతని సంశయుము లన్నియు తొలగును. అనగా అతని జ్ఞానకాండము అవిద్యాశూన్యమును, నిర్మలమును నగును. అప్పుడు అశుభకర్మలు చేయు అవకాశ ముండదు. కర్మలన్నియు (విపాకకర్మలు) క్షీణకర్మ లగును. కర్మ, జ్ఞాన కాండములు నిర్మల మగుటతోడనే భావనా (ఉపాసనా) కాండము గూడ నిర్మల మగును. దీనినే

కైవల్యము లేదా మోక్ష మని యందురు.

ప్రశ్న:- హోమ, యజ్ఞాదు లొనర్చువానినే జనులు కర్మకాండి యందురు. కృషి, వ్యాపార, వ్యవసాయాది కర్మలు గూడ కర్మకాండములోని భాగములేనా?

సమా:- ఈ విషయమున జనులలో భ్రాంతి గలదు. హోమాదులు కర్మయొక్క భాగము మాత్రమే. మన జీవితములోని శుభాశుభకర్మ లన్నియు కృషి, వ్యవసాయమే కాదు జార చోరత్వముల వంటివి గూడ కర్మకాండాంతర్గతములే. పంచ మహాయజ్ఞము లనబడు వానియందు కేవలము హోమమే కాక అన్యశుభకర్మలును గలవు. వానియందు జ్ఞాన, కర్మోపాసనలు మూడును చేరియున్నవి. మనుష్యుని జీవితమునందలి ఏ క్రియ లేక సంఘటన యైనను ఈ మూడు కాండములకు వేరుగ నుండదు. కర్మ సిద్ధాంతము ఈ మూడు విభాగముల సంతులనము నేర్పరచి యుంచుమని నొక్కి చెప్పుచున్నది. ఇవన్నియు చివరికి మోక్షప్రాప్తికే యని గ్రహింపవలెను.

కర్మ - ఆత్మవికాసము

ప్రశ్న:- ఆత్మ వికాసము లేక ఆత్మోన్నతియే సృష్టి ప్రయోజనమైనచో ఆత్మవికాసముపై సుఖదుఃఖముల ప్రభావ మెట్లుండును?

సమా:- సుఖము ఆత్మకు భోజనము కాగా దుఃఖము ఔషధ మగును. సుఖమును పొందిన ఆత్మ ఇష్టమైన కార్యములు చేయుటకు ఉత్సాహము చూపును. దుఃఖములు దానిని అనిష్ట కార్యము లొనర్పకుండ నిరోధించును. ఇట్లు సుఖదుఃఖములు రెండునుఆత్మ వికాసమునకు సాధనములే.

ప్రశ్న:- మనుష్యుడు సుఖమును పొంది సోమరి, గర్విష్ఠి, అజాగ్రత్తపరుడు, ప్రమాది కాడా? దుఃఖములవలన నాతనికి నిరాశ, మనోదౌర్బల్యము, ఆత్మగ్లానియు కలుగదా?

సమా:- అప్పుడప్పు డిట్లగును. కాని బుద్ధిమంతుడు తన నీ దుర్గుణముల నుండి కాపాడుకొనును. ఎల్లప్పుడు సుఖము కరువైనచో జీవనము కఠిన మగును. దుఃఖము గూడ మేర మీరినచో సహింపరాని దగును. దుఃఖముల ముఖ్యోద్దేశము పాపప్రవృత్తిని నిరోధించుటయే. పుణ్య ప్రవృత్తిని వికసింపజేయుటయే సుఖముల ముఖ్యోద్దేశము. బుద్ధిమంతుడు పరిస్థితుల నుండి సరియైన లాభమును

పొందగలడు. కావున కర్మచేయుటకు బుద్ధివికాస మవసరము:

సుఖదుఃఖములకు జ్ఞానస్థాయితో గల సంబంధము

ప్రశ్న:- సుఖ దుఃఖములకు జీవుని జ్ఞానస్థాయితో గూడ సంబంధ మున్నదా?

సమా:- ఉన్నది. ఆత్మ సుఖదుఃఖముల మూట మాత్రమే కాదు గదా! ఆత్మగుణములు ఆరు. అవి - సుఖము, దుఃఖము, ఇచ్ఛ, ద్వేషము, జ్ఞానము, ప్రయత్నము అనునవి. ఈ ద్వంద్వముల నేకీకృత మొనర్చి కర్తృత్వ, జ్ఞాతృత్వ, భోక్తృత్వ మనెడి మూడు విభాగములు చేయవచ్చును. జీవుడు జ్ఞాత, కర్త, భోక్త గూడ. జ్ఞాతృత్వము జ్ఞాన సూచకము, కర్తృత్వము కర్మలేక ప్రయత్నసూచకము., సుఖ దుఃఖములు భోక్తృత్వసూచకములు - ఇచ్ఛా ద్వేషములను సీమాంత ప్రదేశము లనుకొనుడు. అనగా వానియందు సుఖముల ననుభవించు జ్ఞానము, ప్రయత్నము రెండును విచిత్ర రూపమున కలిసి యుండును. ఈ యారింటితో నొక యంతస్తు (లెవెల్) ఏర్పడును. ఈ యంతస్తు ఉత్తరోత్తర వృద్ధి లేక క్షీణతను పొందుచుండును. ఈ వృద్ధి క్షయములు జీవుని జ్ఞాన, ప్రయత్నముల స్థాయి ననుసరించి యుండును. ఈ జ్ఞానప్రయత్నముల రెంటిపైనను సుఖదుఃఖముల ప్రభావము పడును.

ప్రశ్న:- ప్రాణికి ఏవస్తువులవలన దుఃఖము మరియు వేనివలన సుఖము కలుగును?

సమా:- దుఃఖము - దుఃఖసాధనములందు భేదము కలదు. అట్లే సుఖము- సుఖసాధనములందును భేదము గలదు. ఒక వస్తువు సుఖదాయకము గాని, దుఃఖదాయకము గాని కాదు. దాని వలననే సుఖము, దుఃఖము రెండును లభింపగలవు. ప్రపంచమున సుఖ సాధనము లధికముగ నున్నట్టి వ్యక్తి సుఖవంతుడనియు, అట్టి సాధనములు లేనివాడు దుఃఖితుడనియు భావింపబడుచున్నది. ఇది భ్రమయే. గుడిసెలలో సుఖవంతులుగను, మేడలందు దుఃఖితులుగను నుండువారిని చూచుచుందుము. తీవ్ర రోగిని సుఖపూర్వకముగ నిదురించుచుండగను, పూర్ణస్వస్థుడైనవానిని విచారగ్రస్తునిగను మనము చూచుచున్నాము. కావున బాహ్యసాధనములను గాంచి వ్యక్తి సుఖవంతుడో, దుఃఖితుడో నిర్ణయించుట పొరపాటే. సుఖ దుఃఖములు ఆంతరికములు.

బాహ్యములు కావు. ఒకే సంఘటన ఒక వ్యక్తికి సుఖమును, మరొక వ్యక్తికి దుఃఖమును కలుగజేయును. ఒక వ్యక్తి మరణము అతని స్నేహితులకు దుఃఖమును, శత్రువులకు సుఖ(సంతోష)మును కలిగించును. ఒక విధమైన సంఘటన ఒకప్పుడు దుఃఖమును, మరొకప్పుడు సుఖమును కలిగింపవచ్చును. కావున బాహ్యసాధనములను సమకూర్చుకొనిన సరిపోదు. ఆంతరిక వృత్తియు కావలెను. ఈ వృత్తుల నిర్మాణమున జ్ఞానము, ప్రయత్నము, సుఖము, దుఃఖము-అన్నింటి తోడ్పాటు కలదు.

ప్రశ్న:- సుఖోపకరణ మెల్లప్పుడు సుఖమును, దుఃఖోపకరణ మెల్లప్పుడు దుఃఖమును కలిగింపనిచో వానిని సుఖదుఃఖోపకరణములుగా నేల పేర్కొందురు ?

సమా:- దీనికి కారణమేమన - సాధారణ పరిస్థితిలో వృత్తులు సామాన్యముగా నున్నచో ఆ సాధనములను సుఖమునో దుఃఖమునో పొందుటకు ప్రయోగింపవచ్చును. కాని అనుకున్నట్లే జరుగుట తప్పనిసరి కాదు. . రొట్టె తినుట వలన కడుపు నిండుటే గాక ఆరోగ్యము ప్రాప్తించును. కాని రోగము కూడ కలుగవచ్చును. కావున కారణము మరియు సాధనములందు సదా విచక్షణ చేయు టవసరము. సాధనములను సమకూర్చుకొనినంత మాత్రముననే సుఖము లేక దుఃఖము లభింపదు. కావున సాధనములను సమకూర్చుకొనునపుడు వాని వలన సుఖము లభించునా లేదా యనునది గమనింపవలెను. అట్లే దుఃఖోపకరణములు ప్రాప్తించినంత మాత్రముననే భయపడవలసిన పని లేదు. ఘోరమైన దుఃఖోపకరణములసైతము స్వీయ మానసిక వృత్తులచే సుఖసాధనములుగ మార్చవచ్చును. ఉదాహరణకు విషము మృత్యుసాధన మైనప్పటికిని బుద్ధిని ఉపయోగించినచో నది రోగనివృత్తికి సాధనము కాగలదు.

సమాజము యొక్క కర్మల ఫలము వ్యక్తి అనుభవింపవలసి వచ్చునా?

ప్రశ్న:- ఈశ్వరుడు సమాజము చేసిన శుభాశుభకర్మల ఫలమును నాకు ఒసగడా?

సమా:- సమాజము నీచేత నియమితమైనది గాన దాని పరిధి గూడ నీ కల్పన లేదా నీ వ్యవస్థ ననుసరించియే యుండును. సమాజమం దనేక వ్యక్తు లుందురు.

కావున సమాజము యొక్క శుభాశుభకర్మల ఫలము మీకు లభింప మొదలిడినచో ఘోరమైన అన్యాయమే యగును. సమాజమందలి ఇతర వ్యక్తులపై అధికారము నెరపుట ప్రతివ్యక్తికిని సాధ్యమైన పని కాదు. అట్టి యెడ నా వశమున లేనిదాని కర్మలకు ఫలము నా కెందుకు లభింప వలెను? అట్లు లభించుట ఈశ్వరుని వ్యవస్థ, న్యాయము, దయ ఈ మూడింటి యందును బాధకమగును. కావున కర్మఫల సిద్ధాంతము 'నీవు ఎట్టికర్మల నొనర్తువో అట్టి ఫలమునే పొందుదువు" అని తెలుపుచున్నది. ఇచట నీవు అనగా నీవే-వ్యక్తివే. కాని నీకన్న అన్యులు, వ్యక్తులు, సమాజము, దేశీయులు, అన్యదేశీయులు-ఎంత మాత్రము కాజాలరు.

ప్రశ్న:- విపత్తులందు మనమిత్రులు మనకు సహాయపడుచుండుటయు, శత్రువులు మన దుఃఖములను వృద్ధిచేయుచుండుటయు మనము చూచుటలేదా ?

సమా:- మీకు ఈశ్వరుని వ్యవస్థ పైనను, న్యాయముపైనను విశ్వాసము కలదేని మీరు చేసిన కర్మలకే మీకు ఫలము లభించును గాని ఇతరులు చేసిన కర్మలఫలము మీకు లభింపనేరదని యంగీకరింప వలసియుండును. ఏ వ్యవస్థ యందు మీ దోషము లేనిదే మిమ్ము ఎవరైనను భాదించగలుగుదురో, మీరు అర్హులు కానట్టి వస్తువును మీమిత్రులు మీకిప్పింపగలుగుదురో ఆవ్యవస్థ వ్యవస్థ యనిపించు కొనజాలదు.

ప్రశ్న:- మీరు మాకళ్ళలో దుమ్ము చల్లదలచినారు. మిత్రులు మాకు హితమును శత్రువులు అహితమును చేయుచుండుటను మేము ప్రతి నిత్యము చూచుచునేయున్నాము గదా ?

సమా:- ఇందు కోపగించుకొనవలసిన దేమియు లేదు. యోచింపుడు. ఈశ్వరుని వ్యవస్థ మీ రే వ్యక్తినైనను మీ యిష్టప్రకారము సుఖమునకో దుఃఖమునకో గురిచేయగలుగునంత అపూర్ణమైన దని యొప్పు కొనుడు. లేదా ప్రపంచమున ఎట్టి వ్యవస్థ గాని వ్యవస్థాపకుడు గాని లేడని, బడితెగలవానిదే బఱ్ఱె అని యైనను ఒప్పుకొనుడు.

ప్రశ్న:- మే మీశ్వరుని వ్యవస్థను, మిత్రుల శత్రుల హితాహితములను రెంటిని అంగీకరింతుము.

సమా:- ఈ రెండు భావముల సమన్వయ మెట్లు కుదురును ?

ప్రశ్న:- ఈ సమన్వయము స్పష్టమే. మా శత్రు వెవడైనను మాకు అహిత మొనర్చుచో ఈశ్వరు డతనిని దండించును. ఇట్లు శత్రువున కహితము మరియు ఈశ్వరుని వ్యవస్థ రెండును నిరూపితమైనవి గదా ?

సమా:- మీరు వ్యవస్థ కర్థ మేమో గ్రహింపనే లేదు. మీ శత్రువు మీ కహిత మొనర్చినపుడు దానికి మీ రర్హులైనచో శత్రువు మీ కహిత మొనర్చెనను ప్రశ్నయే కలుగదు. ఒక వేళ అర్హులు కానిదే మీకు దుఃఖము లభించినచో దుష్కర్మ చేయకున్నను దుఃఖము ప్రాప్తించునని బోధపడుచున్నది. ఇది యీశ్వరుని దుర్వ్యవస్థనే ప్రకటించును. ఒక రాజ్యమున చోరులకు కఠిన దండన లభించినను దొంగతనము లధికము కాగల్గినచో అట్టి ప్రభుత్వమును మీరు మంచి ప్రభుత్వ మని యనలేరు.(౨)

ప్రశ్న:- ఐన మిత్రుడు హితమును శత్రువు అహితమును జేయు నని మీ రంగీకరింపరా ?

సమా:- మే మంగీకరించు విధము వేరుగా నున్నది. మా సిద్ధాంతము ప్రకారము మిత్రులు హితమును కోరగలుగుదురు, హితము చేయుటకు శక్తివంచనలేక ప్రయత్నింపగలుగుదురు. అట్లే శత్రువులు అహిత చింతన మొనర్పగలుగుదురు. అహిత మొనర్చుటకు శాయశక్తుల ప్రయత్నింపగలుగుదురు. కాని ఈశ్వరుని వ్యవస్థ వలన శత్రువు మనకు అనధికృత అహితమునేగాని, మిత్రుడు హితమునే గాని చేయుటలో సఫలుడు కాజాలడు. మన మిత్రులు, స్వజనులు మన మేలును కోరుట ప్రతిదినము చూచుచున్నాము. ఐనను మనకు దుఃఖము లభించుచునే యున్నది. మన శత్రువులు మనకు దుఃఖము కలిగించు సాధనము లెన్నింటినో ప్రయోగించినవ్పటికిని మనము దుఃఖమునుండి తప్పుకొనుచుండుటయు గోచరించుచున్నది.(౨) మనమిత్రులే గాని శత్రువులే గాని మన సుఖదుఃఖములకు కారణము కారు. నిమిత్తము మాత్ర మగుదురు. కారణములు మరియు నిమిత్తములు భిన్నము లైనవి. నిమిత్తములు రూపాంతరము పొందవచ్చును. కాని కారణము లట్లు కానేరవు. ఒక సామాన్య లౌకిక ఉదాహరణము వలన ఈ విషయము స్పష్టము కాగలదు. ఒకానొక

దొంగతనమునకు ఆరునెలలు కారాగార శిక్ష యగుచో ఆ కారాగార వాసమునకు కారణము దొంగతనమే యగును. కాన్పూరు జైలు కాని ఫైజాబాదు జైలు కాని నిమిత్తము మాత్రమే యగును. ఫలప్రాప్తి రూపములు లేదా నిమిత్తములు అనేకములైనను ఫలమునకు కారణము నియత కర్మయే యగును. ఈ నిమిత్తములకును మూల కారణములకును గల భేదమును గ్రహింపనివారు చిక్కులలో బడుదురు.

ప్రశ్న:- వ్యక్తి చేసిన కర్మలకు అతనికి సుఖమో దుఃఖమో లభించునటులనే దేశమునకు లేక జాతికి గూడ వాని కర్మల ననుసరించి సుఖములో దుఃఖములో కలుగు నని జను లందురు గదా ?

సమా:- ఆలోచింపకయే స్థూలముగ నుడివిన మాటలివి. కారణ-నిమిత్తముల వివేచన చేయనందునే ఇట్లనబడుచుండును. నాశరీరమున నాజీవుడును, మీశరీరమున మీ జీవుడును నున్నట్లే దేశము యొక్క శరీరమున దేశపు జీవుడు గాని జాతి శరీరమున జాతి యొక్క జీవుడు గాని లేడు. సామూహిక జీవుల ప్రతినిధి యనబడు జీవు డెవ్వడును లేడు. అనగా వ్యక్తుల శరీరములందు వ్యక్తిగత జీవు లున్నట్లే దేశమున నివసించు పదికోట్ల లేక జాతి యందున్న రెండు కోట్ల జీవులకు ఒక్కొక్క విశిష్టజీవు డెవ్వడును లేడని తాత్పర్యము. అట్లున్ననే గదా పరమాత్మ అతనికి కర్మానుసారము ఫల మొసగ గలుగును. ఇంతకుముందే సూచించినట్లు దేశములకు, జాతులకు ఎల్లలు కల్పితము లైనవే. నేడు మీ రనుచున్న దేశము గాని జాతిగాని రేపు మారిపోగలుగును. ఈ యెల్లలు సహజములు ఈశ్వరకృతములు గాని కావు. ఇవి మానవకల్పితములు మాత్రమే. కర్మఫల వ్యవస్థ మానవ కల్పితము గాదు. మానవ కల్పితమే యైనచో మానవు డిట్టి వ్యవస్థ నెన్నడును చేయకుండెడివాడు. కర్మఫల సిద్ధాంతము నైసర్గికమైనది స్థిరమైనది. ఇది మానవుడు ఇష్టము వచ్చి నట్లు చేయు విషయము కాదు.౧౦

అన్యుల కర్మ మరియు ఫలము ౧౧

ప్రశ్న:- ఒకరు చేసిన కర్మకు ఫలము మరొకరికి లభింపదా ?

సమా:- ఎట్లు జరిగిన మీకు బాగుండు నని తోచును?

ప్రశ్న:- ఇతరులు చేసిన ఉపకారముల ఫలమును మనము అనుభవించు చున్నాము గదా ?

సమా:- ఒకరు చేసిన దానికి ఫలము మరొకరికి లభించినచో దానిని మీరు న్యాయ మని యనగలరా? దీనివలన నైతిక వ్యవస్థ చక్కగా నుండునా?

ప్రశ్న:- ఔను ! నేను ధనమును సంపాదించి అన్యుల కొసగినచో దానివలన ఎవరికేమి చెఱుపు సంభవించును ? నేను స్వయముగ ననుభవింప వలసిన లాభమును నేనే ఇతరుల కొసగితిని.

సమా:- ఐతే ఏవ్యక్తియైనను తన శుభాశుభకర్మల ఫలమును ఇతరుల కొసగగల్గు నని మీ రంగీకరింతురా ?

ప్రశ్న:- నాయభిప్రాయ మదియే.

సమా:- నేను చేసిన అశుభకర్మలకు దుఃఖము గూడ నేను ఇతరుల కొసగగలుగుదునా ?

ప్రశ్న:- అట్టైన అనర్థమే కాగలదు. ఏలన జనులు తమ శుభకర్మల సుఖరూప ఫలమును అన్యుల కొసగుటకు తక్కువగా ఇష్టపడెదరు. కాని అశుభ కర్మల దుఃఖరూప ఫలమును మాత్రము అందరును ఇతరులకే ఇవ్వగోరుదురు. కాని వానిని ఎవ్వరును తీసికొనగోరరు.

సమా:- మీ సిద్ధాంతము ఎంత అసహజమో, ఎంత హానికరమో ఎంత మిథ్యయో (తథ్యశూన్యమో) ఆలోచించి తెలిసికొనుడు. కావున ఏ వ్యక్తి యైనను ఎప్పుడుగూడ ఇతరుల శుభకర్మల ఫలమును గాని అశుభకర్మల శిక్షను గాని పొంద డని అంగీకరించుటయే సరియైనది ౧౨. ఈశ్వరుడు చెడుకర్మలు చేసినవానికే శిక్షయు మంచి కర్మలు చేసిన వానికే సుఖమును కలుగజేయును. తాము శుభకర్మలద్వారా సంపాదించుకొనిన సుఖములను కొందరు తమ యిష్టానుసారము అన్యుల కివ్వవచ్చునని ఈశ్వరు డాజ్ఞాపించె ననుకొనుడు. అప్పుడు రాజులు, మహారాజులు తమ సమస్త ప్రజల శుభకర్మలనుండి ఒక భాగమును తమకొరకు సురక్షిత మొనర్చుకొని యుండెడివారే. కాని అట్లెన్నడును జరుగదు.౧3

ప్రశ్న:- మీ యుక్తిని ఖండించుటకు మావద్ద ఉపాయము లేదు. కాని మీ మాట మా మనస్సున కెక్కుట లేదు.

సమా:- మీకేమి యాపత్తి?

60 ప్రశ్న: ఒక వ్యక్తి ఇతరులకు సుఖదుఃఖములను కలిగించుటను ప్రతిదినము చూచుచునేయున్నాము. సుఖము నొసగువానిని శ్రేష్ఠుడు, ధర్మాత్ముడు అనియు, దుఃఖము నొసగువానిని దుష్టుడు, అధర్మాత్ముడు అనియు నందురు. ఒకడు మరొకనికి సుఖమును కాని దుఃఖమును కాని కలుగజేయకున్న ప్రపంచమందు దుఃఖ ముండెడిది కాదు. ఆచార శాస్త్రము నేర్పరచు అవసరము కూడా ఉండెడిది కాదు.

సమా:- మీరు అసమగ్రముగ నాలోచించితిరి. పాక్షిక నమ్మకములు అధికముగ భ్రమమూలకములే యై యుండును.

ప్రశ్న:- ఎట్లు ?

సమా:- నేను స్వార్థవశమున నెవరికైనను దుఃఖము కలిగింప సంకల్పించ గలుగుదును. ప్రేమతోనో, మోహముతోనో నాసుఖము నితరుల కిచ్చుట కాలోచించ గలుగుదును. కాని నాయీ సంకల్పములు నెరవేరుట, నెరవేరకపోవుట నావశమున లేవు. ౧౪ ఒకతల్లి తన సంతానము చేయు పొరపాట్లకు చెడుఫలితము తనసంతానమునకే లభింపవలెనని యనుకొనదు. ఆమె తన శుభకర్మల సుఖమును గూడ వారి కివ్వ తలపెట్టును. అంతే కాదు, పిల్లల అశుభకర్మల దుఃఖమును గూడ తానే స్వీకరింప సమకట్టును. కాని యిట్టి శుభకరమైన కోరికయందు తల్లి సర్వకాలసర్వావస్థలయందును సఫలతగాంచునా? మనమొకరి కెంత అహిత మొనర్పదలంతుమో అంత చేయగల్గుదుమా? ౧౫ అట్లు చేయగలిగినచో ప్రపంచము అనాచారము, అరాజకములతో నిండిపోయెడిది. అశుభ చింతనయు, దాని వలన నుత్పన్నమైన కర్మలు కొంతమేరకు సంభవమే యైనను వానివలన నితరులకు హాని కలుగుట తప్పనిసరి కాదు. ౧౬ పరోపకార మొనర్చుటలో సదా సఫలుర మగుట మన వశమున లేదు.

ప్రశ్న:- సఫలత యొక్క నమ్మకము లేకున్న ఎవరును పరులకు ఉపకారము గాని అపకారము గాని చేయుటలో దత్తచిత్తులు కారు. ఒకానొక వ్యక్తికి సుఖమునో దుఃఖమునో

కలిగింపగల్గుదు నను నమ్మక మున్నపుడే నాకు కర్మ చేయు ప్రవృత్తి కలుగును. లేనిచో కలుగదు.

సమా:- అందరి ప్రవృత్తు లొకటిగ నుండునా లేక భిన్నముగనా ?

ప్రశ్న:- **ఈ ప్రశ్నవలన మీకేమి ప్రయోజనము చేకూరును ? స్పష్టపరచుడు.**

సమా:- ఇతర వ్యక్తు లెల్లరు నాయెడ ఒకే ప్రవృత్తిని కలిగియుందురా లేక భిన్న ప్రవృత్తులనా? అందరును నాకు ఉపకారమునే చేయగోరుదురా లేక కొందరు ఉపకారమును మరికొందరు అపకారమును చేయదలుతురా?

ప్రశ్న:- **ప్రవృత్తులు భిన్నముగనే యుండును. నామిత్రులు నాకు ఉపకారమును, శత్రువులు అపకారమును చేయదలతురు.**

సమా:- మరి మీకు ఉపకారఫలము లభించునా అపకారఫలమా ?

ప్రశ్న:- **అపకారమొనర్చువారి ప్రాబల్య ముండెనేని దుఃఖమును, ఉపకారుల ప్రాబల్యా మధిక మగుచో సుఖమును పొందుదును.**

సమా:- అట్లైన నిది ఈశ్వరుని న్యాయపూర్ణ వ్యవస్థ కాదు. ఇదిబడితె కలవానిదే బఱ్ఱెయగును. ఈశ్వరు డిట్టి అరాజకతను ఎట్లు సహింపగలడు ?

ప్రశ్న:- **రాజు ఘాతకునకు ఉరిశిక్ష విధించినటులనే ఈశ్వరుడు అపకారికి దండన విధించును.**

సమా:- ఈ విషయమును పునరాలోచింపుడు. మీరొసగిన దృష్టాంతము యొక్క సంపూర్ణ అర్థమును మీరాలోచింపలేదు.

ప్రశ్న:- **ఎట్లు ?**

సమా:- ఘాతకునకు ఉరిశిక్ష విధించినంత మాత్రమున మరణించిన వాని దుఃఖము దూరమగునా ?

ప్రశ్న:- **ఘాతకుడు ఇకముందు అత్యాచారము లొనర్చకుండ, ఇతరులకు దుఃఖము కలిగింపకుండ చేయవచ్చును.**

సమా:- ఇది మీ రితరుల గూర్చి చెప్పుచున్నారు. నే నడుగ దలచిన దేమన

- 'అ' అనువ్యక్తి 'బ' అనువానిని చంపగా 'అ' ఉరితీయబడెను. అందువల్ల 'బ' కు ఏమి లాభము కలిగెను? 'బ' కర్మలు చేయనిదే మరణశిక్ష ఎందుకు లభించెను? ఒక రాజ్యమున ఏ పాపము చేయని వ్యక్తికి దండన లేక దుఃఖము లభించినచో ఆ రాజ్యమును మంచి దని యనము గదా? పాపము చేసినవానిని శిక్షించుటయే రాజ్యము యొక్క కర్తవ్యము కాదు. పాపము చేయనివానికి శిక్షలభింపకుండ చూచుటయు దాని కర్తవ్యమే. ఏ విధముగ నైనను అతడు శిక్షకు గురికాగూడదు.

ప్రశ్న:- **ఎంత ఉత్తమమైన రాజ్యమందైనను ఏ యపరాధము చేయని జనులు దుష్టులచే పీడింపబడుటను, అపరాధము చేసినవారు దండింప బడుటను మనము చూచుట లేదా ?**

సమా:- ఔను, చూచుచున్నాము. కాని ఇది మానవ నిర్మిత ప్రభుత్వముల అల్పజ్ఞతకు, నిర్బలతకు మాత్రమే నిదర్శనము. మానవ శాసకుని జ్ఞానము, బలము రెండును పరిమితములే. అందుచే అతనికి 'అ' 'బ'ను చంపనుద్దేశించుచున్న సంగతి తెలియదు. తెలిసినచో 'అ'ను అడ్డుకొను ఏర్పాటు తప్పక చేయవలయును గదా! ఈశ్వరుడు సర్వజ్ఞుడు, సర్వ శక్తిమంతుడు నైనందున అతని జ్ఞానము లేదా శాసనమునుండి ఎవరును తప్పుకోలేరు. పరిమిత సామ్రాజ్యములందు ఇట్టిదనూహ్యమే. కావున కారణము లేనిదే ఎవరును ఎవరికిని సుఖమునే గాని దుఃఖమునే గాని కలిగింపజాల రని అంగీకరింప వలసివచ్చును.

ప్రశ్న:- **కారణ ముండును, కాని అది ఇతరుల సకంల్పముల రూపముననో కార్యముల రూపముననో యుండును.**

సమా:- ఇచట 'కారణ' మన స్వీయ కర్మలనియే మాయభిప్రాయము. అనగా 'అ' మంచి కర్మలో చెడు కర్మలో చేయనంతవరకు అతనికి సుఖమో దుఃఖమో లభింపదు. ఈశ్వరుని న్యాయము దీనినే అపేక్షించును. దీనికి భిన్నముగ నేమి జరిగినను అది అన్యాయమే యగును. ఈశ్వరుడు విశ్వశాసకుడు, అందును పూర్ణశక్తిమంతుడు, పూర్ణజ్ఞాని, పూర్ణహితైషి యగు శాసకుడు. అట్టిచో అతని శాసనమున దిగువ నుదాహరించిన మూడంశములు తప్పక యుండవలెను.

౧. ఎవరైనను దుష్కర్మలు చేయనిదే దుఃఖరూప శిక్షను గాని సత్కర్మలాచరింపనిదే సుఖరూప బహుమతిని గాని పొందగూడదు.

౨. ఇతరులకు కీడు చేయదలచిన శిక్షయు, మేలు చేయదలచిన బహుమతియు లభింపవలెను.

౩. వ్యవస్థ పూర్ణముగను, అందరి హితము కోరునదిగను ఉండవలెను. మేలు నపేక్షించనిదిగా నుండరాదు.

బలహీనులు, అల్పజ్ఞులు నైన శాసకులు గూడ ఈమూడు విషయములను దృష్టియందుంచుకొందురు. కాని అల్పశక్తి మంతు లగుటచే వారివలన పొరపాట్లు జరుగును. లేదా జాగరూకు లైనప్పటికిని వానిని నిర్వహింపలేక పోవుదురు. సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు, సర్వహితైషియు నగు ఈశ్వరుని విషయమున ఈ ప్రశ్నలే యుదయింపవు. కర్మఫల వ్యవస్థ ఈశ్వరుని ద్వారానే జరుగును. కాని మనుష్యుడు కొంతవరకు మాత్రమే దీనిని పాటింపగలుగును.

మరొక విషయము నాలోచింపుడు. కేవలము పాపిని శిక్షించి పుణ్యాత్మునకు శ్రేయస్సును కలిగించినంత మాత్రముననే శాసకుని కర్తవ్యము పూర్తిగాదు. పాప ప్రవృత్తి గల వ్యక్తులు పాపము చేయుట యందు సమర్థులు కాకుండ చూచుట గూడ మంచి శాసకుని లక్షణమే. ఏరాజ్యమందైతే దొంగలు కఠిన దండనము పొందు చున్నప్పటికిని దొంగతనములు అధికముగ జరుగుచుండునో ఆరాజ్య శాసనమును మేము మంచిదనము. ఏలన హత్యలు అధికమైనవి, ప్రాణదండనలు గూడ అధికమైనవి. దీనివలన శాసనము యొక్క ప్రయోజనము సిద్ధించుటలేదు. ఇట్లు స్వీయకర్మల కారణమునగాక అకారణముగనే ఎవరి హత్యయైనను జరిగినచో అది కర్మ సిద్ధాంతమునకు విరుద్ధ మగును. కావున జీవుడు స్వీయకర్మల ఫలమునే పొందును గాని ఇతరుల కర్మల ఫలము పొంద డని అంగీకరింపవలెను. ఆ జీవుల కర్మలు అన్యజీవులు స్వేచ్ఛగా నొనర్చు శుభాశుభకర్మలలో సాధకములో బాధకములో గావచ్చును. కాని కేవల మొక సీమ (హద్దు) వరకు మాత్రమే.

మృత్యువు

ప్రశ్న:- మృత్యువు సుఖమా ? దుఃఖమా ?

సమా:- మృత్యువు సుఖమే కాని దుఃఖమే కాని కాదు. ఇది సుఖ దుఃఖముల రెంటికిని ఉపకరణము కావచ్చును. ఒక వ్యక్తియొక్క మృత్యువును గాంచి ఆ

మృత్యువు వానికి అనిష్టదాయకమని తలంపగూడదు. మృత్యు వనున దేమి? అది జీవుడు ఒక శరీరమును వదలి మరొక శరీరమునందు ప్రవేశించుటయే.మన మొక యింటిని వదలి మరొక యింట ప్రవేశించినపుడు లేదా ఒక అంగిని వదలి మరొకదానిని ధరించినపుడు మనకు సుఖము కలుగ వచ్చును. దుఃఖము గూడ కలుగవచ్చును. అధికారి ఒక పదవి నుండి మరొక పదవికి మారినపుడు అతనికి వేతన వృద్ధియో ఉన్నత పదవియో లభించిన అతడు ప్రసన్నుడగును.తక్కువ వేతనమో, చిన్న పదవియో లభించిన దుఃఖితు డగును. ఇదే విధముగ మృత్యువు పిదప మన కెట్టి శరీరము లేక పరిస్థితి ప్రాప్తించునో చూడగల్గినచో మరణము మంచిదో, చెడ్డదో చెప్పగల్గుదుము.

72 ప్రశ్న: మరి మరణము భయంకర మైన దని లోకు లెందుకు భావింతురు? మిత్రులు మరణించినపు డంతగ విలపింతు రెందులకు?

సమా: మొదటిది - సాధారణ ప్రాణులకు ప్రస్తుత పరిస్థితియందు మోహ మేర్పడుటవలన వారు దీనిని వదలిపెట్టుట కిష్టపడరు.

రెండవది - భవిష్యత్తు గురించి వారికి తెలియనందున ముందేమి జరుగునో యను సందేహము కలుగును. వారిలో ఈశ్వర విశ్వాసము లోపించియుండును. ఈశ్వరు డేది చేసినను తన మేలుకొరకే యని తెలిసికొనినట్టి జీవుడు మరణ సమయమున గూడ సంతోషముగనే యుండును. ౨౨

ఇతరు లతని మృత్యువును గాంచి దుఃఖించునది వారి స్వార్థకారణముననే. పత్ని పతి మరణమునకు,సంతానము తండ్రి చావునకు దుఃఖించును. ఏలన వారి జీవనాధారము లేకుండ పోయినది. ఏడ్పులార్పులు మృత్యువు మరణించినవారికి హానిని కలిగించినట్లు ఋజువు చేయవు. జీవుని చేతన సత్తాను విశ్వసింపక జీవనమును జడ మని భావించువారికి మృత్యువువలన మరణించిన వానికి హాని కలుగు ననెడి అధికార మెట్లుండును? దీపజ్వాల ఆరిపోయినచో దానికి కలిగెడి హిత మేమి? అహిత మేమి? దీనికి భిన్నముగ జీవుని చేతను డని విశ్వసించువారు మృత్యువును కేవలము సుఖమునకో, దుఃఖమునకో కారణమని భావింపరాదు. అది కేవలము ఉన్నతికో అవనతికో కారణము కాదు. జీవుడు మృత్యువు పిదప ముక్తుడు కాగలుగును లేదా క్రిమికీటకాది యోనుల నైనను పొందగలుగును.

ప్రశ్న: ఎవరినైనను చంపుట పుణ్యమా? పాపమా?

సమా: కేవలము చంపుటద్వారా పుణ్యపాపముల వ్యవస్థ నిర్ధారణ కాజాలదు. ఉరి తీయువ్యక్తి ఉరితీయునపుడు పుణ్యముగాని పాపము గాని చేయడు. అతడొక విధముగ తన కర్తవ్యమును నెరవేర్చును. ఎవని ఆజ్ఞచే ఉరితీయబడునో అతని పుణ్య పాపములకు కొలత ఆతని కర్తవ్యమేయగును. కర్తవ్యము కానిదే ఒకరిని చంపుట పాపమే యగును. ౨౩

ప్రశ్న: ఎందుకు? చంపెడివానివలన కలుగు మృత్యువు సుఖమునకును, ఉన్నతికిని కారణ మగు నని ఎవరికైన నెట్లు తెలియును?

సమా: ఎవరును ఇతరులను వారికి ఉన్నతినో సుఖమునో కలిగించుటకు చంప యత్నింపరు. వారు స్వార్థమునకై అన్యుల స్వేచ్ఛ నరికట్ట దలతురు. అందుకే వారి ప్రాణములు దీయ సమకట్టెదరు. ఒకరి స్వాతంత్ర్యమును భంగపరచుట ఈశ్వరుని సృష్టి ఉద్దేశమునకు విరుద్ధమైనందున అది పాపమగును.

ప్రశ్న: అట్లైన సమస్త ప్రాణులను చంపుట పాపమా?

సమా: ఔను ! స్వార్థము కొరకు చంపినచో పాపమే యగును.

ప్రశ్న: ఈశ్వరుడు ప్రాణులనెందుకు చంపును? అతనికి పాప మెందుల కంటదు?

సమా: ఈశ్వరుడు స్వార్థముకొరకెవరిని చంపడు. అతడు చంపుటయే కాదు బ్రతికించును గూడ. ఒకవేళ అతడు నా జీవితము నంతమొనర్చుటకు మృత్యువు నొసగుచో మరొక జీవనమును ప్రారంభించుటకు జన్మను గూడ ప్రసాదించును. ఒక దోపిడిగాడు నా బట్టలను లాగుకొనినచో అతడు పాపియగును. ఏలన అతడు తన స్వార్థమునకై నాకు కష్టము గలిగించెను. కాని నాతల్లి పాత బట్టలను నానుండి తొలగించి క్రొత్తబట్టలను తొడిగించినచో ఆమె దయాళువే యగును. కాని దోపిడిదారు కాదు.

ప్రశ్న:- అట్లైన సమస్త ప్రాణులను చంపుట పాపమా ?

సమా:- ఔను, స్వార్థము కొరకు చంపినచో పాపమే యగును.

ప్రశ్న: చేపలు, మేకలు, కోళ్ళు మున్నగువానిని ఆహారముకొరకు చంపుటయు పాప మేనా?.౨౪

సమా: తప్పక పాపమే! ఏలన స్వార్థమునకే గదా వీనిని చంపునది ?

ప్రశ్న: ఈశ్వరుడు ప్రాణులను చంపునుగదా! మేము గూడా వీనిని చంపి ఈశ్వరునే యనుకరించుచున్నాము.?

సమా: అట్లైన్నటికిని గాదు. ఈశ్వరుడు వానిని మరల పుట్టించుటకే చంపును. కాని మీరు స్వార్థముకొరకే చంపెదరు.

ప్రశ్న: మృత్యువు సుఖమునకో దుఃఖమునకో కారణము కానప్పుడు చంపుట పాప మెందు కగును?

సమా: మృత్యువు సుఖదుఃఖముల రెంటికిని నిమిత్తము కాగలుగును. కాని హంతకుని కోరిక అతని స్వార్థమును, శత్రుత్వమును ప్రకటించును. అందువలననే పాపమగును.

ప్ర: భగవద్గీత ద్వితీయాధ్యాయమం దిట్లు వ్రాయబడినది-

అంతవంత ఇమేదేహా నిత్యస్యోక్తాః శరీరిణః ।

అనాశినోఽప్రమేయస్య తస్మాద్యుద్ధస్వ భారతః ॥౧౮॥

య ఏనం వేత్తి హంతారం యశ్చైనం మన్యతే హతమ్।

ఉభౌ తౌ న విజానీతో నాయం హంతి న హన్యతే॥౧౯॥

" ఈశరీరము లనిత్యములు. జీవులు నిత్యములు. అందువలన ఓ అర్జునా! యుద్ధ మొనర్చుము. ఎవరయితే ఆత్మను చంపునది, చచ్చునది అని భావింతురో వారిరువురును అజ్ఞానులే. జీవుడు ఇతరులను చంపడు, తాను చావడు.'

ప్రశ్న : అట్లైన ఏ ప్రాణిని చంపినను పాపము కాదు. మేము చేప శరీరమునే చంపుదుము గాని చేపయందు గల జీవుని కాదుగదా?

సమా: ఇట్లు భావించినచో గొప్ప అనర్థమే వాటిల్లును. గీతోపదేశము కేవలము యుధిష్ఠిరు నాజ్ఞానుసారము రణమొనర్ప యుద్ధభూమి కేగిన అర్జునునకు చేయబడినది. ఇట్టి యుపదేశమునే ప్రతి దొంగ, దోపిడిగాడు, ఘాతకుడు మున్నగువారికి నొసగుచో ఘోరమైన విపత్తు సంభవింపగలదు. నా ధనమును దొంగిలించినవాడు నిత్యమైన నా ఆత్మనైతే చంపజాలడు. కాని స్వార్థవశమున నాకు బాదను కలిగించును. అందువలన దండనార్హుడగును. అట్లే చేపను చంపువాడు [illegible] స్వార్థవశమున చేపయందలి జీవునకు బాధ కలిగించును. కావున పాపి యగును. ఏలన అత డొక ప్రాణియొక్క వస్తువును హరించి తనపొట్టను నింపుకొనజూచును. ఏవాక్యమునకైనను సందర్భమును బట్టియే అర్థము చెప్పుకొనవలెను. రణక్షేత్రమం దొసగబడిన ఉపదేశమును దౌర్భాగ్యవశమున ప్రతి పరిస్థితికిని అన్వయించి ఒకదాని కొక పరిణామమును పొందుచున్నారు.

ఆత్మ అమరమైనదే. కాని అది సుఖదుఃఖములను గూడా పొందును. కావున దానికి దుఃఖము కలిగించువారు దాని స్వేచ్ఛను హరింప దలచువారు పాపమొనర్తురు. మోహన్ యమ్.ఏ. పరీక్ష యొసగుటకు నేడు పది గంటలకు ఇంటినుండి బయలుదేరగా కుందన్ అతనిని బాటలో నిలబెట్టి అరగంటవరకు ఆపియుంచినచో కుందన్ పాపము చేసినవాడగునా? కాదా? మోహన్ అమరుడు. నేనాతని యమరత్వమున కెట్టి యడ్డంకులను కల్పించలేదు. మోహన్ పరీక్ష యొసగి విఫలుడయ్యెడివాడేమో ఎవ రెరుగుదురు? అని కుందన్ అనజాలడుగదా! కుందన్ ఆలోచనలు దూషితములైనందున అతడు అపరాధియే. [illegible]

మృత్యువు యొక్క సమయము

ప్రశ్న: మృత్యువుయొక్క సమయము చనిపోవువాని కర్మలపై నాధారపడి యున్నదా లేక ఏవేని ఇతర కారణములపైననా?

సమా: కేవలము చనిపోవువాని కర్మలపైననే [illegible]

ప్రశ్న: పూర్వకర్మలపైననా లేక వర్తమాన, భవిష్యత్కర్మల పైననా?

సమా: పూర్వకర్మలపైననే!

ప్రశ్న: మంచి కర్మలపైననా లేక చెడు కర్మలపైననా?

సమా: మంచి, చెడు రెండింటిపై నాధారపడియున్నది. స్థితియొక్క పరివర్తనము దుఃఖమునకు, సుఖమునకు గూడ హేతు వగును.

ప్రశ్న : కొండొక మృత్యు పరిణామము సుఖము కాని దుఃఖము కాని యగు నని తెలియు టెట్లు?

సమా: మనుజు డీ విషయమును తెలిసికొనజాలడు. మృత్యువు తరువాతి విషయము పరోక్షమైనది.అది యీశ్వరునకే తెలియును. అతని వ్యవస్థవలననే ప్రపంచము నడచుచున్నది.

అకాల మృత్యువు

ప్రశ్న: మృత్యువు అకాలమున సంభవించునా? సకాలముననా?

సమా: అకాల, సకాలము లన మీభావ మేమి? అన్ని కార్యములును, సంఘటనలును కాలము నపేక్షించును.

ప్రశ్న: ఒక యువకుని మరణమును గాంచి అతడు అకాల మృత్యువాతబడె నని లోకు లందురు గదా?

సమా: ప్రతి మనుజుడును "కాలము" అనెడి పదమును తన హితము నపేక్షించియే ప్రయోగించును. ఒక స్త్రీకి ఆమె పతి వియోగము- అతడు ౮౦ సం.ల వయస్సులో మరణించినను- అకాలమే యగును.

మన శత్రువుయొక్క మరణము మన కెప్పుడును 'అకాలము" అనిపించదు. అత డెంత శీఘ్రముగ మరణించిన అంత మంచి దని భావింతుము. ఒక ౬౦ సం.ల యువరాజు ౮౫ సం.ల ముసలిరాజైన తన తండ్రి జీవనమునే 'అకాల" మనుకొనును. గాని మృత్యువును గాదు.తల్లి దండ్రులందరును తమ పిల్లలమృత్యువును అకాల మనియే భావింతురు.

ప్రశ్న: కాదు,కాదు. మాప్రశ్న యొక్క ఆశయము అదికాదు. వేరే .

పమా: ఆ ఆశయమేదో స్పష్టముగా తెలుపుడు.

ప్రశ్న: ప్రతి ప్రాణియొక్క మృత్యుసమయమును, నిమిత్తమును అన్య ప్రాణులు

దానియందెట్టి పరివర్తనము చేయుటకు వీలులేని రీతిలో ఈశ్వరుడు మొదటనే నిశ్చయించునా? ఉదాహరణకు-యజ్ఞదత్తుడు క్రోధవశమున దేవదత్తుని తన కరవాలముతో అడవిలో ఒక వృక్షము క్రింద నరికి చంపె ననుకొనుడు. యజ్ఞదత్తుడు అదే దినమున అదే ముహూర్తమున, అదే కరవాలముతో అదే వృక్షము క్రింద అదే పరిస్థితిలో దేవదత్తుని చంపగల డనియు స్వయముగ యజ్ఞదత్తుడే కాని ఇతరు లెవ్వరే కాని ఆమృత్యువును తప్పింపజాల రనియే ఈశ్వరుని నిశ్చయమా?

సమా: మీరు 'కాల' శబ్దముతో మొదలిడి ఇప్పుడు అందు కర్త, ఉపకరణము, స్థానము, పరిస్థితి- వీని నన్నిటిని చేర్చితిరి. మే మిదివరకే సూచించినట్లు నిమిత్తమును కారణ మనుకొనుట అయుక్తము. నేడొక వ్యక్తి విమానము ధ్వంసమై మరణించును. ఒకప్పుడు విమానములు లేకుండెను. అట్టిచో ఈశ్వరుడు "విమానము" ను అల మృత్యువునకు తప్పనిసరి కారణము లేక సాధనముగ నెట్లు చేయును? మరణము అప్పుడు గూడ సంభవించెడిది, కాని విమానము ద్వారా కాదు. అట్లే యజ్ఞదత్తుడు ఒక నౌకయందు సముద్రయాత్ర చేయుచున్నచో అప్పుడు కేవలము చావుకొరకే అతడు ఎగిరి వృక్షము క్రిందకు వచ్చి చేరు టవసరమగునా? అట్లెన్నటికిని కాదు. అట్లే మరణ మొక్క ఘటన కాదు. ఘటన లనేకము లుండును. అవన్నియు అకాలమైనవా? సకాలమైనవా? అని మీరు ప్రశ్నింపగలరా? నేడు మీరు నాకు విందొసగితి రనుకొనుడు. అది అకాల విందా? సకాల విందా? అనగా ఈశ్వరుడు మొదటనే మీరు మీగదియందు మిర్జాపూర్ తివాసిపై నన్ను కూర్చోబెట్టి సున్నిలడ్డూలతోనే విందొసగ గలరనియు, అందులోని ఏయంశమునైనను చేయకపోవుట కెవరికిని సాధ్యము కాదనియు నిశ్చయించెనా?

పశ్న: సుదీర్ఘమైన మీ వ్యాఖ్యయొక్క సార మేమి? ఒక విందు విషయమును ప్రస్తావించి మౌలిక ప్రశ్నను మూలకు నెట్టితిరి?

సమా: అట్లేమి కాదు. మీరు సరిగాను, నిర్దుష్టముగాను ఆలోచించుటలో సహాయకారిగ నుండుటకొరకే ఒక సమానాంతర సంఘటనను మీ ముందుంచితిమి. ఏ ఫలమైనను కర్మ ననుసరించియే యుండును. కాని నిమిత్తము ననుసరించి మాత్ర ముండదు. ఒక సంఘటన కనేక నిమిత్తము లుండవచ్చును. వాని కితర పరిస్థితులతో సంబంధ ముండును. ఉదాహరణకు - మీరొక నెలదినములు ప్రభుత్వోద్యోగము చేసితి రనుకొనుడు. ఉద్యోగము కర్మ,వేతనము దానికి ఫలము.

ఆ వేతనము నోట్ల రూపమున గాని నాణెముల రూపమున గాని ఒసగబడవచ్చును. మీరు విదేశములకు వెళ్ళినచో అచటి నాణెముల రూపమున గూడ ఇవ్వబడవచ్చును. కాని తప్పక జరుగవలసిన దేమన ఆ వేతనము మీరు చేసిన ఉద్యోగమునకు సంబధించినదై యుండవలెను గాని అన్యులు చేసిన ఉద్యోగమునకు సంబంధించినది కాకూడదు. అట్లే అది మీకే లభింపవలెను. ఇతరులకు కాదు. ఉపకరణములు భిన్నములైనప్పటికిని అవి మీకు లభింప వలసిన ఫలమునకు సమాన విలువగలవియే యై యుండును.

సకాల అకాల మృత్యవుల వలెనే సదేశ-అదేశ, సహేతుక - అహేతుక మృత్యవులకు సంబంధించిన ప్రశ్న లుత్పన్నము కావచ్చును. ప్రశ్నించువారు అప్పుడప్పుడు ఇష్టము వచ్చినట్లు ప్రశ్నింతురు. ఈ వ్యాఖ్య వీరందరికి వర్తించును. అకాల-సకాల మృత్యువులకు సంబంధించిన ప్రశ్నలు శాస్త్రములం దెచ్చటను ఈ రూపమున కానరావు.౨౯

ప్రశ్న:- స్వతంత్రు డని యెవని నందురు ?

సమా:- శరీర ప్రాణేంద్రియాంతఃకరణాదు లెవని యాధీనమున నుండునో వానినే స్వతంత్రు డందురు.

సామర్థ్యానుసారము కర్మలు చేయుటలో జీవుడు స్వతంత్రుడు. కాని పాపకార్య మొనర్చిన పిదప ఈశ్వరీయ వ్యవస్థలో పరాధీనుడై పాప ఫలము ననుభవించును. కావున కర్మచేయుటయందు జీవుడు స్వతంత్రుడును, పాపముయొక్క దుఃఖరూప ఫలము ననుభ వించుటయందు పరతంత్రుడు నగును. (సత్యార్థప్రకాశము,)

మృత్యువు పిదప స్వర్గము లభించునా ?

ప్రశ్న :- అందరును తమ పూర్వీకులను స్వర్గీయులని యనుచుందురు. వారందరును స్వర్గమున కేగిరా ?

సమా: బంధుమిత్రుల భావనలు వారి శ్రేయోభిలాషను సూచించునే గాని వారి భవిష్యత్తును దర్శింపజేయవు. ఎవరేని తమ తండ్రి మరణించి నికృష్టయోనిని పొంద లేదని చెప్పగలరా! మన మాటలు మన శుభచింతనమును తెలుపును. అంతకన్న మరేమియు కాదు. దీనినే సామాజిక శిష్టత అనవచ్చును. ఇది దార్శనిక తథ్యము కాదు.

ప్రశ్న:- నా మృత్యువు నాపూర్వకర్మల ననుసరించి కాక నాశత్రువు యొక్క చెడు భావన లేక నిర్దయవలన గూడ సంభవించునా ?

సమా:- అట్లు జరుగదు. మృత్యువునకు నిమిత్తము లెన్నియైన నుండవచ్చును. కాని కారణము లట్లు కాదు. ఒకని కర్మలు మరొకని మృత్యువునకు కారణము కాగలుగుచో ఈశ్వరుని న్యాయవ్యవస్థ యందు అడ్డంకు లేర్పడును. పూర్ణుడు, పూర్ణజ్ఞాని, పూర్ణశక్తిమంతుడు నైన ఈశ్వరుని వ్యవస్థయం దొకని కర్మలు మరొకనికి ఫలము నొసగజాలవు. అట్లొసగుననుకొనుట అన్యాయము కాగలదు ౩౦.

ఆయువు లెక్క సంవత్సరముల పైననా? శ్వాసలపైననా ?

ప్రశ్న :-ఆయువుయొక్క పరిమాణము సంవత్సరములపైన ఆధారపడి యున్నదని కొందరు, శ్వాసలపైన ఆధారపడియున్నదని మరికొందరు నమ్ముదురు. వాస్తవ మేమి ?

సమా:- ఈ యభిప్రాయములు రెండును కాల్పనికము లనియే తోచుచున్నది. యోగదర్శనమందు సూత్రకారు డీ విషయమును స్పష్ట మొనర్చలేదు. ఇతర శాస్త్రములందును దీని ప్రస్తావన లేదు. ఈ భావన ఎప్పుడు ప్రారంభమైనదో చెప్పుట కష్టము. బహుశః అకాల, నిశ్చితకాల మృత్యువులకు సంబంధించిన ప్రశ్న లడిగినపుడు వివిధ మతవాదులు ఇట్టి కల్పన చేసియుందురు. సంవత్సరముల పరిమాణ మని మనము దేని ననుచున్నామో అది పూర్తిగా బాహ్యవస్తువే. సంవత్సరముల కొలత సూర్య, పృథ్వీ, చంద్రాదుల భ్రమణముపై నాధారపడియున్నది. మహమ్మదీయుల సంవత్సరము హిందువుల సంవత్సరముకన్న చిన్నది. సంవత్సరముయొక్క కొలమానము మానవీయము, ఈశ్వరకృతము కాదు. దేనిని మనము సంవత్సర మందుమో ఒక విధముగ నది కదిన మనబడును. మానవజీవితము నొక ప్రమాణముగ గైకొనినచో కీటకములయు, పక్షులయు పూర్తి జీవితము ఒక మానవ దినమునకు సమానమగును. వాని జీవిత పరిమాణమును కొలుచుటకు వేరే కొలమాన మేర్పరచినచో వాని జీవితములు గూడ సంవత్సరములు, యుగములుగ విభక్త మగును.

జీవిత పరిమాణము శ్వాసలపైన (ఒకవేళ శ్వాసయొక్క అర్థము ప్రాణాపానముల క్రియ యైనచో) ఆధారపడియుండు ననుట ఇంకను అర్థశూన్యముగ తోచును. శ్వాస జీవనము యొక్క ఒక క్రియ మాత్రమే. అది గూడ ఒక క్రమమే. సైకిలు చక్రమునందలి గాలివలె ఈ క్రియ కూడ కేవలము భౌతికమైనది. సైకిలు చక్రములందు గాలి యున్నంత వరకే సైకిలు నడుచు ననుట సత్యమే. కాని గాలి సైకిలు జీవితోద్దేశమే కాని, జీవితకొలమానమే కాని కానేరదు. ప్రాణమే జీవన మని అచ్చటచ్చట పేర్కొనబడినది. ఈ కథనము 'గాలియే సైకిలు' అనునట్టిదే. ఇది ఉపచారభాష. శ్వాసను నిలిపియుంచుట ద్వారా జీవితమును పొడిగించుకొనవచ్చు నని కొందరు భావింతురు. ఇదే నిజమైనచో జాతి, ఆయువులతో బాటు 'భోగము' ఎందుకు చేర్చబడును? కర్మ విపాకము జాతి, ఆయువు, భోగము లనెడి మూడు పదార్థముల సమ్మిశ్రణ మని గదా నుడువబడినది! సైకిలును పట్టుకొని నిలబడినచో గాలివెళ్ళిపోదు అనునట్లుగనే ఎవరైన శ్వాసను నిలిపి మృత్యువును దరికి రాకుండ దూరమున నుంతుమని వాదించి నంతమాత్రమున వారి యుద్దేశ్యము నెరవేరదు. సైకిలును నిలిపియుంచి గాలిని సురక్షితముగ నుంచినంతమాత్రమున నేమగును? శ్వాసను నిలిపియుంచి మనము ఆయువును పొడిగింపగలుగుదుమా, లేదా యనునది రెండవ ప్రశ్న. ఇది కొంతవరకే సరియైనదగునేమో కాని సర్వాంశమునందు మాత్రము కాదు. శ్వాసప్రశ్వాసల స్వాస్థ్యము ఒక ప్రక్రియ కాగా శ్వాసను నిలిపియుంచు టనునది మరొక ప్రక్రియ. శ్వాస అధికముగ నడుచు టొక రోగమే. అది ఆగిపోవుటయు రోగమే. కావున శ్వాసను నియంత్రణయం దుంచుట వలన స్వాస్థ్యము తప్పక బాగుపడును. కాని జీవితపరిమాణ నిర్ణయము కేవలము స్వాస్థ్యము వలననే జరుగదు. దీనిని నిర్ధారించు కారణములు మరికొన్నియు నుండవచ్చును. ఆయువు నిర్ధారణకు ప్రాణములను కొలమానముగ భావించువారి కల్పనకు బహుశః తైత్తిరీయోపనిషత్తు బ్రహ్మానందవల్లి లోని తృతీయానువాకమునందలి " ప్రాణో హి భూతానామాయుః " అను వాక్యము ఆధారమైయుండును :-

మనుష్యుని శ్వాస నడుచుచున్నంతవరకు అతడు జీవితుడని భావించుట సరియైనదే. కాని దీని భావము శ్వాసకును జీవనమునకును

కార్యకారణ సంబంధము కల దని కాదు. ఉపనిషత్తు నందు ప్రాణముల సంఖ్యపైన జీవిత మాధారపడియున్నదని చెప్పబడలేదు. ఈ సంఖ్య విషయము ఎవరో స్వతంత్రముగ కల్పించి యుందురు. ఒకవేళ జీవితము పూర్వజన్మ కర్మల భోగరూపముననే లభించినచో జాతి, ఆయువు మరియు భోగమును పూర్తిగ నిశ్చితరూపమున పొంది మేము పరిపక్వమైన కర్మల ఫలమును పొందితి మని ఈ మూడు విషయములచేత బంధింపబడితిమని అనవలసియుండును. అప్పుడు కర్మస్వాతంత్ర్యమున కవకాశము లేకుండ పోవును. ఈ కర్మస్వాతంత్ర్యాభావము పూర్వకర్మల ఫలప్రాప్తికి సరియైన కారణ మనిపించుకొనదు. కర్మఫల సిద్ధాంతములన్నియు చివరకు మన మోక్షప్రాప్తిని ప్రభావిత మొనర్చుటకే యుద్దేశింపబడినవి. కర్మఫలము ప్రతీకారము గైకొనుటకు కాదు. ఏదేని కల్పిత నియమమును తృప్తి పరచుటకును గాదు. పైన తెలిపినట్లు దుఃఖము ఔషధము కాగా సుఖము ఆహారమగుచున్నది. ఔషధము, ఆహారము ఈరెంటి అంతిమ ధ్యేయ మొకటి కలదు. అదియే స్వస్థత. భోజనము సూటిగా స్వాస్థ్యమును చేకూర్చును. ఔషధమేమో రోగమును నిర్మూలించి ఆరోగ్యము నొసగును. రెండింటి అంతిమ ఉద్దేశ్యము ఆరోగ్యమే. ఇదే విధముగా పూర్వకర్మల విపాకరూపమున మనకు ప్రాప్తించిన జాతి, ఆయువు, భోగము - మూడును సుఖ దుఃఖ (హ్లాదతాప)ములతో ఓతప్రోతమై యుండును. ఈ సుఖ దుఃఖముల కతిరిక్తముగ జీవితమునకు మరొక ఉద్దేశ్యము గూడ నుండవలెను. అదియే కర్తవ్యపాలనకును సమ్యక్జ్ఞానోపలబ్ధి కిని స్వేచ్ఛతో కూడిన అవకాశము. ఏ జీవనమందు ఈ నాల్గవ విషయముండదో దానిని కర్మఫల మనుట సరిగాదు. సాంఖ్యములో నిట్లు గలదు - **"అథ త్రివిధ దుఃఖాత్యంత నివృత్తి రత్యంత పురుషార్థః "** అనగా త్రివిధ దుఃఖముల నివృత్తియే పురుషుని జీవితమునకు వాస్తవికమైన అర్థము (పురుషార్థము). ఈ సుఖాదులు గూడ యోగదృష్టిలో దుఃఖములే యని యోగము తెలుపుచున్నది. యోగి ఈ జన్మయందు కేవలము సుఖదుఃఖముల ననుభవించుటే గాక వాని స్వరూపమును తెలిసికొని అనాగత (ఈక్షణము పిదప రానున్న) దుఃఖముల నివృత్తికై ప్రయత్నించవలసి యుండు నని దీనివలన తెలియుచున్నది. ఈ ప్రయత్నము మనము పూర్వమొనర్చిన కర్మలందు పూర్తిగ చిక్కుకొని యుండక వానియందు హెచ్చుతగ్గు లొనర్చు అవకాశము మనకు కలిగినపుడే సాధ్య మగును.

ప్రశ్న :- అట్టైన ఫలము యొక్క నిశ్చితత్వమున కాటంకము కలుగును. దానివలన ఈశ్వరుని నియమము భంగ మగును. మేము తుమ్మ విత్తును నాటియు దానినుండి మామిడి పండ్లను పొందగలుగుదుము. ఇది కర్మసిద్ధాంతమునకు పోషకము గాదు. దాని అవహేళనమే యగును.

సమా:- ఫల పరిమాణమును ఫలస్వరూపమును అర్థము చేసికోనందుననే ఇట్టి ఆక్షేపణ చేయబడును. తుమ్మవిత్తులను నాటి మామిడి పండ్లను పొందలేము. కాని తుమ్మచెట్టు పాలనపోషణలో భిన్నత్వమును ప్రవేశపెట్టి తుమ్మ ముళ్ళవలన కలిగెడు హానిలాభములందు తారతమ్యమును సాధింపగల్గుదుము. ఇది ఈశ్వరుని నియమముల నుల్లంఘించినట్లు గాక తదనుకూలాచరణ పరిణామము మాత్రమేయగును. తాము పూర్తిగా పరతంత్రుల మనుకొనెడివారు గూడ పొరపడుచున్నారు. మన జీవనమున ప్రవృత్తి, సంగతి, ప్రయతి అను మూడు వస్తువులు గలవు.

ప్రవృత్తిః సంగతిశ్చైవ తృతీయ ప్రయతిస్తథా !
ఆద్యే ద్వే తు పరాధీనే హ్యంత్యా స్వాతంత్ర్యమీహతే ॥

ప్రవత్తి ఒక విధమైన స్వభావము. అది పూర్వకర్మల ననుసరించి మనకు లభించును. విభిన్నయోనులందు జన్మించునట్టి జీవుల ప్రవృత్తులు వేర్వేరుగా నుండును. అవి వారి పూర్వపు జన్మజన్మాంతరముల కర్మలవలన నేర్పడియుండును. రెండవది సంగతి (సమాజము). మన మీప్రపంచమున జన్మించినపుడు ఒక విశిష్టవాతావరణము (పరిసరము)నం దున్నట్లు గ్రహింతుము. ఈ వాతావరణము గూడ ఆవరణమే. దీనిని పొందుటలో మనము పరాధీనులము. మనము చేసిన కర్మల ననుసరించియే మన కీ సంగతి; లభించును. దొంగతనము చేసినందున జైలుపాలైన దొంగ (౧) దొంగ ప్రవృత్తిని (౨) జైలు సంగతిని రెంటిని తనవెంట తెచ్చుకొనును. దొంగను స్వేచ్ఛగ తిరుగుటకై వదలివేసి అతని ప్రవృత్తిని మార్చుటకు వీలులేదు. ఈ విశేష సంగతి యొక్క ఉద్దేశము అతని ప్రవృత్తి పరివర్తనయే యనునది నిర్వివాదము, కాని సంగతిని మార్చివేయు అధికారము దొంగకు లేదు. మూడవది ప్రయతి. దీనియందు దొంగ కూడ సర్వస్వతంత్రుడే. అతనికి కర్తుం (చేయుట), అకర్తుం (చేయకుండుట), అన్యథాకర్తుం (విపరీతముగ

చేయుట) అను విషయమున పూర్తి స్వేచ్ఛ గలదు. అతడు జైలులో ఉండి గూడ అచ్చటి వాతావరణ ప్రభావము తనపై తక్కువగాపడునట్లు చేసికొనగల్గును. జైలులో కఠినాతి కఠిన నియమములను చక్కగా పాలించి జనులు తమ పాపములకు ప్రాయశ్చిత్తము చేసికొని సాధుస్వభావులుగా మారవచ్చును. అదే జైలులో, అదే వాతావరణమునందు దుష్టప్రవృత్తి గలవారు ఎట్టి సంకోచము లేకుండా ఘోరాతి ఘోరమైన పాపమొనర్చు ప్రవృత్తిని పెంపొందించు కొనవచ్చును. అందుకు ప్రవృత్తి సంగతులతో ప్రయతికి ఘోరమైన సంఘర్షణ చేయవలసివచ్చును. ప్రవృత్తి , సంగతుల రెంటియందును పరివర్తనము కలుగుట కఠినమే కావచ్చును, కాని అసంభవము మాత్రము కాదు. ప్రవృత్తి సంగతులను కొంతవరకైనను మన వశమొనర్చుకొనగల్గిన మనము మన భోగములపై ఏ కొంతయో ఆధిపత్యము సంపాదించితి మని భావింపవలెను. "జ్ఞానపూర్వకమైన ప్రయతి" వలన మనకు ఈ జన్మలో కలుగు సుఖదుఃఖములందు గూడ పరివర్తనము కలుగు నని దీనివలన స్పష్టమగుచున్నది. ఇది కొంత కష్టసాధ్యమే. దీనివలన ఈశ్వరీయ కర్మఫల సిద్ధాంతము ఖండితము కాదు. ఏలన కర్మల యొక్క ఫలము భావిశుభకర్మలు పూర్వపు అనిష్టభోగముల కాఠిన్యమును కోమల మొనర్చును. ఇది చిన్నమార్పు గాదు. సంకెళ్ళు తగిలింపబడిన దొంగకు జ్ఞానోదయమై అతడు తన పాపములకు ప్రాయశ్చిత్తము జరుగుచున్న దని గ్రహింపగలిగెనేని అతడా సంకెళ్ళను త్రెంచుకోలేనప్పటికిని ఆ సంకెళ్ళు అతని ఆంతరిక దుఃఖమును తగ్గింపగల్గును. దీనికి భిన్నమైన మనోవృత్తిగల బందీ కారాగారాధికారితో పోట్లాడి తన క్లేశములను మరింత పెంచుకొనును. శిక్షాకాలములో హెచ్చు తగ్గులు కాకుండు టనునది వేరే విషయము.

ఫలమునందు పరివర్తనము

ప్రశ్న :- పూర్వజన్మ కర్మల ఫలస్వరూపమున నాకు లభించిన జాతి, ఆయువు, భోగము ఈ మూడింటియందును పరివర్తనము కలుగుటకు నే నీ జన్మ యందు ఏమైనను చేయగలుగుదునా ? ఇది నా సూటిప్రశ్న.

సమా:- ప్రశ్న సూటిగా లేదు. దీనికి సమాధానము గూడ సుబోధకముగ నుండదు. ఐనను ఆలోచింపవలెను. మొదటి విషయమును గైకొనుడు.

కర్మలు సంచితములు, క్రియమాణములు, ప్రారబ్ధములు నని మూడు విభాగములు. మొదటిరకపు కర్మలు ఇప్పుడే ఫల మొసంగక కాలాంతరమున ఫలము నిచ్చుటకు సురక్షితమైయుండును. ఇప్పుడు చేయబడుచున్నవి రెండవరకపు కర్మలు. పరిపక్వమై ఫలమునొసంగ నారంభించినవి మూడవరకపు కర్మలు. ఈ జన్మయందు మనము ప్రారబ్ధము అనగా పరిపక్వమై సిద్ధముగ నున్నట్టి - కర్మల ఫలమును పొందుచున్నాము. పూర్వము ఒక జన్మలోనో, అనేక జన్మలలోనో చేసిన కర్మలు ఇంకను పరిపక్వము కానట్టివి ఉండవచ్చును. వాటిఫలము ప్రస్తుతము మనకు లభించుటలేదు. న్యాయాలయములోని వ్యాజ్యెముల దృష్టాంతమును గైకొందము. న్యాయాలయములో భవిష్యత్తులో తీర్పు చెప్పుటకై నిలిపివేయబడిన వ్యాజ్యెము లెన్నియో యుండును. అవి పక్వమైనపుడే విచారణకు గైకొనబడును. కొన్నింటికి ఫలము వినిపించబడినది. ఎట్టి దండన నెట్లు విధించు టుచిత మని భావింపబడినదో అట్లే ప్రకటింపబడినది.

మరొక దృష్టాంతము - ఒక వృక్షపు ఫలము ప్రత్యక్షరూపమున మన యెదుట నున్నది. మనము ఫలమును పొందుచున్నాము. కాని కొన్ని పక్వమగుటకు చాల సమయము పట్టును.

దీని వలన ఒక విషయము స్పష్టమగుచున్నది. వివిధ కర్మలు పక్వమగుటకు వివిధ కాలపరిమితు లవసర మగును. కొన్ని కర్మలు పక్వమగుటకు పాలకూరకు వలె రెండు మాసముల కాలము పట్టును. కొన్నింటికి జామ, నారింజలవలె మూడు నాలుగు సంవత్సరములు పట్టును.పనస పండ్లవలె కొన్నింటికి అతి దీర్ఘకాలము పట్టును. రెండు మూడు జన్మల కాలములో పక్వ మగునట్టి కర్మ లుండును గదా! అట్టిచో మూడు నాలుగు నెలలలోనే పక్వ మగునట్టి కర్మ లెందుకుండ గూడదు? మీ భావమును బట్టి మూడు స్థితులు స్ఫురించును.

౧. ఒక జన్మలో చేసిన కర్మలకు ఫలము దాని తరువాత జన్మలో తప్పక లభింపవలెను. చైత్రమాసములో చేసిన ఉద్యోగమునకు పూర్తి వేతనము వైశాఖములో లభించును గదా!

౨. కొన్ని కర్మలకు ఫలము తరువాతి జన్మలోను మరికొన్నింటికి మూడు నాలుగు జన్మల తరువాతను లభించును.

౩. కొన్ని కర్మలఫలము ఈ జన్మలోనే లభించును.

మీరు మొదటి రెండంశముల నంగీకరింతురుగదా! మరి మూడవదాని నెందుల కంగీకరింపరు? మీకేమి ఆక్షేపమా?

ప్రశ్న :- అట్లు నమ్మినచో యోగదర్శన సూత్రమున కది విరుద్ధ మగును. జాతి,ఆయువు, భోగములు కర్మవిపాకమైనంతనే లభించునని యోగదర్శనమున గలదు. ఇచట 'జాతి' అనుపదము 'జన్మ'ను సూచించుచున్నది. కావున ఈ జన్మలో చేసిన కర్మలకు ఫలము ఈ జన్మలో పొందలేమని ఋజువగుచున్నది.

సమా:- యోగసూత్రమందు ఈ జన్మలో చేసిన కర్మలకు ఫలము ఈ జన్మలో లభింపజాలదని నిశ్చియముగ చెప్పబడలేదు గదా! అచట 'జన్మ' గాక కర్మవిపాకము (పక్వమగుట) కారణముగ పేర్కొనబడినది. కర్మ లన్నియు ఒకే సమయమున పరిపక్వము గావు. వివిధ కర్మల విపాకమునకు విభిన్న కాలపరిమాణము లవసర మగును. మన ప్రస్తుత జన్మకు కారణము తప్పక మన మీ జన్మకు పూర్వము చేసిన "కొన్ని కర్మలు" కావచ్చును. "కొన్ని" అనుట తప్పదు. ఏలన ఈ జన్మ లభించుటతోడనే పూర్వజన్మలోని సమస్త కర్మల ఫలము ననుభవించితిమి. ఇక 'భోగము" కొరకు కర్మ లేవియు మిగిలిపోలేదు అని యనజాలము కదా!

మా యీవాదమును యోగదర్శనము బలపరచుచున్నది.

క్లేశమూలః కర్మాశయో దృష్టాదృష్ట జన్మవేదనీయః

దీనిపై వ్యాసుని భాష్యమిట్లున్నది

న దృష్ట జన్మవేదనీయశ్చాదృష్ట జన్మవేదనీయశ్చ।

మరియు భోజుని భాష్యము

అస్మిన్నేవ జన్మని అనుభవనీయో దృష్ట జన్మవేదనీయః।

జన్మాంతరానుభవనీయోఽ దృష్టజన్మవేదనీయః।

అనగా - ఏ కర్మలఫలము ఈ జన్మలో లభించునో అవి "దృష్టజన్మవేదనీయః" అగును. జన్మాంతరమునందు వేని ఫలము లభించునో

అనగా - ఏ కర్మలఫలము ఈ జన్మలో లభించునో అవి "దృష్టజన్మవేదనీయః" అగును. జన్మాంతరమునందు వేని ఫలము లభించునో అవి "అదృష్ట జన్మవేదనీయః" అగును. వీని కుదాహరణములు రెండు భాష్యములందును గలవు.

ప్రశ్న :- సూత్రమందు కేవలము 'ఫలము' అని పేర్కొనక జాతి, ఆయువు, భోగము లనెడి మూడు శబ్దముల నెందుకు ప్రయోగించిరి?

సమా:- ఇది చక్కని ప్రశ్న. దీనివిషయమున ఇదివరకే కొంత చెప్పబడినది. మనము ఫలము ననుభవించుటయే కాక కర్మలను గూడ చేయవలసి యుండును. పూర్వకర్మల ఫలము ఎందుకు లభింపదో తెలియునా? అట్లు లభించినచో మనము నిష్క్రియులమై పోయెడివారము. మన జీవితమే (అస్తిత్వమే) సమాప్త మయ్యెడిది. సాంతములైన కర్మలకు అనంతమైన ఫల ముండదు గదా! ఆ ఫలము గూడ ఉచ్చతరమైన కర్మ లొనర్చుటకై క్షేత్రమును సిద్ధపరచుటకే ఇవ్వబడును. అందువలన ఏపరిస్థితులందైతే మనము భావి కర్మ లొనర్చవలసి యున్నదో వానినే 'జాతి" లేక 'జన్మ" అందురు. జనులు జాతి లేక జన్మ శబ్దములను సంకుచితార్థములో అనగా కుక్క, పిల్లి, పాము, మనుష్యాది యోనులలో మాత్రమే ప్రయోగింతురు. వారి దృష్టిలో జాతి లేక జన్మయన కుక్క, పిల్లి, పాము, మనుష్యాది యోనులని మాత్రమే. వాస్తవమున ఈ యోనులు పరిస్థితికి అంగము మాత్రమే. పరిస్థితియందితరాంశము లెన్నియో చేరియుండును. వీటన్నింటిని గూడ "జాతి" అంతర్గతములుగనే లెక్కింపవలెను. "ఆయువు" అనగా కాలపరిమాణము. ఏయే పరిస్థితులతో అనుకూల ప్రతికూలతలను ప్రదర్శించి మనము భావి కర్మలు చేయవలసి యుండునో ఆయా పరిస్థితులు మన మనస్సుపైన చూపే ప్రభావమే భోగము. భీరువులైనవారు ఆపదవలన లేక దుఃఖానుభూతివలన కృంగిపోవుదురు. కర్తవ్యచ్యుతులగుదురు. వీరులు వాని నెదుర్కొని ముందుకు సాగిపోవుదురు.

ప్రశ్న :- జాతి, ఆయువు, భోగములు నియతములైనచో వాటిని మార్చు ప్రయత్నము వ్యర్థమే గదా! జరుగవలసిన దేదియో అది జరిగియే తీరును. అందు పిసరంతయైనను భేదము కలుగదు. ఒకవేళ నాభాగ్యమున నాభార్య మరణించి మరొక స్త్రీతో వివాహము

జరుగునని యున్నచో అట్లే జరిగితీరును. అట్లే ఒక స్త్రీ భాగ్యమున వైధవ్యము వ్రాయబడి యున్నచో ఆమె విధవయై తీరును. నా మృత్యువు ४० సంవత్సరములకు కావలసియున్నచో నేనేమి చేసినను నామరణము తప్పదు. తులసీదాసు స్పష్టముగనుడివెను.

"హాని లాభ్ జీవన్ మరణ్ యశ్ అపయశ్ విధిహాథ్"

సమా:- మీ ప్రశ్న సూటిగా లేదు. పూర్వపు ప్రశ్నోత్తరములందు మేము చాలవరకు స్పష్టపరచియే యుంటిమి. మీరును వాని నంగీకరించితిరి. ఇపుడా నిశ్చయమునకు విరుద్ధముగ అవే అనిశ్చతమైన పాతమాటల నాశ్రయించితిరి.

తులసీదాసు హాని- లాభము, జీవన-మరణము, యశ-అపయశముల నిచ్చువాడు భగవంతుడే యని నుడివెను. కాని ఈశ్వరుడు తనంతట తానే ఇష్టము వచ్చినది యొసగు ననలేదు. ఈశ్వరుడు ఫలము నొసగువాడే. కాని ఆఫలమును కర్మల ననుసరించియే ఇచ్చును.హాని లాభములు గాని, యశాపయశములు గాని మీకర్మల ననుసరించియే యుండును. ఈమూడు ద్వంద్వములు అనగా హానిలాభములు, జీవనమరణములు, యశ అపయశములు ఫలస్వరూపములు మాత్రమే.

ముఖ్యమైన రెండవ విషయము- ఫలముయొక్క పరిమాణము పూర్వ కర్మలపైననే. కాని క్రొత్త కర్మలు ఫలపరిమాణమును మార్చజాలవు అని పేర్కొనలేదు. ఇది మీరు స్వయముగ కల్పించి చేర్చిన విషయమే. కేవలము పూర్వ కర్మలే యుండి క్రొత్త కర్మ లేవియు లేకున్న కర్మఫలము అంతే యుండెడిది. అధికముగ నుండెడిది కాదు. కాని జీవుని కర్తృత్వము ఎన్నటికిని నష్టముకాదు. అతడు శుభకర్మలు చేయకున్నచో అశుభకర్మలు చేయగలడు. అకర్తవ్యకర్మలు చేయు టెంత పాపమో కర్తవ్యకర్మలు చేయకుండుటయు అంతే పాపము. కావున మీరు క్రొత్త కర్మలు చేయుటయు వాని విపాకము ఆ కర్మల ననుసరించి యుండుటయు జరిగినపుడు పూర్వకర్మలద్వారా సంపాదించిన ఫలపరిమాణమునందు భేదము తప్పనిసరియగును గదా! న్యాయ, తర్కములు దీనిని నిరూపించును. మీ మొదటి భార్య మరణించెనన అందుకు మీరును

ఆమెయు చేసికొనిన కర్మలే ఆధారము. ౩౧ కాని మీరు పునర్వివాహము చేసికొనుట కేవలము మీకర్మయే. మీరు తెలిసియుండియే ఈకర్మచేయుచున్నారు. ఇది మీ స్వాధీనమందున్నది. ఇష్టమున్న చేసికొనవచ్చును, లేకున్న మానవచ్చును. మీరీక్రొత్త కర్మకు పూర్వభోగములతో సంబంధమేర్పరచి మీ వాంఛాపూర్తి కొక సాకును కల్పింపదలచుకొనినచో అది గొప్ప పొరపాటేయగును. వివాహము చేసికొనుట కర్మయే యగును. కాని ఫలము కాదు. కావున ఈ కర్మను పూర్వకర్మఫలమని పేర్కొని మీ దోషమును తొలగింపజూచుకొనుట అన్యాయమే.

ప్రశ్న :- **మరి మేము మాభోగములందు పరివర్తనము చేయగల్గుదుమా ?**

సమా:- మీరు తలచుకొన్నచో తప్పక చేయగల్గుదురు, చేయుచున్నారు గూడ. ఒక లౌకిక ఉదాహరణను గమనింపుడు. నేను చైత్రమాసమంతయు ఉద్యోగము చేసితిని. వైశాఖము మొదటినాడు రు.౨౦౦/- ల వేతనము లభించెను. చైత్రములో చేసిన ఉద్యోగము కర్మ. రు ౨౦౦/-లు దాని ఫలము. దీనిని మీరు జాతి, ఆయువు, భోగము మూడు గూడ అనవచ్చును. ఏలన ఈ ధనప్రాప్తి ఒక అంశమున పరిస్థితి, కాలము, సుఖదుఃఖముల మూడింటిని కలుగజేయును. నేనీ రెండు వందల రూపాయలను తెలివిగా వ్యయము చేసినచో భావిశుభకర్మ లెన్నింటికో సాధనముల నుత్పన్నము చేయగల్గుదును. అట్లుగాక ఆనాడే జూదమాడి ఆ ధనమును కోల్పోయినచో ఆనాడే జాతి, ఆయువు, భోగము మూడింటిని గందరగోళమొనర్చగలను. ఈ రు ౨౦౦/- పరిమాణము నాపూర్వార్జితమునకు పరిమితమై భవిష్యత్తున బాధ్యత లేక కర్తృత్వము నానుండి తొలగింపబడి నేను "కర్తుం, అకర్తుం, అన్యథాకర్తుం" అనువానికి పూర్తిగా అశక్తుడనగునట్టి స్థితిలో ఉంచబడినచో రు. ౨౦౦/ల పరిమాణములో హెచ్చుతగ్గు లేమియు కాకుండెడివి. కాని అది నాస్వాభావికమైన అధికారముపై కుఠారాఘాతమే అయ్యెడిది. కర్తృత్వము, కర్తృత్వ బాధ్యత నాకు జన్మసిద్ధములు, సహజాధికారములు. భావికర్మలకొరకు క్షేత్రమును సిద్ధపరచుటకే ఈ రు ౨౦౦/-లు నాకొసగబడినవి. కావున నాభావికర్మలు ఈ "పరిమాణము"ను న్యూనాధికము చేయగలవు. పరిమాణము ఫలముదే. ఫలమువలన ఉత్పన్నమగు కర్మక్షేత్రమునకు సంబంధించినది కాదు. అందువలన ఆ ఫలముతో నేను నాక్షేత్రమును ఉత్కృష్టముగనో నికృష్టముగనో

చేసికొను అధికారము (స్వేచ్ఛ) నాకు గలదు. ఈశ్వరుడు పూర్వకర్మలకు ఫలమొసగుట ద్వారా నాస్వేచ్ఛను హరించుట లేదు. పైగా స్వేచ్ఛను ప్రయోగించు సాధనము నుత్పన్నము చేయుచున్నాడు. నేడు దుర్వ్యసనములలో దగుల్కొని రు.౨౦౦/- లు నష్టపరచి రేపు భిక్షమెత్తుకొనుచు తిరుగుటకును లేదా ఎన్నోరెట్లధిక సాధనములు ప్రాప్తించుకొనునట్లు వ్యయము చేయుటకును నాకు అధికారము (స్వేచ్ఛ) గలదు. ఇదే విధముగ పూర్వజన్మకర్మల ద్వారా లభించిన జాతి, ఆయువు, భోగములను ప్రస్తుత జన్మలోని ఆచరణ (కర్మల) ద్వారా న్యూనాధికము చేసికొనగల్గుదును. అందువలననే వేదశాస్త్రములందు ఆయుర్వృద్ధికిని సంపదవృద్ధికిని, సుఖవృద్ధికిని సాధనములు చూపబడినవి. అంతేకాదు మృత్యువు, రోగము, కొరత, దుఃఖము వీనిని తగ్గించు సాధనములు గూడ చూపబడినవి. మనము ఆయువును, వాతావరణమును, సుఖమును వృద్ధిచేసికొనగలుగుదు మనెడి సిద్ధాంతవే సమస్త ఆచార-నీతిశాస్త్రముల కాధారము. ఆయువు పెరుగజాలదని, పరిస్థితి మారజాలదని, భోగములందు మార్పుజరుగనేరదని ఏ శాస్త్రమందును చెప్పబడలేదు. యోగదర్శనములో ఈ ప్రసంగమునకు సంబంధించిన సూత్రమందుగాని, దాని తరువాతగల మరే సూత్రమునగాని ఇట్లు వ్రాయబడలేదు. విభూతి పాదమందుగల విభూతుల ప్రభావము జాతి, ఆయువు, భోగముల ప్రాప్తి యగును. అవి న్యూనాధికములు కాకుండ నిషేధింపబడినది. కర్మఫలము సుఖదుఃఖముల రూపముననే లభించునను విషయమును మీరు ప్రత్యక్షముగనే చూడవచ్చును. సుఖ దుఃఖములు మానసికావస్థలే గాని శారీరకముగాదు. జ్ఞానులును యోగులును ఈ మానసిక దుఃఖమును జ్ఞానముద్వారా తగ్గించు కొనగల్గుదురు. మూర్ఖులు దానిని పెంచుకొనగల్గుదురు. వైరాగ్యముద్వారా తన మనస్సును వశమందుంచు కొన్న వ్యక్తి సహింపరాని ఘోరాతి ఘోరదుఃఖమును సహించుకొనగలుగును.

ఈ జన్మలో చేసిన కర్మలకు ఫలము ఈజన్మయందే లభించునా?

ప్రశ్న:- ఈజన్మలో చేసిన ఏ కర్మకైనను ఫలము ఈ జన్మయందు గూడ లభించగల దనుట కేదేని శాస్త్ర ప్రమాణము చూపగలరా ?

సమా:- కావలసినన్ని చూపగలను. ఈ జన్మలో చేసిన కర్మలలో దేనికిని ఈ జన్మయందు ఫలము లభించ దనుటకు ప్రమాణము ఏ గ్రంథముననను లభింపదు. చూడుడు -

౧. **దేవానాం సఖ్యముపసేదిమా వయం।**

దేవాన ఆయుః ప్రతిరన్తు జీవసే । (యజు. ౨౫-౧౫)।

"మేము దేవతల సఖ్యతను పొందుదుము గాక! ఆ దేవతలు మా ఆయువును వృద్ధిచేయుటలో సహాయకు లౌదురు గాక!"

౨. దీనిని పోలిన మనుస్మృతి శ్లోకమును చూడుడు -

అభివాదనశీలస్య నిత్యం వృద్ధోపసేవినః ।

చత్వారి తస్య వర్ధంతే ఆయుర్విద్యాయశోబలమ్ ॥ మను. ౨-౧౦౩॥

" సదా వినయసంపన్నుడు, శీలవంతుడు, విద్వాంసులను , వృద్ధులను సేవించువాడు నైన వ్యక్తి యొక్క ఆయువు, విద్య, కీర్తి, బలము - ఈ నాలుగు సదా వృద్ధిచెందుచుండును. అట్లొనర్చనివారి ఆయువు మున్నగు ఈ నాలుగును పెంపొందవు."

౩. **దురాచారో హి పురుషో లోకే భవతి నిందితః ।**

దుఃఖభాగీ చ సతతం వ్యాధితోల్పాయురేవ చ ॥ మను ॥

" దురాచారియైనవాడు (లోకే)ఈ లోకమందు దుఃఖభాగియు అల్పాయుష్కుడునగును. ఇట'లోకే" అనెడి పదము ఆలోచింపదగినది.

౪. **క్లేశమూలః కర్మాశయో దృష్టాదృష్ట జన్మ వేదనీయః ।**

(యోగదర్శనము సాధనపాదము, సూత్ర.౧౨)

ఇందు కర్మాశయము "దృష్టజన్మవేదనీయః"మరియు "అదృష్టజన్మ వేదనీయః" గా తెలుపబడినది. అనగా కొన్ని కర్మలకు ఫలము ఈ జన్మలోను మరికొన్నింటికి మరో జన్మలోను లభించు నని తాత్పర్యము.

వ్యాసభాష్యమం దిట్లు వ్రాయబడినది -

తత్ర తీవ్ర సంవేగేన మంత్ర తాపః సమాధిభిర్నిర్వర్తితః ఈశ్వర దేవతా మహర్షి మహానుభావానాం భారాధనాద్వా యః పరినిష్పన్నః సద్యః పరిపచ్యతే పుణ్యకర్మాశయ ఇతి ।

తీవ్ర శుభకర్మలు "సద్యః" (శీఘ్రమే) అనగా ఈ జన్మయందే పరిపక్వమై ఫలము నొసగును.

తథా భీతక్లేశేన భీతవ్యాధిత కృపణేషు విశ్వాసోపగతేషు వా మహానుభావేషు వా తపస్విసు కృతః పునః పునరపకారః స చాపి పాప కర్మాశయ సద్య ఏవ పరిపచ్యతే ।

అనగా తీవ్ర అశుభకర్మలు గూడ ఇదే జన్మలో (సద్యః) పరిపక్వమై ఫల మొసగును.

ఇచట నందీశ్వరనహుషుల ఉదాహరణ ద్వారా ఈ విషయము స్పష్ట మొనర్పబడినది.

"భోజవృత్తి" యందును ఈ సూత్రమందలి విషయమే సుస్పష్టమైన శబ్దములలో చెప్పబడినది.

అస్మిన్నేవ జన్మని అనుభవనీయో దృష్ట జన్మవేదనీయః । జన్మాంతరానుభవనీయోఽదృష్టజన్మవేదనీయః ।

తథాహి కానిచిత్ పుణ్యాని కర్మాణి దేవతారాధనాదీని తీవ్ర సంవేగేన

కృతాని ఇహైవజన్మని జాత్యాయుర్భోగ లక్షణం ఫలం ప్రయచ్ఛంతి ।

"ఇహైవ జన్మని" కి కేవల మొకే యర్థము సంభవము. అనగా కొన్ని కర్మ లెట్టి వన వానికి ఫలము ఈ జన్మయందే లభించును.

౫. జన్మౌషధి మంత్ర తపః సమాధిజాః సిద్ధయః । (యోగ. ౪-౧)

దేహాంతరితా జన్మనా సిద్ధిః । ఓషధిభిరసురభవనేషు రసాయనే నైత్యేవమాదిః । మంత్రైరాకాశగమనాణిమాది లాభః । తపసా సంకల్ప సిద్ధిః । కామరూపీ యత్ర తత్ర కామజ ఇత్యేవమాది సమాధిజాః సిద్ధయో వ్యాఖ్యాతాః ।

వ్యాసభాష్యము -

ఇట రెండు విధముల సిద్ధులు పేర్కొనబడినవి. ఒకటి అన్య జన్మలందు ఫలము

నొసగునట్టివి. రెండు-ఈ జన్మలోనే ఫలము నొసగునవి.

౬. జైమినీ మహర్షికృత పూర్వమీమాంసలో ౪-౨-౨౮ సూత్రమునకు శాబర భాష్యమును చూడుడు. ౨౭ వ సూత్రమునందు పూర్వ పక్షమును ౨౮ వ సూత్రమున ఉత్తరపక్షమును గలదు. ఆ రెండు సూత్రములను ఇచట అధికరణ సహితముగ నిచ్చుచున్నాము. దీని వలన జైమినీ శబరుల కాలమందును ఈ సమస్య ఉండెడిదని తెలియుచున్నది. జైమిని యొసగిన సమాధానము కొన్ని కర్మలు ఈ జన్మలోనే పక్వమై ఫలము నిచ్చు నని స్పష్టముగ తెలుపుచున్నది.

(అధికరణము ౧౨ సూత్రము ౨౭, ౨౮) ఈ దర్శపూర్ణమాసాది యాగములకు ఈ జన్మయందును భావిజన్మలందును ఫలము లభించును.

తత్ర సర్వే అవిశేషాత్ । (సూత్రము ౪-౩-౨౭)

(సర్వే) అన్ని ఫలములు (తత్ర) జన్మాంతరమందు లభించును. (అవిశేషాత్) విశేషత పేర్కొనబడనందువలన.

"సౌర్యచరూం నిర్వపేద్ బ్రహ్మవర్చసకామః " -

బ్రహ్మవర్చస్సు కోరువాడు సౌర్యదేవతా చరు (యజ్ఞాన్నము)తో యాగము చేయవలెను. (తైత్తిరీయ సంహిత ౨,౩,౨,౩)

"ఐంద్రాగ్నమేకాదశ కపాలం నిర్వపేత్ ప్రజాకామః "

సంతానము కోరువాడు ఇంద్రాగ్ని దేవతలకొరకు పదునొకండు కపాలములందు వండబడిన పురోడాశమును సిద్ధపరచవలెను.

(తైత్తరీయ సంహిత ౨,౨,౧,౧)

"చిత్రియా యజేత్ పశుకామః" పశువుల గోరువాడు చిత్రాయాగము చేయవలెను

(తైత్తి.సం. ౨,౪,౬,౧)

"వైశ్వదేవీం సాంగ్రహాయణీం నిర్వపేద్ గ్రామకామః"

గ్రామముల కోరువాడు విశ్వేదేవతల కొరకు "సాంగ్రహాయణీ " యజ్ఞము చేయవలెను. (తైత్తి.సం. ౨,౩,౯,౨)

ఈ కోరికలు ఈ లోకమందు సిద్ధించునా లేక పరలోకమందా? అను ప్రశ్నకు

(పూర్వపక్షము) - పరలోకమందు సిద్ధించును. ఏలన ఇందు విశేషమేమియు లేదు. స్వర్గ ప్రాప్తియం దే విషయము గలదో అదే దీనికిని వర్తించును. అనగా స్వర్గాపేక్షకును ఈ కోరికలకును భేద మేమియు లేదు. యజ్ఞము చేసిన వెంటనే సంతానము, పశువులు మున్నగు ఫలములు లభింపవు గదా! ఏదేని కార్యము చేసిన వెంటనే ఫలము లభించినచో ఈ పనికి ఈ ఫలము లభించె నని చెప్పవచ్చును. ఎట్లన శరీరమర్దన జరిగిన వెంటనే సుఖానుభవము కలుగును గదా! ఏ ఫలమైతే కాలాంతరమున లభించునో దానికి (ప్రత్యక్షమున) కనబడునట్టి కారణము వేరుగానుండును. (ఉదా: వెల యిచ్చి కొన్నచో పశువులు లభించును.) శరీర ప్రాప్తికి అదృష్టము తప్ప మరొక కారణ మేమియు కాన్పించదు. కావున శ్రుతులందు ఒకానొక యాగమునకు కొండొక ఫలముండు నని చెప్పబడిన దానికి అర్థము ఆ యాగము చేయుట వలన మరొక జన్మయందు అట్టి శరీరేంద్రియాదులు లభించి వానిద్వారా ఇష్టఫలప్రాప్తి యగుననియే. ఈ విషయము దిగువ వచనముల వలన స్పష్టముగ ఋజువగు చున్నది.

కైకేయో యజ్ఞం వివిత్సన్ దాలభ్యమువాచ :-

అనయా మా రాష్ట్ర - ప్రతిపాదనీయ యేష్యా యాజయేతి । సోఽ బ్రవీత్ న వై సోభ్య రాష్ట్ర ప్రతిపాదనీయాం వేత్థ । అముష్మై కామాయ యజ్ఞా అహ్రియంతే ।

కేకయుడు యజ్ఞము చేయు కోరిక గలవాడై దాలభ్యునితో రాష్ట్రప్రాప్తి యొడగూర్చునట్టి యజ్ఞము చేయించుమనెను. అందుపై దాలభ్యు డిట్లనెను "సోదరా! యజ్ఞము చేయుటవలన ఈ జన్మయందే రాజ్యప్రాప్తి యగునని తలంపకుము. యజ్ఞములు పరలోకము కొరకే చేయబడును."

దీనివలన కామ్యకర్మలు మరో జన్మలో ఫలప్రాప్తికై చేయబడునని స్పష్టమగుచున్నది.

(ఉత్తరపక్షము) - **యోగసిద్ధిర్వాఽర్థస్యోత్పత్త్య సంయోగిత్వాత్ ।**

(సూత్రం ౪ ౩ ౨౮)

అర్థము - ఈ జన్మయందే ఫలసిద్ధి కావలెను. లేకున్న ఆదేశములు గల శ్రుతులయోగము సంభవము కాదు. కొండొక యాగమునకు కొండొక ఫలముండు ననిన చోట ఆఫలము ఈ జన్మలో లభింపదని చెప్పబడలేదు గదా!

ప్రత్యక్ష, అనుమాన ప్రమాణములు లేకున్నను వేదప్రమాణము కలదు గదా! పూర్వ పక్షమున కాలాంతరమందు లభించు ఫలమునకు వేరే కారణము గూడ కనిపించు నని వాదించబడినది. (ఉదా: పశుప్రాప్తి క్రయము వలన జరిగినది. కావున పశువు యాగఫలము గాక క్రయఫలమే యగును.) క్రయము, యాగము రెండును కారణములు కావచ్చు ననియే దీనికి సమాధానము. యజ్ఞములు పరలోకము కొరకే చేయబడునని పూర్వపక్షములోని వాదము. దీనికి సమాధానమేమన- దాలభ్యుని మాటలకు సరియైన అర్థమును మీరు గ్రహింపలేదు. "ఓ కేకయా! నేను ఈ జన్మయందే ఫలము నొసగు యజ్ఞమును చేయింపదలచుట లేదు. నేను పరలోకము కొరకే యజ్ఞము చేయింతును" అనియే అతని భావము.

సంచితము, క్రియమాణము, ప్రారబ్ధము

ప్రశ్న:- సంచిత, క్రియమాణ, ప్రారబ్ధ కర్మలన నేమి? ఈ విభాగమున కాధారమేమి?

సమా:- మనుష్యుడు వర్తమానమందు చేయుకర్మలు క్రియమాణము లనబడును. ఫలితముల నివ్వక ప్రోగగుచుండు కర్మలను సంచితము లందురు. సంచిత కర్మలలో ఏ యే కర్మలు విపాకమునొంది అనగా పక్వమై ఫలము నొసగ దొడగునో వానిని ప్రారబ్ధ మందురు. నేను ఈ సమయమున అనగా వర్తమానమందు చేయుచున్నట్టి కర్మలు క్రియమాణములు. కొద్దిసేపట్లో ఈ వర్తమానకాలము భూతకాల మగును. అప్పుడే క్రియమాణ కర్మలు సంచితములై పోవును. (సమ్+చిత్) సంచితమనగా ప్రోగుచేయబడినవి. మనకీ సంచిత కర్మల ఫలమే లభించును. కాని సంచిత కర్మలన్నియు ఒకే తీరుగనుండవు. వాని ఫలము గూడ ఒకే సమయమున లభింపదు. ఉదాహరణకు - పాలకూర విత్తనములు వేసిన అవి రెండు నెలలకు ఫలము నొసగును. జామ విత్తనములు నాటిన పిదప కొన్ని సంవత్సరములకు ఫలము నిచ్చును. పనస విత్తనముల నాటినచో ఫలము లభించుటకు ఇంకా ఎక్కువ కాలము పట్టును. మీ రెవరినైనా తిట్టినచో వెంటనే అతడు మిమ్ము తిట్టుటయో లేక చెంపదెబ్బ పెట్టుటయో జరుగును. అట్లుగాక మీరు అతని వస్తువులను లాగికొందురేని అతడు రక్షక భటులకు సూచించి మీకు శిక్ష పడువరకు సంవత్సరకాలము గూడ పట్టవచ్చును. మీ రెవరినైనా చంపినచో

మీకు ఉరిశిక్ష పడుటకు రెండు సంవత్సరముల కాలము గూడ పట్టవచ్చును. ఇదే విధముగ కర్మల వ్యవస్థ గలదు. ఈశ్వరీయ నియమముల ననుసరించి మన సంచిత కర్మలలో కొన్నిటికి ఫలము ఇప్పుడే లభించును, కొన్నిటికి 3,౪ సంవత్సరములలోను మరికొన్నిటికి జన్మ జన్మాంతరములందును లభించును. ఏ కర్మకు ఫల మెప్పుడు లభించునో తెలిసికొనుట కష్టము. ఏలన సమస్త సంచితకర్మలు సూక్ష్మరూపమున మన అంతఃపటలముపై అంకితమై యున్నవి. ఐనను మనమువాని నన్నిటిని చదువుకొనజాలము. ఏవిధముగనైతే మన అంతః పటలముపై ప్రోగైయున్న సమస్త సంచిత జ్ఞానము మనకు సర్వదా ప్రత్యక్షముగాదో, కాలాంతరమున కొన్నిటి స్మృతి కలిగి కొన్నిటిది కలుగదో అదే విధముగ ఈ విషయము గూడ నని గ్రహింపవలెను. కర్మలు పరిపక్వమై ఫలమొసగ నారంభించి నపుడు వానినే ప్రారబ్ధ మందురు. అనగా క్రియమాణ కర్మల అంతము సంచితమగును. సంచితములనుండి ఏయే కర్మలు ఫలమొసగుచుండునో అవి ప్రారబ్ధము లగును. మన అధికారము క్రియమాణ కర్మలపైననే కలదు. ఇష్ట మున్నచో కర్మలు చేయవచ్చును. లేకున్న మానవచ్చును. ధనుస్సునుండి బాణము వెడలిన పిదప తిరిగి వచ్చుటకు వీలుండదు గదా!

"అవశ్యమేవ భోక్తవ్యం కృతం కర్మ శుభాశుభమ్"

సంచిత కర్మల నుండి ఏ కర్మ విపాక మెప్పుడగును. అనగా సంచిత కర్మల సమూహమునుండి ఏది యెప్పుడు ప్రారబ్ధ మగు ననునది ఈశ్వరుని వ్యవస్థ ననుసరించియే జరుగును. జనులు ప్రారబ్ధమును 'అదృష్ట' మందురు. ఏలన ఇందు ఈశ్వరుని ప్రమేయము గలదు. మనము వివశులము. ఐనను ఈ యదృష్టము నకు మూల నిమిత్తము క్రియమాణ కర్మలే యని తెలియవలెను.

వాస్తవమున క్రియమాణ కర్మలే కర్మ లనబడును. ఏలన వీనియందే కర్తకు స్వేచ్ఛయుండును. క్రియమాణము సంచితము లోనికి మారుటతోడనే అది కర్మయొక్క వాస్తవిక పరిభాషకు దూరమగును. అప్పుడు దానిని కర్మల చిఠా లనవచ్చును గాని కర్మ యని కాదు. ప్రారబ్ధము కర్మ కాదు. అది ఫలము. అనగా కర్మలు పరిపక్వమై ఫలరూపమును ధరించినవి. మరి వానిని కర్మలని ఎందు కందుమో తెలియునా? ఫలముయొక్క మూలకారణము మన దృష్టి నుండి దూరమై

పోయి మన సుఖదుఃఖములకు మన కర్మలతో నెట్టి సంబంధము లేదని తలంతుమేమో అనియే.

ప్రశ్న:- మా పూర్వజన్మ కర్మల ఫలమును ఈ జన్మలో పొందుచున్నా మనియు ఈ జన్మలోని కర్మలకు ముందు జన్మలో ఫలము పొందగల మనియు అనుచుండగ వినుచున్నాము గదా!

సమా:- మీరు విన్నది కొంతవరకు సరిగనే యున్నది. కాని అందు సగము నిజము, సగము నిరాధారమైన కల్పన మాత్రమే. ఈ జన్మలో సుఖ దుఃఖముల రూపమున లభించుచున్న ఫల మంతయు ఈ జన్మలోని కర్మలకు సంబంధించినది కాదు అనునంతవరకే సత్యము. ఇందు చాలా వరకు పూర్వజన్మ లేక అనేక జన్మల కర్మల ఫలము గూడ కలదు. ఈ జన్మలో మనము చేయుకర్మ లన్నియు ఈ జన్మలోనే ఫలించజాలవు. ముందు జన్మలకొరకు సంచిత మగును.

'ఈజన్మలో చేసిన కర్మలలో దేనికిని ఫలము ఈ జన్మలో లభింపదు. సమస్త కర్మల సమూహము భవిష్యత్తులో ఫలవంత మగుటకు ప్రోగైయుండు" ననునది మాత్రము నిరాధారమైన కల్పనయే.

మనము అదృష్టవాదుల మైపోవుట ఈ నిరాధారమైన కల్పన యొక్క దుష్పరిణామమే. ఈ జన్మలో లభింపవలసి యున్న సుఖదుఃఖములపై ఈ జన్మలో చేయుకర్మలు ఎట్టి ప్రభావమును చూప వని మనము భావించుచున్నాము. రెండవ జన్మ ఎప్పుడో సుదూర భవిష్యత్తులో గదా లభించునది! కావున దాని భయము గూడ తక్కు వగును. తల్లిదండ్రులు తన స్వల్పమైన దుష్కార్యమునకు గూడ వెంటనే శిక్షింతు రని బాలునకు తెలిసినచో అతడు భయము కలిగి ప్రవర్తించును. వెంటనే యొసగబడు స్వల్పమైన దండన కున్నంత భయము ఆలస్యముగ నొసగబడునట్టి కఠినశిక్ష కుండదు. ఒక పనికి ఆనాడే ఫలరూపమున లభించు రూ.౫౦/-ల కున్నంత ఆకర్షణ అదే పనికి ౪0 సం.ల పిదప లభించునట్టి రూ.౫౦,౦౦౦/-ల కుండదు.

ప్రశ్న:- కొందరు భోగ (అదృష్ట)వాదులు ఫలముగోరి చేయునట్టివి కర్మలు గాక అవి భోగములేయని యందురు. ఉదాహరణకు నేను ఉద్యోగము చేసితిని. ఇది కర్మ. దానికి పందరూపాయల వేతనము లభించెను. ఇది ఫలము. బజారుకు వెళ్ళి వాటితో

భోజన పదార్థములను, వస్త్రములను కొంటిని. ఇది కర్మ కాదు ఫలము - అనగా భోగ పరంపరలోని ఒక అంశము మాత్రమే. ఇదే విధముగ మనము స్వార్థము కొరకు చేయు కర్మలన్నియు భోగమునకు అంతర్గతములే యగును. స్వార్థము కొరకు గాక పరార్థము కొరకు కర్తవ్యమని భావించి చేయునట్టివే కర్మ లనబడును.

సమా:- ఇది క్లిష్ట కల్పనయే. యథార్థ విషయము గాదు. పరోపకారము కొరకే, అదియు కర్తవ్యమని భావించి చేయబడు కర్మలే కర్మలని యెంచి తద్భిన్నములైనవానిని కర్మసమూహమునుండి తొలగించినచో అశుభ కర్మ లనునవే యుండవు. కర్మ మరియు ఫలము - ఈ రెండే మిగులును. మనము అశుభ కర్మ లనుకొనున వన్నియు భోగ పరంపర లోని యంశమై పోవును. ఒక దొంగ తాను పరార్థము కొరకో, కర్తవ్యమనుకొనియో దొంగతనము చేయలేదనియు తనకు గల భోగ తృష్ణను తీర్చుకొనుటకే దొంగతనము చేసితి నని వాదించును. దీనివలన ఆచార శాస్త్రమంతయు బూటక మగును.

వాస్తవ మేమన ఏ కర్మలను మనము స్వేచ్ఛగా చేయగల్గుదుమో, వేనిని చేయుటకును, చేయకపోవుటకును, విపరీతముగ చేయుట కును మనకు స్వేచ్ఛ గలదో అవన్నియు, చిన్న వైనను పెద్ద వైనను, కర్మకోటిలోనే చేరును. ఏక్రియలను మనము పూర్ణవివశులమై చేయుదుమో, ఏ క్రియలు జరుగుటయందు మనకు కించిన్మాత్రమైనను అధికార ముండదో అట్టివి ఫలమునకు నిమిత్త ములు మాత్రమే కాగలుగును. ఏలన వానిని మనము చేయము, ఎవరో చేయింతురు. ఉదాహరణకు - మనకొకవ్యక్తి నీరు త్రాగించుననుకొనుడు. మనము త్రాగుదుము. త్రాగుటకును త్రాగకుండుటకును మన కధికారము, స్వేచ్ఛ గలదు. కావున నీరు త్రాగుట కర్మ యగును. కాని మనము మూర్ఛితులమై యుండ ఒక చికిత్సకుడు యంత్ర సహాయమున మన నోరు తెరిపించి నీరు పోసినచో అది భోగమునకు నిమిత్తము మాత్రము కాగలదు. ఆ క్రియ అన్యులదే యగును. కాని మనది కాదు. ఏలన మనము దానిని చేయలేదు. ఆ క్రియలోని యే యంశముపైనను మన కధికారము లేకుండెను.

ప్రశ్న :- మనము స్వేచ్ఛతో నేపనియు చేయము. పరిస్థితులే చేయించును. మనము పరిస్థితులకు బానిసలము. మన వశమందు స్వల్ప విషయము గూడ లేదు. నామమాత్రమునకే స్వేచ్ఛ. ఈశ్వరేచ్ఛకు విరుద్ధముగ ఆకైనను కదలదు గదా!

సమా:- మన కోరిక గూడ పరవశత కాధీనమై యున్నదా ?

ప్రశ్న:- ఔను, ఇరువురు వ్యక్తులు రెండు విధములైన కోరికలు కోరుదురు. ఒకడు దొంగతనము చేయగోరును. రెండవవాడు ధనమును రక్షించుకొనగోరును. దొంగ మరొక విధముగ వ్యవహరింపలే డని అతని జీవన పరిస్థితులు తెలుపుచున్నవి. ధనపతి గూడ పరిస్థితుల కారణముననే ధన రక్షణను కోరును. సృష్టినియమము నిత్యమైనది. దాని నెవరు నుల్లంఘించలేరు. కావున స్వేచ్ఛాదుందుభిని మ్రోగించుట వ్యర్థము. స్వేచ్ఛయే లేనప్పుడు కర్మ యెక్కడిది? ఫల మెక్కడిది? కర్తవ్య మేమి? అకర్తవ్య మేమి? శుభ మేమి? అశుభ మేమి?

సమా:- స్వాతంత్ర్యేచ్ఛ గూడ పరిస్థితుల కారణముననే కలుగునా? స్వాతంత్ర్య మొక వస్తువే కానిచో స్వాతంత్ర్యేచ్ఛ ఉత్పన్న మెందు కగును? ఇతరుల కర్మల గురించి వారు పొరపాటు చేసి రనియు, అట్లు చేయక ఇట్లు చేయవలసి యుండె ననియు మన మెందు కందుము? మన కర్మల గురించి పశ్చాత్తాపము కలిగి కొండొక కర్మ చేయకుండిన బాగుండెడి దని ఎందు కనుకొందుము?

ఈశ్వరాజ్ఞ లేనిదే ఆకుగూడ కదలకపోవచ్చును. కాని అసత్యము చెప్పుటకు మనము నాలుకకు గతిని కల్పించుట ఈశ్వరాజ్ఞ వలన గాక మన స్వాతంత్ర్యమువలననే గదా! కావున అసత్యము పలికి మనము స్వయముగనే అశుభకర్మ చేసినట్లు భావింతుము. ఇతరులు గూడ మన విషయమున నిట్టి భావమునే కలిగియుందురు. అందువలన పరిస్థితికి సంబంధించిన సిద్ధాంతము పరిమితమైనదే కాని అపరిమిత మైనది కాదని స్పష్టమగు చున్నది. ఆత్మతత్త్వము పరిస్థితి కన్న మిన్న యైనది. మన పరతంత్రత కొంతవరకు మాత్రమే పరిమితమై యున్నది, కాని సర్వాంశమున కాదు. మన కిష్టమైన పనిని, అనుకొన్నప్పుడు, ఇష్టము వచ్చిన రీతిలో చేయజాల మనుట సరియైనదే. కన్నులతో వినలేము. చెవులతో గూడ ఒక్కొక్కప్పుడు కోరుకొన్నంతగ వినలేము. మనకు ప్రియమైన దానినే వినదలుతుము. ఈ విషయమున మనము పరిస్థితులకు బద్ధులము. కాని పరిస్థితి గూడ పరిమితమైనదే గదా! అందు మనము పరివర్తనము చేయగలుగుదుము. దూరమున నున్న వస్తువును చూచుటకు ఉపనేత్రమును లేక అన్యయంత్రమును నిర్మింపగల్గుదుము. భీషణ దృశ్యములను చూడకుండుటకు కన్నులను మూసికొనగల్గుదుము. మనము సదా పరిస్థితుల నధిగమించగోరుదుము. ఇది

మన సహజ ప్రవృత్తి. కారాగారము నందలి బందీ పారిపోవు అవకాశముకొరకు చూచుచుండును. పరిస్థితులే సమస్తమైనచో ఇట్టి పరిస్థితి ఎప్పుడును ఉండెడిది కాదు. ఈ ప్రవృత్తియే మన పురుషార్థమునకు మూలము. కాళ్ళు చేతులాడించుచున్నచో ఎప్పుడైనను మనము బంధమునుండి విడిపోవచ్చు ననియే మన విశ్వాసము. దీనిపేరే ఆశ. మనుష్యుడు సర్వస్వమును కోల్పోయిన పరిస్థితి యందును ఆశ జీవించియే యుండును. ఆశ యన నేమి? అది తన పురుషార్థముపై గల విశ్వాసమే.

ప్రశ్న:- విజ్ఞానము (సైన్సు) వల్ల సృష్టినియమములన్నియు నిత్యము లని తెలియుచున్నది. వాని నెవరును భంగ మొనర్పలేరు. ఒక త్రిభుజ మందలి మూడు కోణముల మొత్తము ఎల్లప్పుడు ౧౮౦ డిగ్రీలే యగును. ఉదజని (హైడ్రోజన్) రెండుఅణువులు, ప్రాణవాయువు ఒకఅణువు కలిసినపుడెల్ల జల మేర్పడును. ఇటువంటి నియమము లెన్నియో కలవు. వాటి నెవరును మార్చలేరు. జడ జగత్తు నియమముల వలెనే చేతన జగత్తు అనగా జీవశాస్త్ర, మనోవిజ్ఞాన శాస్త్రముల నియమములు గూడ నిత్యములే. వీనినే పరిస్థితు లందురు. అట్టిచో కర్మచేయుటలో స్వాతంత్ర్య మెక్కడిది? పరిస్థితి ననుసరించియే మన ఆలోచనలును, మాటలును, కర్మలును ఉండును. ఇట్లు చూడగా దేనిని మనము స్వాతంత్ర్య మందుమో అది గూడ పరతంత్రత యే. దేనిని మనము చేతన మనుచున్నామో అదిగూడ జడము యొక్క ఒక పరివర్తిత రూపమే యగుచున్నది. ఇట్లు కర్మసిద్ధాంతము విజ్ఞానమునకు పూర్తిగ విరుద్ధమైనది. ప్రాకృతిక నియమములు నిశ్చితములైనను పరివర్తనశీలము లైనను అవి విజ్ఞానమునకు విరుద్ధములే. ఏలన ప్రాకృతిక నియమములు పరివర్తనశీలము లని యంగీకరించినచో అవి నియమములే కాజాలవు. అట్టి యెడ ఈ కర్మ కిది ఫలమని నిశ్చితముగ చెప్పజాలము.

సమా:- ప్రాకృతిక నియమములు నిత్యము ల[illegible] సత్యమే. చేతన ప్రాణుల శరీరము ద్వారా జరుగు క్రియలలో అనేకము ఆ ప్రాణుల స్వాధీనమున లేవనుటయు నిజమే. అవి తప్పక జరిగి తీరవలసినవే. కాని చేతన ప్రాణులకు ఆ పదార్థములతో పని గైకొనుటలో ఎట్టి స్వాతంత్ర్య మైనను లేదని యనుట సరి కాదు.

నీటిని సిద్ధము చేయుటకు హైడ్రోజన్, ఆక్సిజన్‌ల నిష్పత్తి నిశ్చితమై యున్న

దనుట నిజమే. కాని అదే నిష్పత్తితో ఎంత నీటిని సిద్ధపరచవలసిన దనునది మన స్వాధీనమందున్న విషయమే గదా! ప్రాకృత్రిక నియమముల ధార ఒక నియమము ననుసరించియే ప్రవహించును. ఆ నియమములపై నాధారపడియే మన మా ప్రవాహపు దిశను గూడ మార్చగల్గుదుము. అనాగరిక దేశమందలి నదులు ఒకే దిశకు ప్రవహించును. నాగరికములు, సుశిక్షితములునైన జాతులు తమ స్వతంత్ర బుద్ధి నుపయోగించి వాటి దిశలను మార్చి కాలువలు నిర్మించును. ప్రాణికోటి తమ క్షేత్రమునం దెంతటి పరివర్తన మొనరించినదో దానిని మనము గమనించకుండ ఉండలేము. అట్లు గాకున్న నాగరికత, అనాగరికతల మధ్య భేదమే యుండదు. ప్రపంచమంతటను త్రిభుజ లక్షణము లొకే విధముగ నున్నవి. కాని ప్రాణులన్నింటి స్థితి మాత్ర మొకే విధముగ లేదు. నిర్వచించు యోగ్యతయే బుద్ధి అది మనో విజ్ఞానాధ్యయనమున కొక విశిష్టమైన అంగము. దాని నియమములు భౌతిక,రసాయనిక శాస్త్ర నియమముల కన్న భిన్నములైనవి. మీరు, నేను ఒకే విధముగ నాలోచింపము. ఏ పరిస్థితినైనను ఒకే విధముగ ప్రయోగింపము.

మనము చర్చించు విషయముపై భిన్నాభిప్రాయము లుండును. అట్లెందు కుండును? ప్రాణులకు ఆలోచించెడి స్వాతంత్ర్యము లేకున్నచో ఈ భిన్నత్వము గూడ లేకుండవలసినది.

విజ్ఞానము (సైన్సు)ను వెన్నంటివచ్చు కళ (ఆర్ట్) గూడ కలదుగదా! ఈ కళ మానవవర్గ లేక ప్రాణివర్గ ప్రసాదితమే. కావున కర్మ, అకర్మ, వికర్మల సమస్య ఎల్లప్పుడుండునదే.

ప్రశ్న:- కర్మగూడ ఒక విధమైన గతియే కదా?

సమా:- మీరు సరిగనే నుడివితిరి. ఇది గతియే కాని "ఒక విధమైనట్టిది" దీని కర్తచేతనుడు. ప్రతి గతియు కర్మ గాదు. నేను కలముతో వ్రాయుట గతియగును. కాని కలముయొక్క ప్రతి గతియు లేఖన కళ యనిపించుకొనదు. లేఖన మనునది చేతనము చేయు కర్మ. చేతన కర్త యొక్క బాధ్యతయే కర్మఫల సిద్ధాంతమును ప్రతిపాదించును. విజ్ఞానము నాకళింపు చేసికొని తదనుకూలముగ కళల నావిష్కరించు టంతయు చేతనుని పనియే.

ప్రశ్న:- జడ చేతన జాతులు రెండును శాశ్వతమైనట్టి ప్రాకృతిక నిశ్చిత నియమముల ఆధీనమం దున్నవి. అందు మార్పు కాజాలదు.

సమా:- మార్పు కాగలుగును. అట్లు కాకున్న జడచేతనముల మధ్య భేధమే యుండదు. పైగా ప్రాకృతిక నియమము లన్నియు నిరర్థకములై పోవును. వాస్తవ మేమన సమస్త జడజగత్తు చేతన జగత్తు కొరకు ఉద్దేశింపబడినదే కాని చేతన జగత్తు జడము కొరకెంత మాత్రము కాదు. విందు అతిథి కొరకే. అతిథి విందుకొరకుగాదు. చేతనమునకు ప్రయోజనము గలదు. జడమునకు స్వప్రయోజన మేదియును లేదు. నేను గృహమున నివసింతును. గృహము నాకొరకు. నేను గృహము కొరకు గాదు. చేతనమనునది ప్రయోజనముతో గూడిన ఒక సత్తా. జడమేమో ప్రయోజనరహిత సత్తా. ప్రాకృతిక నియమముల సిద్ధాంత మేమన - అవి చేతన సత్తాలకు సంపూర్ణ ఉదార భావముతో సహకరించును. అవి చేతన సత్తాల స్వాతంత్ర్యములో ఎంతమాత్రము ఆటంకము కలిగింపవు. (Nature is most liberally helpful but most studiously uninterfering.) ఈ నియమము సమస్త సృష్టియం దోతప్రోతమై యున్నది. ఇది కర్మ సిద్ధాంతమున కాధార భూతమైనది. సమస్త ప్రపంచమందలి పౌరశాస్త్ర పోషకులును, నీతి - ధర్మశాస్త్రముల ప్రవర్తకులును ఏదో ఒక రూపమున ఈ మూల నియమము నంగీకరింతురు.

పశుపక్షులు భోగయోనులు

ప్రశ్న:- మీరు పశుయోనులకు గూడ కర్మస్వాతంత్ర్యము నాపాదించుచున్నారు. పశుపక్షులు భోగయోనులే కాని కర్మయోనులు కావనియే మేము వినియుంటిమి.

సమా:- మీరు సరిగనే వింటిరి. కాని గ్రహించుటలోనే భేదము గలదు. జీవునికి కర్తృత్వ మనునది స్వాభావికమైన గుణము. అతడు దానినుండి వైదొలగలేడు. ఎచట కర్తృత్వము గలదో అచట కర్మ స్వాతంత్ర్యము నుండును. పశువులు గూడ పొరపాటు చేయును. అందుకు శిక్షగూడ పొందును. శిక్షను పొంది అవి జాగ్రత్తపడును గూడ. పొరపాటు చేయుట, శిక్షను పొందుట, శిక్షను పొంది జాగ్రత్తపడుట - ఈ మూడును పశుపక్షులందు గోచరించును. ఇవి వాని కర్తృత్వ స్వాతంత్ర్యమునకు ప్రమాణములు. ఒకటే భేదము. అదేమన-సామాజిక విషయములకు సంబంధించినంత వరకు పశుపక్షులలో కర్తవ్యభావము లోపించి యున్నది. ఏలన సామాజిక కర్తవ్యముల నర్థము చేసికొనునంతగా వాని

బుద్ధివికాసము కాలేదు. ఈ విషయము మానవ శిశువులకును వర్తించును. శిశువులు మనుష్య యోనులే యైనను ఎన్నియో విషయములందు వారికి బాధ్యత యుండదు. గాడిద పొరపాటు చేసినచో దండన పొందును. శిశువు గూడ పొరపాటు చేసినపుడు శిక్ష పొందును. గాడిద శిక్షను పొంది తనను సంస్కరించు కొనును. అట్లే బాలుడును శిక్షను పొంది తనను సంస్కరించుకొనును. కాని ఏ సీమను దాటిన సామాజిక, నాగరిక, ధార్మిక కర్తవ్యములు, బాధ్యతలు మొదలగునో అది పశువులందును బాలలందును ఉండదు. ఇట్లనుటవలన సర్వథా కర్తవ్యాభావ ముండు నని కాదు. కర్తవ్య హద్దులందు మాత్రమే భేదముండును. కావున పారిభాషి కార్థమునందు పశుపక్షులు భోగయోనులే కాని కర్మయోనులు కావని యందురు. ఎచట చేయుట, చేయకపోవుట, విపరీతముగ చేయుట అనెడు మూడు మార్గములలో నొకదాని చిహ్నములు కాన్పించునో అచట జీవత్వము, బాధ్యత ఉండును. కావున కర్తవ్యము నంగీకరింపవలెను. కర్తవ్యము సాపేక్షిక వస్తువు. అది జీవుని బుద్ధివికాసము నాశ్రయించి యుండును. కర్తవ్యపాలనము భావి వికాసమునకు సాధనమగును. ఇట్లు కర్మఫల క్రమము నిరంతరము సాగుచుండును. ఇది ఉన్నతికి మెట్లవంటిది. ప్రతి మెట్టుపైన కాలిడినచో పైకెక్కుట సుగమ మగును. ఇదే విధముగ ప్రతి కర్మవలన జ్ఞానవృద్ధి యగును. ఆ జ్ఞానవృద్ధివలన కర్తవ్య పరిధి విశాలమగును.

ప్రశ్న:- మనుష్యులే చేతనులా లేక అన్యప్రాణులు గూడానా ?

సమా:- అన్య ప్రాణులును చేతనులే. కుక్కలు, పిల్లులు, కీటకములు, పక్షులు మున్నగున వన్నియు చేతనములే. చేయుట, చేయకపోవుట, విపరీతముగ చేయుటలో ఇవి సమర్థములై యున్నవి. వీనికి స్వాతంత్ర్యము కలదు.

ప్రశ్న:- మనుష్యులు కర్మయోను లనియు అన్యప్రాణులు భోగయోనులే యనియు మేము వినుచున్నాము. ఇదెంత వరకు సరియైనది ?

సమా:- మన సామాజిక నియమములకు సంబంధించినంత వరకు ఇది సరియైనదే. ఈ నియమముల ప్రకారము నవజాత మానవ శిశువులు, అల్పవయస్క బాలలును కర్మయోనులందు చేరరు. ఒక శిశువు పెద్దమనిషి దుస్తులపై మూత్రము విసర్జించినను, అతని గడ్డము, మీసములు పట్టి లాగినను ఆ శిశువును అపరాధి యని కాని దండింపదగినవా డని కాని ఎవరును అనుకొనరు. ఏలన ఆ శిశువు బుద్ధి ఇంకను వికసింపలేదు. ఐనను మీరు అతనిది భోగయోనియని అనగలరా?

ఒకవేళ అట్లే భావించినచో మనుష్యులందును కర్మయోనులు భోగయోనులనెడి భేదమును స్థాపించవలసివచ్చును. పిచ్చిమనుజులందరును భోగయోనులనబడుదురు. వాస్తవముగ బద్ధావస్థయందున్న ఏ జీవుడైనను మనుష్యుడైనను క్షుద్రయోనిని పొందినవాడైనను - భోగ భోకతృత్వ యోనులనుండి వేరు కాజాలడు. కర్తృత్వ భోక్తృత్వములు రెండును జీవుని స్వాభావిక గుణములు. వీని యావిర్భావ తిరోభావములందు సాపేక్షక న్యూనాధిక్యత లుండవచ్చును. కాని ఇవి పూర్తిగా లోపింపవు. కుక్కలు, పిల్లులు, కోతులు కేవలము భోగయోనులే యై కర్మయోనులు కానిచో అవి తమ కర్మలకు బాధ్యత వహింప జాలవు. అట్టిచో అవి పనిని చెడగొట్టినపుడు మీరు వాని నెందుకు శిక్షింతురు? అవి దెబ్బలకు భయపడి తమ ప్రవర్తనలో మార్పు నెందుకు కనబరచుచున్నవి? కోతి కర్మయోని కాకున్న దాని నాడింపజాలము. కుక్క కర్మయోని కానిచో కాపలా కాయు పని చేయజాలదు. కర్మయోని కాదేని గుఱ్ఱము స్వామి భక్తి కలిగియుండదు. క్షుద్రాతి క్షుద్రమైన జంతువుల స్థితియు నిట్టిదే.

వీనిని భోగయోను లనుటకు కారణము నాగరిక మానవ సమాజమున కేవలము మనుష్యుడే, అదియును వికసిత బుద్ధి గల మనుష్యుడే కర్మయోనిలో లెక్కింపబడుట. ఇది చట్టమునకు సంబంధించిన పరిభాష, దార్శనిక పరిభాష కాదు. చట్టమునందు పిచ్చివాడు, ఈడురానివాడు, మానసిక రోగి, బుది వికసించనివాడు - వీరందరును కర్మయొక్క బాధ్యతనుండి ముక్తులొనర్పబడినారు. సంపూర్ణముగ కాదు సుమా! కేవలము చట్టముయొక్క పరిధిలోనే. మీ మూడు సంవత్సరముల బాలుని దొంగతనము చేసినందుకు మీరు దండింప వచ్చును. ఆ దండనతో అతడు చక్కబడవచ్చును. కాని న్యాయాలయమున ఆ నేరమున కతనికి కారాగారశిక్ష గాని అపరాధము గాని విధింపబడదు. బండిని లాగునట్టి ఒంటి గుఱ్ఱపు స్థితియు నిట్టిదే. అతిక్షుద్ర జీవులు న్యాయాలయ పరిధిలోనికి రావు. వానిపై న్యాయాలయముల కెట్టి అధికారము లేదు. కావున వానికొరకు దండన శాస్త్ర మేదియు లేదు. కర్మయొక్క బాధ్యతను వహించు బుద్ధి వికాసపు (యుక్త వయస్కుడగు) వయస్సులోను భేదము గలదు. ౧౮ సం.ల బాలుడు నేరశాస్త్రము ననుసరించి యుక్తవయస్కుడే. కాని ఆర్థిక శాస్త్ర రీత్యా యుక్తవయస్కుడు కాడు. అతడు దొంగతనము చేసినచో శిక్షార్హు డగును. కాని

తన సంపద నమ్ముకొనినచో అది అసంగతమని భావింపబడును. స్మృతికారులు కర్మ, భోగ యోనుల వివేచన చేయుట మానవ సమాజశాసనముకొరకే యని దీని వలన స్పష్టమగుచున్నది. ఇది కర్మఫల సంబంధమైన దార్శనిక సిద్ధాంతమునకు వర్తింపదు. చట్ట సంబంధమైన బాధ్యత వహించు (యుక్త వయస్కుడగు) వయస్సు గూడ వివిధ జాతులందును, దేశములందును వేర్వేరుగా నున్నది. భారతదేశపు హిందూ చట్టమున వివాహ విషయమున స్త్రీ పురుషు లెప్పుడు కర్మయోనియందు ప్రవేశింతురో నిర్వచించు టొక చిక్కు సమస్యయే. బాల్యమున వివాహము చేయబడినవారు పశువుల వలె భోగయోనులందే పరిగణింప బడుదురు. వారికి "కర్తుం, అకర్తుం, అన్యథాకర్తుం" అనువానియందెంతమాత్రము నధికారము లేదు. కొండొక చోట బాలబాలికల నమ్ముకొనవచ్చును. కావున ఈ విషయమున సమాజ శాస్త్ర, దర్శనశాస్త్రముల క్షేత్రమున వివేకముతో వ్యవహరింపవలసి యుండును. వ్యక్తుల వ్యవహారముల నెన్నింటినో సమాజము తన అధికార పరిధికి బాహ్యమని భావించి వాని జోలికిపోదు. ఏలన వ్యక్తి ఆ విషయమున సమాజము నెడ బాధ్యుడు కాడనియే దాని భావము. ఐనను అతడు ఈశ్వరునెడ. సృష్టి క్రమమునెడ బాధ్యుడే యగును.

మనుష్యుడు పశుపక్ష్యాది యోనులను పొందవచ్చును

ప్రశ్న:- మనుష్యుడు చనిపోయి పశుపక్షి మున్నగు యోనులందు జన్మించగలడా?

సమా:- అతడు చేసిన కర్మలు అందు కనుకూలములే యైనచో పశుపక్ష్యాది యోనులందు తప్పక జన్మించగలడు.

ప్రశ్న:- ఇది మోక్ష సాధకము కాదు గదా! మనుష్యుని ఉత్కృష్టమైన యోని నుండి నీచయోనులందు పడవేయుట మోక్షమార్గము నాటంక పరచినట్లే యగును గదా!

సమా:- అట్లనుకొనుట సరిగాదు. మోక్షమార్గమున బాధకములగుచున్న ప్రవృత్తులను తొలగించుటకే నీచయోను లుద్దేశింపబడినవి. మానవుడు ఘోరమైన అశుభకర్మలు చేయ మొదలిడి మోక్షమార్గము నుండి వైదొలగి నప్పుడు ఆ ప్రవృత్తి నుండి అతనిని దూరమొనర్చుటకే అతని స్వాతంత్ర్యక్షేత్రము సంకుచిత

మొనర్పబడును. దీనివలన అశుభకర్మలొనర్చు అతని ప్రవృత్తి విస్మృతము లేక క్షీణము కాగలదు. క్రూర ప్రవృత్తి గల మనుజునకును క్రూరమైన సింహమునకును గల భేదమును గమనింపుడు. మనుష్యునందు హింసాప్రవృత్తి వృద్ధియైనపు డత డనేకోపాయములతో దూరదూరమున నున్న ప్రాణుల చంపును. పక్షులను తుపాకితో కాల్చి చంపును. సముద్రమందలి చేపలను, మొసళ్ళను చంపుటకై గొప్ప యంత్రముల నావిష్కరించును. చంపిన వాటి మాంసమును తన ఆహారముగా నుపయోగించుటే గాక వందల కొలది మైళ్ళ దూరమున నున్న సోదరమానవుల కందజేయును. ఆ మాంసము నెన్నియో మాసముల వరకు సురక్షితముగ నుంచు ఉపాయ మాలోచించును. తన శత్రువులకు హాని కలిగించుటకు 'బాంబు' వంటి విచిత్ర మారణాయుధములనెన్నింటినో ఆవిష్క రించును. మనుజు డెంత క్రూరమైన ప్రాణి! ఈ హింసా ప్రవృత్తిని దూరము చేయుట కాతనికి సింహపు యోని లభింప జేసినచో అతని హింసా ప్రవృత్తి క్షేత్రమెంతయో సంకుచితమై పోవును. అతడు హత్యచేయును. కాని అది తన ఆహారము కొరకే, అదియును ఆ దినపు ఆహారము కొరకే. అతడు ౨౪ గంటలు హింసా ప్రవృత్తి వలయమున దగుల్కొని యుండడు. కావున నీచయోనులు గూడ చెడు ప్రవృత్తుల ప్రభావమును తగ్గించు సాధనము లగుచున్నవి. ఈ ప్రవృత్తులు క్షీణించి నప్పు డతడు మళ్ళీ మనుష్య యోనిని పొందును. అతని మోక్షమార్గము తెలిచికొనును. అతడు మోక్షాభిముఖు డగును. ఆ సమయమున అతడు కర్మ సిద్ధాంత జ్ఞానమును పొంది జ్ఞాన, కర్మ, ఉపాసనా కాండములందు సంతులతను సాధించినచో అతడు శ్రేష్ఠుడు కాగలుగును.

ప్రశ్న :- ఆర్యసమాజ సిద్ధాంతము ప్రకారము జీవేశ్వర ప్రకృతులు అనాదులు. సృష్టి ప్రవాహము చేత అనాది. సృష్టి నిర్మాణమునందు ఈశ్వరుని ఉద్దేశ్యము జీవులకు పునర్జన్మద్వారా కర్మఫల మనుభవింప జేసి ఆధ్యాత్మికోన్నతికి అవకాశము కల్పించుటయే. సాంఖ్య మతానుసారము ౧౪ విధములైన ప్రాణి సృష్టి గలదు. ఒకటి మనుష్యయోని, దాని కన్న నీచమైన ఐదు తిర్యక్ యోనులు, మనుష్యుని కన్న ఉన్నతమైన ఎనిమిది దివ్య యోనులు. తిర్యక్ యోనులివి - (౧) ఉద్భిజములు (౨) స్వేదజములు (3) అండజములు - ఖేచరములు (౪) అండజములు - జలచరములు (౫) జరాయుజములు. వీటన్నిటి యందు వికాసము ద్వారా జీవుడు ఉన్నతిని సాధించును. (౧) పితృ (౨) గాంధర్వ (3) దైవ (౪) ఇంద్ర (౫) ప్రాజాపత్య (౬) బ్రాహ్మ (౭) విదేహ

(౮) ప్రకృతిలయ అనునవే ౮ దివ్య యోనులు. జీవునకు మానవ యోనియందెంత ఆనందము లభించునో అంతకన్న వందల కోట్ల రెట్లధికానందము ఈ యోనులందు లభించును. ఈ వ్యవస్థ తైత్తిరీయోపనిషత్తులోని ఆనందవల్లియందు తెలుపబడినది. కొందరు విద్వాంసులు వీనిని మనుష్య యోనుల విశేషావస్థ లనియే భావింతురు. కాని ఆనందమీమాంసలో గల వీని వర్ణనను బట్టి ఇవి మనుష్యుని కన్న భిన్నమైనట్టి, ఉచ్చతరమైనట్టి జీవుని అవస్థ లని యంగీకరించుటే అధిక యుక్తిసంగత మని తోచును. పురాణములం దివి స్వర్గావస్థలుగనే విశ్వసింపబడినవి. ఈ యోనులందు జీవుడు నియమిత సమయము వర కుండి తన కర్మల ననుసరించి తిరిగి మనుష్య యోనియందు ప్రవేశించు ననియు కలదు. మోక్షసాధనము మనుష్యయోనియందే వీలగును. ఈ విషయమే భగవద్గీతలో చెప్పబడినది.

"ఆబ్రహ్మభువనాల్లోకాః పునరావర్తినో ఽ ర్జున ।

మాముపేత్య తు కౌంతేయ పునర్జన్మ న విద్యతే॥' ౮ - ౧౬॥

"ఓ యర్జునా! బ్రహ్మలోక పర్యంతముగల ఈ లోకము లన్నిటినుండి జీవుడు తిరిగివచ్చును. కాని నన్ను (గీతా పరిభాషలో బ్రహ్మను) పొందినవానికి మళ్ళీ జన్మ ఉండదు." ఈ దివ్యలోకముల వర్ణన తైత్తిరీయోపనిషత్తులో ౮ వ అనువాకమునను, బృహదారణ్య కోపనిషత్తులో ४వ అధ్యాయమునను కలదు. ఈ విషయము శతపథబ్రాహ్మణమందును గలదు. బృహదారణ్యకములో ४ వ అధ్యాయము ४ వ బ్రాహ్మణము.

"తత్ తథాపేశస్కారీ పేశసో మాత్రామాదాయాన్యన్నవతరం కల్యాణతరం రూపం తనుతే, ఏవమేవాయమాత్మేదం శరీరం నిహత్య అవిద్యాం గమయిత్వాఽన్యన్నవతరం కల్యాణతరం రూపం కురుతే, పిత్ర్యం వా, గంధర్వం వా, దైవం వా, ప్రాజాపత్యం వా, బ్రాహ్మం వా అన్యేషాం వా భూతానామ్"

"స్వర్ణకారుడు పాతస్వర్ణములో క్రొత్తవియుకల్యాణకారకములు నగు రూపములను సిద్ధము చేయు విధమున ఆత్మ యీ శరీరమును వీడి అవిద్య నధిగమించి నవీన తరమును కల్యాణతరమును నైన అన్యరూపమును ధరించును. ఈ నవీనతర రూపధారణ పిత్రులోకము, గంధర్వలోకము, ప్రజాపతిలోకము, బ్రహ్మలోకము లేదా

అన్యభూతములు - వీనిలో దేనియందైనను చేయవచ్చును."

దీనివలన ఉపనిషత్తు దిగువభావమును ప్రకటించుచున్నదని తెలియుచున్నది - పునర్జన్మ యందు జీవుడు సాధారణముగ క్రొత్త శరీరమును ధరించినను అది పూర్వ శరీరముకన్న శ్రేష్ఠతరమై యుండును. 'కళ్యాణతర' శబ్దమున కర్థ మిదియే. ఈ వచనము సామాన్యముగ ఇదే భావము ప్రకటించునని తలపబడుచున్నది. ఈ యర్థము సరియైనదే. శ్రీ అరవిందుడు గూడ సృష్టియొక్క ఉద్దేశము జీవుని ఆధ్యాత్మికోన్నతి యనియే విశ్వసించినాడు. థియోసోఫికల్ సొసైటి యొక్క సిద్ధాంతము గూడ ఇదియే.

సమా:- "జీవుని ఆధ్యాత్మికోన్నతియే సృష్టియొక్క ఉద్దేశము" అను విషయమున మాత్రము వైదిక సిద్ధాంతము శ్రీ అరవింద, థియోసోఫికల్ సొసైటీలతో నేకీభవించును. కాని వారు ప్రవచించిన జీవుని లక్షణములతో నేకీభవించదు. వారు జీవుడు అనాది, అనంతుడు అని యంగీకరింపరు. కావున వారి ఆధ్యాత్మికోన్నతి గూడ భిన్నమైనది కావచ్చును. డార్విన్ అనుయాయులైన ఆధునిక వికాసవాదులు చేతన జీవుని అస్తిత్వము నంగీకరింపరు. కాని జడజగత్తునందు వికాసము నంగీకరించి ఆ జడజగత్తు యొక్క వికసిత రూపములనే చేతను లనియు నమ్మెదురు. వారి దృష్టిలో ఆధ్యాత్మికోన్నతి అనునది నిరర్థక విషయమే. ఇంకను విశ్లేషించి చూడ శ్రీ అరవిందుల భావములు థియోసాఫీ వారి భావములు ఇంచుమించు నిట్టివే యని తేలును.

౧౪ రకముల యోనులు పురాణరచయితల కల్పన మాత్రమే యని తోచును. మనుష్యునికన్న నీచములైన ఐదు విధముల సృష్టి ప్రత్యక్షముగనే కాన్పించును. కాని ఉన్నతమైన ఎనిమిది దివ్య యోనులు ప్రత్యక్షములు కావు. వాటి స్థలము మరియు కార్య క్షేత్రమునకు సంబంధించిన ప్రమాణము లేవియును కానరావు. కావున వానిని మనుష్య యోనులలోనే సభ్యత యొక్క న్యూనాధిక్యతల ననుసరించి విభిన్న స్థాయి గలవిగా నెంచవలెను. ప్రపంచమున కొందరు భూత ప్రేత పిశాచాది భిన్న యోనులు గల విని నమ్మెదురు. వీనిని మనుష్యయోనులకన్న నీచములైన వనియే నమ్మవలసి యుండును. ఇవి ప్రశ్నలో పేర్కొనిన పంచయోనులలో చేరవు. "పురాణములలో ఇవి స్వర్గావస్థలుగ భావింపబడినవి. జీవుడొక నిర్ణీత కాలము వరకు ఈ యోనులం దుండి పిదప తనకర్మ ననుసరించి

తిరిగి మానవ యోనిలో ప్రవేశించును. మనుష్యుని సాధన మనుష్య యోనియందే జరుగుననునది వాస్తవమే. కాని యీ సిద్ధాంతము మాకు సరియైన దనిపించదు. స్వర్గము ఈ దివ్యయోనులుండునట్టి ఒకస్థాన విశేషమని పురాణములు విశ్వసించును. ఈ దివ్యయోనులు గూడ శుభాశుభకర్మలు చేయుచుండవచ్చును. మరి వాని ననుసరించి వాటికి మంచి, చెడు ఫలములు గూడ లభించుచునే యుండవచ్చును. వాని ననుసరించియే మరణానంతరమే అవి మనుష్య యోనులందు ప్రవేశించుచుండవచ్చును. అట్టిచో వీని దివ్యత్వ మెట్టిదో చెప్పగలరా? ఒకవేళ మనుష్య యోనియే మోక్షసాధనమై, ఈ యోనులు కానిచో వీటిని మనుష్య యోనులకన్న మంచివి, ఉన్నతమైనవి అని నమ్ము టెందులకు? ఇవి భోగయోనులే యై కర్మయోనులు కాకున్నచో లక్షల కోట్ల రెట్ల ఆనందము గూడ ఎందుకు పనికి వచ్చును? ఏలన వాని ఉద్దేశ్యము ఆధ్యాత్మికోన్నతి కాదు. ఇవి కర్మక్షేత్రములు గావు. కేవలము విహారక్షేత్రములే. అందు భోగములే కాని అపవర్గమే లేదు.

పైన వ్రాసినట్లు బృహదారణ్యకోపనిషత్తు నందు " కల్యాణ తరం రూపం తనుతే" అని కలదు. 'కల్యాణతర" తరప్ ప్రత్యయాంతమైనది. అది సాపేక్షకమైన శబ్దము. కల్యాణతరం అనునది మొదటి స్థితి కన్న అధిక కల్యాణకారకమైనదిగా నుండవలయును. అనగా 'ఆధ్యాత్మిక ఉన్నతి ' యందు అధిక సాధకమైనదని అర్థము. "దీనివలన పునర్జన్మలో జీవుడు సామాన్యముగ నూతన శరీర ధారణ మొనర్చును. కాని అది పూర్వ శరీరము కన్న శ్రేష్ఠతరమైన దగు ననియే ఉపనిషద్భావమని వ్యక్తమగుచున్నది. 'కల్యాణతర' మనెడి శబ్దమున కర్థమిదియే. ఈవాక్యము సామాన్యముగ ఈ భావమునే ప్రకటించునని భావింపబడుచున్నది." ఈ యర్థము సరియైనదే అనియు 'సామాన్యముగ' అనెడి శబ్దప్రయోగము గూడ అనవసరమనియు మేము భావింతుము. కాని "కల్యాణతరము" నకు అర్థము మేము వేరుగా గ్రహింతుము. "కల్యాణతర" మనగా ఆధ్యాత్మికోన్నతియందు అధిక సాధకము లేదా తక్కువ బాధకము. హంతకుని మానవ శరీరము ఆధ్యాత్మిక ఉన్నతిలోసింహపు శరీరముకన్న అధికబాధకమును తక్కువ సాధకమును నైనదని మేము ఇదివరకే తెలిపియుంటిమి. కావున సింహపు యోని ఆ హంతకుని మనుష్యయోని కన్న "కల్యాణతరం రూపం" అగును. ఇదేవిధముగ ఇతర సంధర్భములందును భావింపవలెను. ఒక దోపిడిగాడు స్వేచ్ఛా

చారిగ నుండుట అతని ఆధ్యాత్మికోన్నతికి కారాగారముకన్న అధికబాధకమగును. కావున అతనికి కారాగారము "కల్యాణతర" మగును. మంచివ్యక్తికిది విపరీతముగ నగును. తల్లిదండ్రులు తమ సంతానము చెడు సహవాసమున తిరుగుచుండుట గాంచి అతని రాకపోకలపై ఆంక్ష విధింతురు. ఏలన స్వేచ్ఛా స్థితి అతని ఉన్నతియందు అధికబాధక మగును, నియంత్రణము "కల్యాణతరము" నైనది. అందువలన ఉపనిషత్తులో పైవాక్యమందు "అన్యేషాం వా భూతానాం" అన్యయోనులుల్లేఖింపబడినవి.

ఈ విధముగ కర్మ సిద్ధాంతముయొక్క యథార్థజ్ఞానము మన ఆధ్యాత్మికోన్నతి ఉద్దేశమును సఫలము చేయుచున్నది.

దుర్దినము- సుదినము

ప్రశ్న:- అప్పుడప్పుడు మనకు చెడు దినములు ప్రాప్తించును. బంగారము ముట్టిన మట్టి యగును. ప్రతి పనిలోను అపజయము కలుగును. దుఃఖములపై దుఃఖములు వచ్చిపడును. ఇట్లే మంచి దినములు ప్రాప్తించినపుడు మట్టిని ముట్టిన బంగార మగును. సుఖములపై సుఖములు వచ్చి పడును. దీనిని బట్టియే జనులు "దినములు చెడుగా నున్నవి, బాగున్నవి"అని శకునములు చెప్పుకొందురు. దీనికి కర్మసిద్ధాంతముతో నెట్టి సంబంధము గలదు ?

సమా:- "దినము" కాలములో ఒక భాగము మాత్రమే. దినములు మంచివి కాని "చెడువి" కాని కావు. పూర్వ పాపకర్మలు పరిపక్వము చెందినపుడు దుఃఖమును, పుణ్యకర్మలు విపాకమైనపుడు సుఖమును లభించును. నిరంతరము దుఃఖములే గాని నిరంతరము సుఖములే గాని ఉండు ననుమాట సరిగాదు. అశుభముల పిదప శుభములు కలుగుటయు, అధిక శుభము తరువాత అశుభము కలుగుటయు మనకు గోచరించుచున్నది. ఇతిహాసము నవలోకించినచో ఒక రాజు తన శత్రువును చంపి విజయుడైన నాల్గుదినములలోనే అతని మరొక శత్రువు అతనిని ఓడించి చంపినట్లు కాననగును. సామాన్యుల జీవితములందును ఇట్టి సంఘటనలు ప్రతి దినము జరుగుచునే యుండును. కావున శుభాశుభశకునములను మాట కూడ కల్పన మాత్రమే. అది మానసిక భ్రమయే. ఏ కర్మ విపాకము గూడ భవిష్యత్తులో కర్మచేయు మన స్వాతంత్ర్యమును అరికట్టదు. జీవుడు కర్మ చేయుటలో నెల్లప్పుడును స్వతంత్రుడే. ఈ స్వాతంత్ర్యము జీవుని నుండి ఎవరును,

ఏదియు హరింపజాలదు. అందుచే ఎంతగొప్ప అశుభము కలిగినప్పటికిని కలతజెందగూడదు. అట్లే మహోత్కృష్టమైన శుభము కలిగినను గర్వపడగూడదు. అనిష్టము కలిగినపుడు గాభరా పడక దాని ప్రభావమును 'శుభకర్మల" ద్వారా తగ్గించ యత్నించుచుండుము. శుభములు చేకూరినపుడు గర్వపడక భవిష్యత్తులో ఇంకను శుభకర్మలే చేయుచుండుటకై ప్రేరణను పొందుము. దుఃఖముల నివారణకై అధర్మము నెపుడును చేయకుము. సుఖములలో ధర్మము నెపుడును మరువకుము.

ఈశ్వరుని దయాగుణము

పరమేశ్వరుని దయాగుణము గురించి ఎప్పుడును ఏదో ఒక సందేహము ప్రకటింపబడుచునే యున్నది. కొందరు ఈశ్వరుని న్యాయకారి యని ఒప్పుకొందురు. కాని అతనిని దయాళువని నమ్మరు. కొందరు అతడు న్యాయకారి, దయాళువు రెండును కాడని నమ్ముదురు. మరికొంద రాతనిని న్యాయకారియే గాక దయాళువని కూడ నమ్ముదురు. వారి యభిప్రాయమున ఈశ్వరుడు దయాన్యాయముల రెంటిని ప్రదర్శింప దలచును. కాని తన యా కోరికను నెరవేర్చుకొనుటలో నత డశక్తుడు.

కనీసము ఒక విషయములో అనగా ఈశ్వరుడు ప్రపంచమున అన్యాయమును నిర్దయను రూపుమాపుటలో సఫలుడు కాలేదని దాదాపు అందరును అంగీకరింతురు. ఈశ్వరుడు దయను ప్రదర్శింపగలుగును, ప్రదర్శించును గూడ. ఐనను అతడు ఇతరులను నిర్దయులను కానిచ్చును. ఇదే విధముగ అతడు స్వయముగ న్యాయమును చేయగలుగును, చేయును. ఐనను అన్యాయమును నిర్మూలించుటయందు సఫలుడు కాలేదు.

సృష్టి కార్యక్రమమును విమర్శించువారి అభిప్రాయము లివి. అనీశ్వరవాదపు బీజము ఇచటినుండియే ఆరంభమగును.

పూర్ణ ఈశ్వరవాదులు - అనగా పూర్ణభక్తులు సృష్టికర్తనే గాని, సృష్టి క్రమమునే గాని విమర్శింపరు. జరుగుచున్న దెల్ల ఈశ్వరుడు చేయుచున్నదే యనియు, అత డేది చేసినను సదా మంచినే చేయును గాని చెడును చేయ డనియు వారు గ్రుడ్డిగా నమ్ముదురు. ఈశ్వరుడు పూర్ణ దయాళువనియు, సుఖమును గాని దుఃఖమును గాని దయాభావముతోనే యొసగు ననియు వారు

విశ్వసింతురు. వారి దృష్టిలో ఈశ్వరుడు దయాళువే కాని న్యాయకారి కాడు. అతడు న్యాయమొనర్ప బూనిన మనకు సుఖ మెంత మాత్రమును లభించెడిది కాదు. మన పాపములు అనంతములు. వాటితో పోల్చి చూచిన దుఃఖములు చాల తక్కువ అని వారి యభిప్రాయము. బైబిల్ "Judge not that thou mayest not be judged" ఎవరి కర్మలను గూడ విమర్శింపకుము, ఏలన మరొకడు నీ కర్మలను విమర్శింప మొదలిడును అని నుడువుచున్నది.

ఈ "విమర్శనా - విరోధము" చివరకు నాస్తికత్వమునే బలపరచును. ఏలన మానవుడు వాస్తవిక సంఘటనల నెంతవర కుపేక్షింపగలడు? అప్పుడప్పుడైనను తెలివి తెచ్చుకొనవలసియే వచ్చును గదా! మహమ్మదీయులలో నొక నిత్యోక్తి కలదు. "వల్లాహ్ ఆలమో" అనగా "నిజము దేవుడెరుగు" నని. ఐనను మహమ్మదీయులలో గూడ తమ స్వభావము, శక్తి, పరిస్థితి ననుసరించి ఆలోచించి తర్కవితర్కముల అనంతరము కొన్ని సిద్ధాంతములను నిశ్చయించినవా రున్నారు.

ఈశ్వరుడు దయాళువా కాదా? ప్రపంచమున దయాళుత్వ మున్నదా లేదా? అను ప్రశ్నలకు విభిన్న వ్యక్తులు విభిన్న దృష్టితో సమాలోచింతురు. కాని ఎంతటి నిర్దయుడు, అన్యాయియైనను దయాన్యాయములు మంచి వనియు భావించును. నిర్దయ, అన్యాయము చెడు వనియు భావించును. ఇతరులు తనయెడ దయా న్యాయములనే చూపవలె నని కోరును. న్యాయము కన్న దయ చూపుటయే అతనికి ఎక్కువ యిష్టమైనచో ఇతరులు తన యెడ న్యాయము కన్న దయనే చూపవలె నని కోరును. పరీక్షకుడు న్యాయముగ ప్రవర్తించినచో ఒక విద్యార్థి అనుత్తీర్ణుడై అతని దయవలన ఉత్తీర్ణుడగు నెడల ఆ విద్యార్థి పరీక్షకుడు తన యెడ న్యాయము కన్న దయనే ప్రదర్శించిన మంచి దని భావించును. న్యాయాధీశుడు న్యాయమొనర్చినచో అపరాధి శిక్షకు గురియై, దయ చూపినచో క్షమింపబడునేని ఆ న్యాయాధీశుడు న్యాయాధీశుడు గాక దయాధీశుడో, క్షమాధీశుడో యైన బాగుండునని ఆ యపరాధి కోరుకొనును.

ఈ ప్రవృత్తి ఇంత విశ్వవ్యాప్తముగ నెందుకు గలదో, ప్రపంచముపై దీని ప్రభావ మెట్టిదో గంభీరముగ నాలోచింపవలయును.

ఈ ప్రవృత్తి విశ్వవ్యాప్తమైన దను విషయము నెవరును కాదనలేరు.

ఇట్లెందుకున్న దనున దొక చిక్కు సమస్య జనులు తనయెడ నిర్దయులు కావలెనని కోరువా డెవడు ? న్యాయముతో బాటు నిర్దయ యున్నప్పుడే అతడు భయపడును. కావున దయను కోరు ప్రవృత్తి విశ్వవ్యాప్తముగ నున్నది. నిర్దయను ద్వేషించుట అంత విశ్వవ్యాప్తము కాకున్నను దాని ఆధిక్యత మాత్రము కలదు. ఇందుకు అపవాదములు తక్కువగా లభించును.

దీనివలన "దయయే సమస్త సృష్టి కార్యక్రమమునకు మూలాధార" 'మను నొక గొప్ప సిద్ధాంతము తెలియుచున్నది. వృక్షమూలమున ఊర్జము (రసము) ఉండును. అది కంటికి కనిపించకున్నను ప్రతిశాఖలో ప్రతి ఆకునందును ఓతప్రోతమై యుండును. అటులనే సమస్తప్రాణుల ఆంతరిక జీవనమును దయాభావము పోషించుచుండును. అందువలన సమస్త ప్రాణుల పరస్పర వ్యవహారముల లెక్కను ఒకచో చేర్చితిమేని ప్రపంచమున దయకన్న నిర్దయ తక్కువే యని తెలియును. నిర్దయ హద్దును మించినచో ప్రపంచమంతయు కంపించిపోవును. "త్రాహిమాం, త్రాహిమాం" అను ఆర్తనాదములు చెలరేగును. విరోధము తీవ్రమగును. ప్రతివాడు "త్రాహి మాం" అనును. ఎవనితో అనును? ఈ లోట్‌లకార యుక్తమైన సంబోధన ఎవరి నుద్దేశించియో తెలియదు. మనము దయను యాచింతుము. ఎవరితోనో తెలియదు. ఇంతటి సర్వవ్యాప్తమైన కోరికకు మూలమే లేదా? ఇదంతయు భ్రమ యేనా? భ్రమ ఇంత విశ్వవ్యాప్తమై యుండదు.

దయకు మరొక పేరే న్యాయము. ఇతరులు మనపై దయచూపవలె నని కోరినట్లుగనే మనము గూడ వారిపై దయజూప మొదలిడినచో అదియే న్యాయ మగును. దయ యొక్క సంతులనయే న్యాయము. ఇతరులు నీయెడ నెట్లు వ్యవహరింపవలె నని నీవు తలంతువో నీవును వారియెడ నట్లే వ్యవహరింపుము. ఇదియే న్యాయము. కావున న్యాయమనునది దయకు విరుద్ధము కాదు. న్యాయములేని "దయ" అపూర్ణము, కుంటి, ఏకపక్షము నైన దగునే కాని ఉభయపక్ష మైనది కాదు. ఒక పరీక్షకుడు మోహనునిపై దయదలచి ఎక్కువ గుణముల నొసగినచో అతడు సోహనుని యెడ నిర్దయు డగును. ఏలన మోహనుడు యోగ్యత లేకుండగనే సోహనుడు వంచింపబడినట్టి స్థానమును పొందెను. ఏ ప్రయోగము సోహనుని యెడ నిర్దయకు కారణమైనదో అది మోహనుని పట్ల గూడ సంభవింపవచ్చును. ఇది యిట్లే కొనసాగినచో నీరు కలిసిన పాలు కూడ మిగులక ఒక చుక్కయైనను పాలులేనట్టి నీరు మాత్రమే మిగులును. ఇట్టి దయను దయ

యనక పక్షపాతము, బలిమి, బడితెగలవానిదే బఱ్ఱె, గ్రుడ్డి వాని రాజ్యము మున్నగు పేర్లతో సంబోధింతురు. ఒక మణుగు పాలలో పావుశేరు నీరు కలిసినచో గుర్తింపబడనట్లే దయ న్యాయమునుండి స్వల్పముగనే తొలగినచో మనము గుర్తింపలేము. కాని యిట్టి దయాళువులైనవారి సంఖ్య లెక్కకు మించినచో దానిని దయ యని ఎవరు గూడ అనరు. అన్యాయము దయను నాశన మొనర్చును. కావున వాస్తవ మేమన న్యాయమున్న చోటనే దయ యుండును. వస్తువొకటే. దానిని రెండు దృక్కోణములనుండి చూతుము. దయాన్యాయముల విరోధము పెరిగిన కొలది ఈ రెండును క్షీణించుచు చివరకు దయ, న్యాయము రెండును మిగులకుండ పోవును. దయనుండి న్యాయము, న్యాయము నుండి దయ వేరగుటకు మొదలిడిన క్షణమునుండియే దయా న్యాయముల రెంటి క్షీణ దశ ప్రారంభమగును. మొదట సూక్ష్మముగ నుండి రాను రాను స్థూల మగును. విరోధ మధికమైనపుడు మాత్రమే దయ, న్యాయము రెండును లేకుండ పోయిన వని మనకు తెలియును. వాస్తవముగ న్యాయము దయను కాని, దయ న్యాయమును కాని అణచివేయ లేదు. దయ న్యాయము నణచి వేయుట కుద్యమించి అది తననే అణచివేసికొనెను. న్యాయము దయ నణచివేయబోగా దాని క్షీణతయే మొదలైనది. నోటిలో బొక్క గ్రుచ్చు కొనగా వెడలుచున్నట్టి రక్తమును బీల్చుకొనుచున్న కుక్క అది తన రక్తమే యని తెలిసికొనదు గదా! కావున దయచేత ద్రవీభూత చేతస్కుడై న్యాయమునుండి వైదొలగినవాడు వాస్తవముగ నిర్దయను ప్రారంభించినవా డగును. ఏలన దయ, న్యాయము మూలతః ఒకటియే. మనుజునిలో స్వార్థము ప్రవేశించినపుడు మాత్రమే ఇవి రెండును భిన్నము లని తోచును. స్వార్థమే జీవునిలో గల గొప్ప బలహీనత. మనుజునిలో స్వార్థ మెంత తగ్గుచుండునో అంతగా నతడు దయాన్యాయముల సమానార్థమును గ్రహించుచుండును.

ఇంతమాత్రము గ్రహించిన పిదప ఈ వ్యాసారంభమున ప్రవేశపెట్టిన పక్షము (విచారణీయాంశము) లన్నియు సులభ గ్రాహ్యము లగును. మన దృక్కోణము మారును. మనము సృష్టికర్త యొక్క అస్తిత్వము నంగీకరించినను అంగీకరింపకున్నను ఈ సృష్టి మనకు నియమరహితముగనో ఉచ్ఛృంఖలముగనో కాన్పించదు.

మరొక విషయము నాలోచింపుడు. అన్యప్రాణులేవియు లేనట్టి నిర్జన ద్వీపమున మీ రొకరే నివసించుచున్నా రనుకొనుడు. అచట మీ జీవనమునకు కావలసిన భోజన సామగ్రు లన్నియు గలవు. ఆ స్థితిలో మీరెవరిపై దయచూపగలరు? ఎవరి యెడ న్యాయమును ప్రదర్శింపగలరు? అచట దయా న్యాయముల ప్రసక్తియే యుండదు. కాని కొంతకాలము పిదప మరొక మనుజుడే కాని, కుక్కయే కాని మీతో నివసింప మొదలిడు ననుకొనుడు. అపుడు దయ, న్యాయము, రెంటి ప్రసక్తి యేర్పడును. ఏలన భోగ్యపదార్థము ననుభవించుటకు మరొక ప్రాణి వచ్చి చేరినది. ఇరువురి పరస్పర వ్యవహారములందు దయ, నిర్దయ, న్యాయాన్యాయముల వాసన కొంతయైనను ఉండితీరును. మీ రిరువురును సమానముగ భోగ్యపదార్థములను పంచుకొనుటతో తృప్తి పడినచో అది న్యాయ మనబడును. అరబీ భాషయందు దీనిని "ఇన్సాఫ్" (నిస్ఫ్ నిస్ఫ్ కర్నా) అందురు. "నిస్ఫ్" అనగా సగము. ఈ యర్ధీకరణమే న్యాయము. అట్లుగాక మీరో, అతడో సగము కన్న అధికము పొందగోరినచో దానిని అన్యాయ మందురు. అదియే నిర్దయ యనబడును. ఒక భోగ్యపదార్థము ననుభవింపగోరు భాగస్వాములు పలువురైనపుడు ప్రతి వ్యక్తియు న్యాయోచిత భాగము కన్న అధికముగ పొంద యత్నించును. ఒక పరివారము, గ్రామము, నగరము, దేశము లేక విశ్వమునందలి వ్యక్తులను ఇందు కుదాహరణగ గైకొనవచ్చును. ఇట్టి ప్రవృత్తియే అన్యాయము లేక నిర్దయకు మూలము. భాగస్వాము లిరువురే యైనపుడు న్యాయనిర్ణేత లేకుండెను. నిర్ణేత "ణీఞ్" ప్రాపణే ధాతువు నుండి యేర్పడును. న్యాయ శబ్దము గూడ పాణిని ప్రణీత నియమములు లేదా నిపాతముల ననుసరించి ఈ ధాతువునుండే సిద్ధించవలెను. భావ మొకటే. భాగస్థులు పెక్కురై నపుడే న్యాయాధీశుల, న్యాయాలయముల, ఉచ్చన్యాయాలయముల ప్రసక్తి యేర్పడును. అనగా ఏ యిరువురి మధ్యనైన వివాద మేర్పడినచో వారిలో నెవరితోను భాగస్వామ్యము లేని మూడవవ్యక్తి ఆ తగవునకు న్యాయనిర్ణేత కావలెను. లౌకిక న్యాయాలయములందు జరుగున దిదియే. ప్రతిద్వంద్వులలో నెవరి లాభములతో నెట్టి సంబంధము లేనట్టి న్యాయాధీశులను నియమించు ప్రయత్నము చేయబడును. న్యాయాలయములు లేకపోవుట యన న్యాయమునకే గాక దయకును హత్యాసదృశమే యగును. ప్రతివాడు దయను కోరును. అన్యుడెవడును తన యెడ నిర్దయుడు కాగూడ

దనియే వాంఛించును. ఈ ప్రవృత్తియే ఆటవిక జాతులందును తమ కొక రాజు నెన్నుకొనుటకు ప్రేరేపించును. ఇదియే సభ్యజాతులు న్యాయాలయములను, అంతర్జాతీయ, అంతర్రాష్ట్రీయ న్యాయాలయములను నెలకొల్పున ట్లొనర్చును. మానవులందు ఈ భావము విశ్వవ్యాపకము, స్వాభావికము కాకున్నచో ఎవడును న్యాయాలయముల నంగీకరించెడివాడు కాడు. అప్పుడు దుర్భరమగు ఒక భయంకర పరిస్థితి యేర్పడెడిది. మీరు వివిధ యుగములందలి విభిన్న జాతుల న్యాయాలయ స్వరూప, శాసనముల చరిత్రను గమనించినచో దయా న్యాయముల ఏకీకరణమే సమస్త ధర్మశాస్త్రములకు మూల మని బోధపడును.

"స్వస్య చ ప్రియమాత్మనః" అనునది న్యాయమునకే గాక దయకును ధ్యేయమే. శ్రుతి, స్మృతి, సదాచారములు లేదా ధర్మము యొక్క యితర రూపములు ఈ మూల ధ్యేయ పోషణకు సాధన ములు మాత్రమే. ఒకవేళ సామాన్య జనులే న్యాయమును స్థాపింపగల్గుచో "సదాచారః" (సతాం విశేష పురుషాణాం ఆచారః) యొక్క అవసరము లేకుండెడిది. సత్పురుషులలోను స్మృతికారులు ఉత్కృష్టులుగ పరిగణింపబడినారు. ఏలన వర్తమాన కాలమున జీవితులైయున్న సత్పురుషులలో ఏ పక్షమునెడ నైనను కొంత మోహ ముండుటకు అవకాశము గలదు. తత్పరిణామముగ న్యాయము నందు కొంత కొరత (మిశ్రణ) యేర్పడవచ్చును. కాని గతించిన మహా పురుషులలో స్మృతికారులైన వారికి నేటి యుగపు ఏ ప్రతిద్వంద్వితోను సంబంధ ముండదు. భోగములకు సంబంధించిన యే తగవులందును వారు భాగస్వాములు కారు. అందువలననే వారు ఉత్కృష్టమైన న్యాయనిర్ణేత లగుదురు. అన్నింటిలోను శ్రుతి అత్యంత ఉపయుక్త మైనదిగ నెన్నబడినది. ఏలన పరమాత్మ ప్రపంచమందలి ఏ భోగ్య పదార్థమును అనుభవించువాడు కాడు. అతడు "అనశ్నన్ అన్యోఽ భిచాకశీతి" (ఋగ్వేదము). ఇట్టి సత్తా (శక్తి) న్యాయ మొనర్చినచో నది యథార్థమైన న్యాయ మగును. భోగము లందరికి సమానముగ నొసగబడును. కోతిపంపక మెన్నటికిని జరుగదు. పిల్లులు కోతిని గాక ఏదేని తూకపు యంత్రము నాశ్రయించి యుండెనేని వానికి సమాన భాగమే లభించియుండెడిది. కోతి అన్యాయ మెందుకు చేసెను? తన స్వార్థమునకే గదా! అందువలన ఆ తీర్పు రెండు పిల్లులయెడ నిర్దయయే యైనది. నిర్దయలేకున్నచో అన్యాయారోపణ యుండెడిదే కాదు. నిర్దయుడైనవానినే అన్యాయి

యని గూడ అందురు. నిర్దయారోపణ లేనిచోట అన్యాయము గూడ ఉండదు. ఎవరైనను మీ యింటినుండి చెత్తాచెదారము వంటి పనికిరాని వస్తువులను ఎత్తుకుపోయినచో మీకు నిర్దయానుభూతి కలుగనేరదు. మీ రా వ్యక్తిని అన్యాయి యని గూడ అనరు. న్యాయము కొరకు ఏ న్యాయాధీశుని గూడ ఆశ్రయించరు. దీనివలన నీ దిగువ విషయములు నిర్ధా రితము లగుచున్నవి.

౧. న్యాయము, దయ సమానార్థక పదములు. వీని ప్రయోజన మొకటియే. "ప్రయోజకుడు" అనగా పథకము వేయువాడు,సాధకుడు, ప్రేరకుడు, ఏదేని కర్మయందు ప్రవృత్తిని కలిగించువాడు అని అర్థము. మనుజునిలో ఏకర్మల ప్రవృత్తి న్యాయమును ఉత్పన్నమొనర్చునో అదియే దయను గూడ ఉత్పన్నము చేయును. కావున స్వామి దయానందసరస్వతి సత్యార్థప్రకాశమున దయాన్యాయములు సమానార్థకములని పేర్కొని అనర్థ మేమియు చేయలేదు.

౨. భోగ్యపదార్థములను అనుభవించువారు పెక్కురైనపుడే దయాన్యాయముల సమస్య ఉత్పన్న మగును. సృష్టిలోని పదార్థములు-గడ్డిగాదము, నిప్పు, నీరు, సూర్యుడు, వాయువు మొదలుగున వన్నియు భోగ్యములే. వీని ననుభవించువారు అసంఖ్యాక మనుజులు మరియు వారితో బాటు ఉండు అనంత ప్రాణి కోటి. వీరందరు స్వార్థవశమున ఇతరుల భోజనమునుండి తమ భాగముకన్న అధికముగ పొందగోరుదురు. ఇదియే అన్యాయము, నిర్దయ. దీనినే కుకర్మ, అశుభకర్మ లేదా పాపము అని అనవచ్చును. వీనిని నిరోధించువాడే న్యాయాధీశుడు. అతడు లౌకికుడేని, లోకోత్తరుడేని కావచ్చును. అతడు మిమ్ము నిర్దయ చేష్ట చేయకుండ నిరోధించును. దీనిని మీరు అనుచితముగ నిర్దయ యని యందురు. కాని ఇది నిర్దయ కాదు, దయయే.

3. ఇట్టి సర్వోత్కృష్టుడైన న్యాయాధీశుడు పరమేశ్వరుడే కాగలడు. ఏలన సృష్టియందలి భోగములలో నతని కెట్టి భాగమును లేదు. మానవునకు ఏ కొద్ది స్వార్థమైన నుండవచ్చును. కాని పరమేశ్వరునకు మాత్రము ఉండజాలదు. కావున నిజమైన దయాళువు, యథార్థమైన న్యాయకారి పరమేశ్వరుడే.

ఈశ్వరుని అస్తిత్వము నంగీకరింపనివారు కూడ దయాన్యాయ భావములు బొత్తిగా లేనివారు కారు. వారికి నిర్దయ - అన్యాయములు రుచించు

ననియు కాదు. చేతనుడు, సర్వజ్ఞుడు నైన ఈశ్వరుని నిష్పాక్షికత్వముపై విశ్వాసము లేనప్పటికిని వారు ప్రతిద్వంద్వులలో నొక పక్షము లేదా వ్యక్తి యెడ పక్షపాతము చూపనట్టి అచేతన - జడ జగత్తు యొక్క విశ్వవ్యాపక నియమములందు విశ్వాసము కలిగియుందురు. ఈశ్వరుని న్యాయము న్యాయాధీశులందరికన్న ఉత్కృష్టమైనది, పక్షపాతరహిత మైనది. కావున అతని దయాళుత్వము గూడ నట్టిదే యనునది సుస్పష్టమే.

పాపము - దుఃఖము వీటికి పరస్పరము సమవాయ సంబంధము కలదు. ఒక బాలుడు కడుపునొప్పితో విలపించుటను గాంచిన వెంటనే అడ్డదిడ్డముగ నేమి తింటి వని మీ రతనిని ప్రశ్నింతురు. దెబ్బలకు గురియగుచున్న వ్యక్తిని గాంచి అత డేమి చెడుపని చేసెనని ప్రశ్నింతురు గదా! సంకెళ్ళతో బంధింపబడిన వ్యక్తి వీధినుండి వెళ్ళుచుండగ జూచి అతడు దొంగతనము చేసెనా యని వెంటనే ప్రశ్నింతుము గదా! సారాంశ మేమన కష్టములకు గురియైన వ్యక్తిని గాంచి మనకు మొదటి సారిగా గలుగు భావము అతడు ఏదైన తప్పు చేసియుండు నని. అది సామాన్యమైన పొరపాటో, చట్టసంబంధమైన అపరాధమో, పాపమో కావచ్చును. ఇవన్నియు సజాతీయ శబ్దములు, పాపమునకు సమానార్థకములు. వీటికి దుఃఖముతో కార్యకారణ సంబంధము కలదు. కొన్ని సందర్భములలో దుఃఖమునకు కారణము తెలిసికోలేక పోయినను కారణమును వెదుకయత్నింతుము. ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధి దైవిక మను త్రివిధ తాపములకు మూల కాణములను తెలిసికొను నుత్కంఠ విద్వాంసుల కెల్లప్పుడును కలదు. ఇతిహాసజ్ఞులు ఒక జాతి యొక్క వృద్ధి క్షయములకు గల కారణము లేమిటో (ఆ జాతికి చెందిన వ్యక్తులు చేసిన పాపపుణ్యము లేమిటో) కనుగొన యత్నించినారు. ఏయే శారీరక పాపముల వలన నేయే రోగము లుత్పన్న మగుచున్నవో కనిపెట్టు నుత్కంఠ వైద్యులలో కాన వచ్చును. నీతి శాస్త్రవిదులు మనదుఃఖములకు కారణములను మన పొరపాట్లలో వెదుకుదురు. ఇట్టి ప్రయత్నశీలురలో ఈశ్వరవాదులు, అనీశ్వరవాదులు ఇరువురును గలరు. అనీశ్వర వాదులు ఈశ్వరుని, అతని పర్యాయవాచక శబ్దములను త్యజింతురు. వారు పాపము, పుణ్యము అను శబ్దముల నుపయోగించుటకును వెఱతురు. అట్లొనర్చినచో వారు ఈశ్వరవాదులుగ పరిగణింపబడుదు రని వారి భయము. కాని వారు గూడ ఉపదేశమొనర్తురు. శుభాశుభకర్మలను లేదా

కర్తవ్యాకర్తవ్యములను వారుగూడ త్యజింపలేదు. అనీశ్వరవాద ప్రధాన దేశములలోను ఉపదేశములు, ఉపదేష్టలు, ఉపదేశములను వినెడివారు - వీరి అస్తిత్వము సమసిపోలేదు. పాపమునకు దుఃఖమునకు పరస్పర సంబంధము కలదని దీనివలన ఋజువగు చున్నది. పాప మున్న చోట దుఃఖముండియే తీరును.

స్వార్థము నిర్దయ, అన్యాయములను ఉత్పన్నము చేయును. అంతే గాక అది పాప (దుఃఖ)ములకును లేదా పుణ్య(సుఖ)ములకును గల యథార్థమైన సంబంధమును సరిగా తెలిసికొనుటలో బాధక మగును. ఏలన మనుజుడు తనను అందరికన్న తక్కువ పాపిగను, అందరికన్న అధిక దుఃఖితుడుగను భావించును. అనగా అతడు ప్రపంచమందలి వ్యక్తులందరును తనకన్న అధిక అన్యాయపరులు, నిర్దయులు అని భావించును. అందువలన ప్రపంచమందలి దుఃఖములలో నధిక భాగవము తనకే ప్రాప్తించె ననుకొనును. కాని ఇది నిజము కాదు. ఇట్లనుకొనుటవలననే అనేక దుఃఖములకు సరియైన కారణములను తెలిసికొన జాలము. లేదా తెలిసికొనుట కిష్టపడము. పరనింద మన కెందుకు ప్రీతిని గలిగించును? మన దుఃఖములకు ఇతరుల పాపములతో సంబంధము కల్పించగోరుదు మెందుకు? ఆ దుఃఖములలో మన పాపములను చూడ యత్నింప మెందులకు? మనలోని గొప్ప దౌర్బల్య మిదియే. మన కర్మలకును భోగములకును గల సంబంధమును తెలిసికొన గలుగుటయే మన ఆత్మబలమునకు ప్రథమ నిదర్శన మగును. ఇట్లు జరిగెనేని ప్రపంచమందలి గొప్ప సమస్య లన్నింటికిని పరిష్కారము లభించును.

అనేక దుఃఖములు అకారణముగనే కల్గినట్లు మనకు తోచును. వాటి భీషణత్వము మనలను మరీ భయభ్రాంతుల జేయుటకు కారణము అవి ఏక కాలమున కనిపించుటయే. ఉదాహరణకు ఒక నగరమందలి చికిత్సాలయ దృశ్యమునే గైకొందము. అచటికి వచ్చుటకు పూర్వము రోగులు తమ తమ ఇళ్ళలో నుండిరి. ఇళ్ళలో నుండగా మీ దృష్టికి రాకుండిరి. వారంద రొక చోట చేరుటతోడనే ఆ దృశ్యము అధిక భీభత్సముగ మారినది. ప్రతిదిన మెందరో జనులు మరణించు చుందురు. కాని శ్మశానమున ౮,౧౦ శవము లొకేసారి దహింప బడుటను గాంచిన మన కది చెడుగా దోచును. ఒక రైలు దుర్ఘటనలో వంద రెండువందల జనము మరణించుట జూడ మనకెంతో రోషము కలుగును. కాని లెక్కించి చూడ మరణముల శాతము చెప్పుకో దగినంతగా కాన్పించదు. నే నొకప్పుడు

బీమాసంస్థలోని ఒక విజ్ఞుడైన ఉద్యోగితో సంభాషించుచు "సంస్థకు ఆకస్మిక మరణము, ఆత్మహత్య, యుద్ధము, భూకంపము మొదలగువాటి కారణమున మరణించు వారికి గూడ పెద్ద మొత్తములే చెల్లించవలసియుండును గదా! మరి సంస్థ కేమి లాభముండు"నని ప్రశ్నించితిని. దాని కత డొసగిన సమాధాన మేమన - క్వెట్టా మున్నగు భూకంపములు, మాహాయుద్ధములు, హిరోషిమా పై బాంబుల ప్రయోగము వంటివి సంభవించినచో కలుగు మరణముల శాతము మొత్తము ప్రపంచ జనాభాలో ఎట్టి అసాధారణతను గూడ కలిగించదు. అంతేగాక సంస్థ మొదటి నుండియే ఇటువంటి దుర్ఘటనలవలన ఎంత భారమైతే వహింప సిద్ధపడి యుండునో అంతకన్న అధికభారము వాటికి వహింపవలసి రాదు. ప్రస్తుత సమస్యతో సంబంధము గల పరమ సత్యమిది. ప్రపంచ మందలి సమస్త ప్రాణుల కర్మల యొక్కయు భోగముల యొక్కయు సుదీర్ఘ యుగచరిత్ర మన ముందు ఉంచబడినచో మనము మన పాపములకును దుఃఖములకును గల నిష్పత్తిని చక్కగా గ్రహింపగలిగి ఉండేవారము. అంతే గాదు ప్రపంచ శక్తులు అన్యాయమును నిర్దయను అరికట్టుటలో నెంతవరకు సఫలమైనవో తెలిసికొనెడి వారము. మనుష్యుడు అన్యాయము లేదా నిర్దయను ప్రదర్శింప దలచవచ్చును. కాని తన ఆలోచనలను క్రియాన్వితము చేయుటలో సదా సఫలుడు కాగలుగునా? సామాన్యముగ అతని ఆంతరిక ఆలోచనలే అతనిని అనిష్ట మొనర్పకుండ నిరోధించునా ? ఒకొకప్పుడు ప్రపంచములోని అన్య శక్తులు అతని మార్గమున ఆటంకములు కలుగజేయును. మరొకప్పుడు మనుష్యుడు తన నిర్దయ సఫలమైన దని యనుకొనగా నది భోక్తయెడల విపరీత ఫలితము నొసగున దగుచున్నది. ఆకస్మిక దుర్ఘటనలలో క్షణములో కుటుంబములకు కుటుంబములే పూర్తిగా నాశన మగును. అట్టి సందర్భమున దుఃఖ మెవరికి కలుగును ? వారికై ఏడ్చువా రెవరు ? ఏడ్చుట కెవరును మిగుల లేదు గదా! మరణించిన వారికి మరణము పిదప ఎట్టి దుఃఖము కలిగినదో తెలియనే తెలియదు గదా! ఇదే సృష్టినియమపు చివరి జోక్యము. ప్రాణుల కర్మ స్వాతంత్ర్యము నందు సృష్టి జోక్యము చేసికొనదు. అట్లొనర్చిన జీవుని కర్తృత్వము నశించును. "స్వతంత్రః కర్తా". స్వాతంత్ర్య మనునది కర్తృత్వ లక్షణము. స్వతంత్ర కర్మయే జీవుని న్యాయము - అన్యాయము, దయ - నిర్దయ కోటిలో చేర్చును. కావున అందు సృష్టి నియమము లేదా ఈశ్వరుని హస్తక్షేపము యొక్క ప్రసక్తియే ఉత్పన్నము కాదు. కాని భోగములందు మాత్రము

ఈశ్వరుడు సదా హస్తక్షేపము చేయుచునే యుండును. అది కొన్ని యెడల కొలదిగ నున్నను చివరకు మాత్రము అధికముగనే యుండును. కావుననే జీవుడు కర్మ చేయుటలో స్వతంత్రుడు, ఫలము పొందుటలో పరతంత్రుడు అని యందురు. ఈశ్వరునకు లేదా సృష్టి క్రమమున కున్నట్లే స్వాతంత్ర్య పారంత్ర్యములకును ఒక వ్యవస్థ గలదు. అందువలన మరణమునకు నిమిత్తము ఎంత భయంకరమైన దైనను స్వయముగ మరణము అంత భయంకరముగ నుండదు. భీషణత్వము మృత్యుక్షణమున కీవలివైపుననే గోచరించును గాని ఆవలివైపున గాదు. ఇందు ఈశ్వరుని న్యాయమే గాక దయాళుత్వము గూడ కలదు. గాఢ సుషుప్తిలో నున్నట్లే మరణమందు గూడ జీవుడు త్రివిధ తాపముల నుండి విముక్తుడై యుండును. వేదము "యస్యచ్ఛాయా ఽ మృతం యస్య మృత్యుః" అని ఘోషించుచున్నది. అమృతము మృత్యువు రెండును అతని ఛాయయే, అతని దయయే. కావుననే ఈశ్వరుడు దయాళువు.

ఈశ్వరుడు మన కర్మలకు మాత్రమే ఫలము నిచ్చుచో అతడు మనపై చూపిన దయ యేమి? అనుప్రశ్నకు సమాధాన మీయవలసి యున్నది. దీనికి దార్శనిక పక్షము చూపియే యున్నాము. ఐనను లౌకిక దృష్టితో దీని విషయమున స్థూలముగ నాలోచింతుము.

మీ గ్రామమున నొక మిఠాయి వర్తకుడు గల డనుకొనుడు. అతడు రు. 3/-లకు శేరు మిఠాయి అమ్మును. ఎవరికిని అరు విన్వడు. డబ్బు గైకొనియే మిఠాయి ఇచ్చును. మీ రతనికి కృతజ్ఞులై యుండ గలరా ? మీ కతని దయాళుత్వానుభూతి కలుగునా? ఎన్నడును కలుగదు. అతడు మీతో నెట్లు వ్యవహరించెను ? అతడు డబ్బు గైకొనియే మీకు మిఠాయి నిచ్చెను. అతడు మిఠాయి చేయుట మానివేసె ననియో లేక మరొక చోటికి వెళ్ళె ననియో యనుకొనుడు. అప్పుడు మీరు రు.3/- లు తీసుకుపోయి శేరు మిఠాయి కొనలేరు గదా! మరొక చోటు నుండి తెప్పించుటలో శేరు మిఠాయి విలువ నాల్గైదు రూపాయ లగును. ఐనను అది మీకు తత్క్షణమే లభింపదు. అప్పుడు గాని మిఠాయి వర్తకుని ఉనికి వలన మీకు ప్రతి దినము శేరు కొకటి రెండు రూపాయలు లాభించుచుండె నని గుర్తుకు రాదు. మిఠాయి వర్తకుడు మీపై దయ చూపకపోవచ్చును. కాని పరిస్థితి (అతని ఉనికి) మీపై దయ చూపుచుండెను.

మరొక దృష్టాంతము. ఒక విశ్వవిద్యాలయమున పరీక్షార్థి సమాధాన

పత్రములో ప్రదర్శించిన యోగ్యతను బట్టియే అతనికి గుణములు లభించును. విశ్వవిద్యాలయము మీపై దయ చూపదనియే మీరు భావింతురు. ఇతరులతో నట్లే చెప్పుదురు. కాని అది నిజము కాదు. విశ్వవిద్యాలయము లేని ప్రాంతమందలి విద్యార్థులు తమ యోగ్యతలను సరిగా పరీక్షింపజేసికొనుటకు అధిక వ్యయప్రయాసల కోర్చి దూరదేశముల కేగుదురు. అప్పుడు గాని న్యాయపూర్వకముగ పరీక్ష గైకొనుటయు దయయే యని వారికి తెలియదు. విశ్వవిద్యాలయములే లేకున్న అధ్యయన రూపమున మనము చేసిన పరిశ్రమను ఎవరు పరీక్షింప గలరు? పరీక్షించిన దానిని ప్రమాణీకరించి, ఉపాధుల (పట్టాల) నెవ రొసగగలరు ?

ఈ రెండు దృష్టాంతములవలన శ్రమకు తగిన ఫలమును పొందుటకు సాధనముల నేర్పరచుటయు దయయే యని తెలియు చున్నది. ఏలన ఈ సాధనములు మీ పరిశ్రమ రూప యజ్ఞమును సఫల మొనర్చుట కుపకరించును. యజ్ఞములకు సంబంధించిన గ్రంథములందిట్టి యజ్ఞములయొక్క అంగములు "ఉపకారములు"అని పేర్కొనబడినవి. కర్త యొక్క కారకత్వమందు సహాయకములగు నవే ఉపకారకములు, (౧) సంనిపత్యోపకారకము (౨)ఆరాదుపకారకము అని ఉపకారకము (ఉప+కారకము) రెండు రకములు. దగ్గరలో ఉండి త్వరగా తెలిసికొనబడు సాధనము సంనిపత్యోపకారక మనబడును. ఉదాహరణకు మన కొక వ్యక్తి భోజన మిడె ననుకొనుడు. భోజనమువలన కలిగిన తృప్తియందు భోజన దానము సంనిపత్యోపకారక మగును. కాని ఒకడు భోజనమునకు బదులు ఒక పొలమునే యొసగె ననుకొనుడు. ఆ పొలమును దున్ని విత్తనములు చల్లిన కొన్ని మాసముల పిదప గాని మనకు భోజనము లభింపదు. ఈ క్షేత్రదానము ఆరాదుపకారక మగును. తత్కాలము సహాయకారులగు వస్తువులను బాలుడైనను గుర్తించును. కాని చాల దూరమునుండి ఉపకారమొనర్చువానిని తెలిసికొనుటకు బుద్ధి నుపయోగింపవలసి యుండును. సారాంశమేమన శ్రమించుటకు క్షేత్రమును సిద్ధపరచి శ్రమకు తగిన ఫలము నొసగుటయు దయయే యగును. ఈ దయ ప్రత్యక్షముగాక పరోక్షమై యుండి బాగుగ నాలోచించిననే గాని తెలియదు. మీరు మీ బంగారమును తూకము వేయించుటకు స్వర్ణకారుని వద్దకు పోవుదురు. అతడు మీ బంగారమును వృద్ధిచేయడు. కేవలము తూకము చేసినంత మాత్రముననే మీరతనికి కృతజ్ఞులై యుందురు. పరీక్షకుడు పరీక్ష గైకొనుటయు దయయే. అత డా పరీక్షను ఏ మాత్రము

స్వార్థములేక పక్షపాతరహితముగ గైకొనినచో అది న్యాయరూప దయ లేదా దయారూప న్యాయ మగును. మన మొనర్చిన కర్మలకే సరియైన ఫలమొసగినచో ఈశ్వరుడు మనయెడ ఏమి దయ చూపినట్లగు నని జనులందురు. కర్మ యొనర్చుటకు క్షేత్రము లభ్యమగునట్టి సృష్టిని పరమేశ్వరుడు రచింపకున్న మనము కర్మ నెట్లు చేయగలిగెడివారము? విశ్వవిద్యాలయములను స్థాపించి పరీక్షా ప్రణాళికలను సిద్ధపరచిన వారును మనపై దయచూపినారు. కాని ఈ దయ అరాదుపకారక మైనది. స్థూలము కాక సూక్ష్మమైనది. ప్రత్యక్షము గాక పరోక్షమైనది. "పరోక్షప్రియాహి దేవః" దేవతలు అత్యంత పరోక్షమున, అతి దూరమున, అతిగుప్తముగ నున్న వస్తువును గూడ పరికించి దాని యునికిని తెలిసికొందురు. ఇక ప్రత్యక్ష ప్రియులందురా 'గాడిదలు గూడ ఆ కోవకు చెందినవే".

కర్మలు ఫలము నెట్లొసగునను విషయ మిపుడు చర్చింపవలసి యున్నది. చేసినకర్మ వెంటనే సమాప్త మగును. దానికి ఫలము తత్కాలమున గాని, అదే స్థలమున గాని లభింపదు గదా! దేశాంతరమున, కాలాంతరమున లభించు నీ ఫలమునకు కర్మతో సంబంధము కలుగజేయు టెట్లు? కొందరు దార్శనికులు "అదృష్టము'అను దానిని కల్పించినారు. ఆ యదృష్ట మేమి? అది తెలిసినచో దాని నదృష్టమని ఎందు కందురు? అది అదృష్టమే కాదు అజ్ఞాతము గూడ, కొందరు విద్వాంసులు దీనిని కేవలము "ఈశ్వరుని వ్యవస్థ" యనిరి. అది వ్యవస్థయే, కాని మనుష్యుని అల్పజ్ఞానమున కందనట్టిది. లౌకిక వ్యవస్థ యందును దీనికి ఉదాహరణములు లభించును. ఒకడు తోడి మానవు నొకనిని చంపి దాగుకొనును. ఉత్తర ప్రదేశము లోని ఒక గ్రామమున హత్య జరుగగా అది జరిగిన నాలుగేండ్ల పిదప మద్రాసు రాష్ట్రములోని ఒక నగరమున హంతకుడు పట్టుబడెను. ఈ దేశాంతర, కాలాంతర శిక్షకు అపరాధముతో సంబంధ మెట్లేర్ప డినది? ఏర్పరచిన దెవరు? రాజకీయ వ్యవస్థయే యని మీరు సమాధాన మీయగలరు. ఈ వ్యవస్థ ఎట్లు పనిచేయుచుండు నను విషయము సామాన్య జనులకు "అదృష్టము"గనే యుండును. కాని శాసకులకు సమస్త సూత్రముల శృంఖల దృష్టమే యై యుండును. ఈ దృష్టాంతమునే దూరమునకు విస్తరింపజేసిన నేటి జీవుడు చేసిన కర్మలు యుగాంతరములలో, లోకాంతరములలో ఎట్లు ఫలము నొసగు ననునది అదృష్ట విషయమే కాగలదు. అది ప్రత్యక్షమునకు దూరమైనదే. కాని అనుమానమునకు దూరమైనది కాదు. ఒక గొప్ప శాసకుని వ్యవస్థ అతని శాసన

క్షేత్రమున పనిచేయునట్లే ఈశ్వరుని వ్యవస్థ లోకాంతర, యుగాంతరముల వరకు వ్యాపింపగల్గును. శాసన క్షేత్ర మెంత విశాలమైన నంతవరకే వ్యవస్థ పనిచేయును. కావున ఈ జన్మలో చేసిన కర్మలు జన్మాంతరమున నెట్లు పరిపక్వ మగుచున్నవో అర్థము కానట్టి జనులు అంత సూక్ష్మముగ నాలోచింపదలచ రనియే స్పష్ట మగుచున్నది. ఆక్సీజన్, హైడ్రోజన్ పరమాణువుల యొక్క యే నిష్పత్తి ప్రయాగలో గంగాజలము నుత్పన్నము చేయునో అదే నిష్పత్తి అమెరికాలోని మిసెసిపీ నదీ జల నిర్మాణముననును క్రియాశీలమై యుండుటకు గల కారణ మేమి? ఆ రెండు జలరాశులును ఎంతో దూరమున గలవు. వాని మధ్య నెట్టి ప్రత్యక్ష సంబంధము గూడ లేదు. కాని ఒక అదృష్టనియమ మనెడి సూత్రము ఈ రెండు దూరస్థ సంఘటనలను సంభవ మొనర్చుచున్నది. దీనిని మీరు ఈశ్వర వ్యవస్థయే యనుడు లేక ఈశ్వరీయ శాసనమే యనుడు. ఈ రెండును అదృష్టములే, అదృష్టరూపమున పనిచేయునవియేం. బీజము యొక్క ధర్మములు ఫలమునం దెట్లు అతిదేశములగునో, ఏ పరిణామమును పొందునో, ఆ ధర్మములందు అవాంతరక్రియలద్వారా ఎంత పరివర్తనము సంభవించునో అనునది ఒక జటిలమైన సమస్యయే. కాని ఒక వ్యవస్థాపకుడు అవశ్యముగ గలడు. అతని అదృష్ట వ్యవస్థయే కర్మకును ఫలమునకును సబంధ మేర్పరచుచున్నది. ఆ ఫలము ననుభవించువాడు కర్తృత్వ శక్తి గల వ్యక్తియే. సంపూర్ణ యజ్ఞఫలము యజమానునకే లభించును. ఏలన ఋత్విజు లెవరైనను యజ్ఞ ద్రవ్యము లేవియైనను దేవత లెవరైనను యజ్ఞము యజమాని హితము కొరకే చేయబడును.

"కర్మప్రధాన్ విశ్వ కర్ రాఖా, జో జస్ కరే సో తస్ ఫల్ చాఖా"

ఇది విశ్వనియంత యొక్క దయాళుత్వమే గదా! అత డీ విశ్వమును కర్మ ప్రధాన మొనర్చిమనకుదాని ఫలము ననుభవింప జేయును. ఈనియమమే లేనిచో ప్రపంచము గతి యేమయ్యెడిదో, అది ఎంత అంధకారమయ మయ్యెడిదో ఊహించినంత మాత్రముననే హృదయము కంపించి పోవును. వ్యవస్థాపకుని వ్యవస్థ మరియు ఎంత మాత్రము స్వార్థము లేకుండ దానిని నడుపుచుండుట యనునది పరమ దయాళువైన ప్రభువునకే చెల్లును. అందువలన "తస్మై జ్యేష్ఠాయ బ్రహ్మణే నమః"

ఓమ్ శమ్

****

టిప్పణులు

౧. కర్మ సిద్ధాంతమునకు మూలాధారము

౧. ఈశ్వరుడు, జీవుడు, ప్రకృతియనబడునవి మూడు శాశ్వత నిత్యతత్త్వములు, పదార్థములు. అవి భూతభవిష్యద్వర్తమానకాలములలో స్వతంత్రములు, ఒకటికావు.

౨. జీవుడు అణుపరిమాణము గల ఏకదేశి, అల్పజ్ఞుడు. సుఖదుఃఖములు లేనివాడు. సర్వదా సుఖము గోరును. దానికై కర్మలొనర్చును. కర్మలొనర్చుటలో స్వతంత్రుడు. కర్మఫలము ననుభవించుటలో పరతంత్రుడు.

౩. కర్మఫలము లొసగువారు ఇరువురు (౧.) ఈశ్వరుడు (౨) జీవులు

౪. ఈశ్వరుడు న్యాయకారి, దయాళువు. అతడు కర్మలేనిదే ఫలమొసగడు. కర్మకన్న ఎక్కువగాని తక్కువగాని ఫల మొసగడు.

౫. ఈశ్వరుడు కర్తకే ఫలమొసగును. అతని వ్యవస్థలో కర్మఫలము తప్పదు. జీవులు ఇతరులకు కూడా ఫల మొసగుదురు. కర్మకన్న ఎక్కువగాని తక్కువగాని ఫల మొసగుదురు.

౬. జన్మలనేకములు. కర్మఫలము ప్రముఖముగ రానున్న జన్మలలో లభించును. కొంతవరకు ఈ జన్మలోనూ లభించును.

౭. కర్మఫలము, కర్మవిపాకము, కర్మప్రభావము వేరు. వాటిని తెలిసి యుండుట అవసరము.

౮. కర్మ, అకర్మ, వికర్మ గురించి తెలియుట అవసరము.

౯. ఒకప్రాణి మరియొక ప్రాణికి సుఖదుఃఖముల కలిగించును. అదియే ధర్మాధర్మము, పాపపుణ్యము, పరోపకారము, పరాపకారము.

౨. ఈశ్వరుని స్వీకరించక అతని వ్యవస్థను స్వీకరించిన ఎడల నష్ట మేమను ప్రశ్న అర్థము లేనిది. వ్యవస్థ వ్యవస్థాపకుడు వేరు కాదు.

౧. ఈశ్వరుని తెలిసికొననివాడు ఈశ్వరుని వ్యవస్థను పూర్ణముగ తెలిసికొనజాలడు. దాని కనుకూలముగ వ్యవహరించజాలడు.

౨. మానవుడు ఈశ్వరుని స్వీకరించుటయే గాదు. యమనియమాదుల నాచరించి

అతనిని సాక్షాత్కరించుకొనుటయు అనివార్యము. ఈశ్వరసాక్షాత్కారము కొరకు ప్రయత్నించిననాడే మానవుడు పూర్తిగా అతని వ్యవస్థను అనుసరించగలడు. అటుల అనుసరించిననాడే ఉత్తమ ఆరోగ్యవంతుడును పరోపకారియు కాగలడు. ఈశ్వరుని స్వీకరించుట యన కేవలము అతని వ్యవస్థను నమ్ముట గాదు. అతని యాజ్ఞను పాలించుచు అతనిని విస్మరించక అతని పవిత్ర స్వరూపము వలన ప్రేరణ పొందుచు తాను పవిత్రుడగుటయే అతని వ్యవస్థను స్వీకరించుట. అటుల అతని సాక్షాత్కారము చేసికొని ప్రణిధానము చేసిననాడే మానవుడు. సమస్త క్లేశములు, అనాచారము, పాపము, ద్రోహము, అన్యాయము, మోసము, ద్వేషము, స్వార్థము, పక్షపాతము, అకర్మణ్యత మున్నగు దుర్గుణములనుండి విడిపోగలడు.

3. ఈశ్వరుని స్వీకరించి ఉపాసించిననాడే మానవుడు అతని గుణములను తనయందు ధరించగలడు. ఉదా:- సమస్త ప్రాణులను ఆత్మవలె ప్రేమించుట, వాటికి ఉపకారము చేయుట, న్యాయము, దయ, నిర్భయత మున్నగునవి.

౪. ఒక ఈశ్వరోపాసకుని వలన ప్రపంచమునకు కలుగునంత మేలు ఈశ్వరోపాసన చేయని కోటానుకోట్ల మానవుల వలన కూడ కలుగదు. ప్రపంచమున అనేకులు పరోపకారులు జన్మించిరి. ప్రపంచమున కుపకారము చేసిరి. అది వారి ఈశ్వరోపాసన వలననే జరిగిన దని తెలిసికొనవలయును. ఈశ్వరోపాసనయే పరోపకారము. పరోపకారమే ఈశ్వరోపాసన. ఈశ్వరోపాసకునిలో కలుగు మొదటి మార్పు పరోపకారము. ప్రపంచములో మానవులవలన జరుగు పరోపకారము వారి ఈశ్వరోపాసనవలన జరుగునని తెలిసికొనవలయును. నాస్తికుడు, కిరాతకుడు కూడ ఒక్కొక్కప్పుడు పరోపకారము చేయును. అది అతని యందలి అవ్యక్తమైన ఈశ్వరోపాసనయే. పరోపకారము చేయుటకు కారణము పరోపకారియందలి దయాగుణమే. దానిచే ప్రేరితుడై ఆమానవుడు పరోపకారము చేయును. ఆ పరోపకారము వలన కర్తకు ఆత్మలో ఆనందానుభూతి కలుగును. అధికానందము కొరకు ఆ పరోపకారి అధికముగ పరోపకారము చేయును. దానిచే కలుగు ఆ ఆనందమే ఈశ్వరుడు. ఆ ఆనందప్రాప్తియే ఈశ్వరోపాసన. అట్టి ఈశ్వరోపాసకులు

గల దేశము, సమాజము శాంతికి నిలయ మగును. కావున ఈశ్వరుని ఉపాసించుట అనివార్యము.

౫. ప్రతి ప్రాణి సుఖము గోరును. దుఃఖరహిత సుఖమును గోరును. అట్టి సుఖము కేవలము ఈశ్వరునియందే గలదు. అటులనే ప్రాణి దుఃఖమును వదలగోరును. ఈ రెండు కోరిక లీశ్వరోపాసనవలననే సిద్ధించును. అది గాక మరియొక ఉపాయమే లేదు.

౬. . ఈశ్వరుని ఉపాసించుటవలన కలుగు ఆనందము సాటిలేనిది. ఒకసారి దానిని అనుభవించినవాడు దానిని వదలి చక్రవర్తి రాజ్యమును కూడా ఇష్టపడడు. కావున ఆరోగ్యము, సుఖము, సమస్త ప్రపంచమున శాంతి, సర్వప్రాణుల హితము గోరువాడు ఈశ్వరుని స్వీకరించుటయే గాదు అతని సాక్షాత్కారము కొరకు జీవితమునే లక్ష్యముగ స్వీకరించవలయును.

3. చనిపోయిన వారి కర్మలు కారణ మనుటకు ఆధారము లేదు. వేదాది శాస్త్రాలలో ఒక ప్రమాణము గూడ లేదు. వ్యవహారములో ఎవరు నమ్మరు. ఇది కేవలము కొందరు ఆత్మసంతోషము కొరకు పుస్తకములలో వ్రాసికొను వరకే సీమితము. గతించినవారి మరణమునకు తమ కర్మలే కారణ మందురేని వారందరి కర్మలు సమానముగ నుండెనా? ఏలన వారికి ఒకేవిధమైన మృత్యువు సంభవించినది గదా ? దానికి ప్రమాణ మేమి ? అమెరికా చేత ఈరాక్ పైన ఆక్రమణ జరిగినపుడు ఈరాకీయులు వేలమంది చనిపోయిరి గదా? చనిపోయినవారి కర్మలు సమానముగా నుండెనా ?

ఈరాక్ అధ్యక్షుడు సముద్రములో చమురు (పెట్రోలు) పారబోయించగా వేలాది సముద్ర జంతువులు చనిపోయినవి గదా! వాటి కర్మలు సమానముగ నుండెనా ?

ఒక్కొక్కసారి లోకవాహనము నదిలో పడిపోవును. అందులో నుండు జనులెల్లరు చనిపోవుదురు. అందు మూడునెలల శిశువులు కూడ చనిపోవుదురు గదా ! వారి కర్మలు సమానమేనా ?

పొగబండ్లు ఢీకొనును. దానివలన వందల జనులు చనిపోవుదురు.

వారి కర్మలు సమానమేనా ? పొగబండ్ల పట్టాలు తప్పించుట చేతను కొందరు చనిపోవుదురు. వారి కర్మలు సమానమేనా ?

(౭౮) డెబ్బది ఎనిమిది సంవత్సరముల క్రితము పంజాబు రాష్ట్రమున జలియన్ వాలా బాగ్ లో స్వాతంత్ర్యముకొరకు సభ చేయుచున్న జనులను డయ్యరు మున్నగు ఆంగ్లేయులు రక్షకభటుల ద్వారా గుర్రములతో త్రొక్కించి చంపిరి, తోపులచే కాల్చి చంపిరి. చనిపోయినవారి శవములను ప్రక్కనే ఉన్న గోతిలో పారవేసిరి. ఆ చనిపోయినవా రందరి కర్మలు సమానమేనా ?

కిలారీ భూకంపమువలన వేల ప్రజలు నిమిషాలలో చనిపోయిరి. వారందరి కర్మలు సమానమేనా ?

మీ అభిప్రాయము ననుసరించి హిరోషిమాపైన బాంబు విసరగా చనిపోయినవారు తమ కర్మలవలన చనిపోయిన ఎడల బాంబుద్వారా వారి కర్మలకు సరియైన ఫల మొసగిన వారికి (బాంబులు విసరినవారికి) బహుమాన మివ్వవలయును గదా ! వారిని నిందితులని అనడ మేల ?

వాస్తవముగ కర్మసిద్ధాంతముననుసరించి బాంబు విసిరిన వారి ప్రయత్నము కారణము. చనిపోయినవారిలో కొందరు దోషు లున్నప్పటికి అందరు దోషులు కారు. చనిపోయిన వారు తమ కర్మవలన చనిపోయి రనుకొనుట నిరాధారము. దానిలో నిర్దోషులు కూడా చనిపోయియుందురు. అందువలన బాంబులు విసిరినవారికి పాపము లభించును.

౪. మానవుడుగా, శునకముగా, పిల్లిగా జన్మించుట యోనివిశేషము. జాతి కాదు. జాతి యనగా జన్మ. మహర్షి వ్యాసుడు యోగదర్శనమునకు భాష్యము వ్రాయుచు జాతియనగా జన్మ యని పేర్కొనెను.

జాతి యను శబ్దమున కనేకార్థములు గలవు. గోవు, అశ్వము మున్నగునవి జాతి యనబడును. ఈ అర్థము ఈ సూత్రార్థములో వర్తించదు. నేను వ్రాసినటులనే గ్రంథములో ముందు జాతి యనగా జన్మయని పేర్కొనియున్నాడు.

౫. దుఃఖ మనగా గుణవృత్తి విరోధ దుఃఖము. ఏలన ప్రపంచము

నందలి సుఖము లన్నియు దుఃఖములు గలిగి యున్నవి. మొదటిది పరిణామ దుఃఖము, రెండవది తాపదుఃఖము, మూడవది సంస్కార దుఃఖము, నాలుగవది గుణవృత్తి విరోధ దుఃఖ మని యర్థము.

౬. పైన టిప్పణిలో కర్మ సిద్ధాంతమున కాధార మను విషయములో కర్మఫల మొసగువా రిరువురు: ఒకటి ఈశ్వరుడు రెండవది మానవు డని వ్రాయబడినది. ఒక కుటుంబములో ఒకడు ప్రముఖు డుండును. ఇతరులు అతనికి సహకరింతురు. అటులే గ్రామమున గ్రామాధికారి, మండలమున మండలాధికారి, ప్రదేశమున ముఖ్యమంత్రి, దేశమున ప్రధానమంత్రి ఉండును. వారు తమ తమ క్షేత్రమున ఒకరి నొకరు పీడించకుండునటుల ప్రయత్నింతురు. అపరాధము చేసినవారిని శిక్షింతురు. వేదము మొదలుకొని సత్యార్థ ప్రకాశమువరకు గల వేల ధర్మ శాస్త్రములలో శిక్ష=దండన విధానము పేర్కొనబడినది. దాని ననుసరించియే సమస్త ప్రపంచమున ధర్మశాస్త్రములు వెలసినవి. ప్రస్తుతము ప్రపంచమునందలి సమస్త దేశముల రాజ్యాంగములలో దండ విధానము గోచరించుచునే యున్నది.

అనుదినము మనము ప్రపంచములో బాలురపైన, స్త్రీలపైన, బీదలపైన, ప్రత్యర్థులైన నాయకుల పైన అత్యాచారములు, మానభంగములు మున్నగు దుఃఖదాయకములగు కర్మలు జరుగుచునే యున్నవి. ఒకవేళ అవి యన్నియు కర్మఫలములే యైనచో దండవిధాన మెందులకు ? వేదములో దొంగల నాయకుని శిక్షించి చంపవలయునని విధించబడినది. దొంగలవలన ఎవరికి దుఃఖము కలుగనేరని ఎడల వేదములో శిక్ష ఎందులకు విధించబడినది? మా ఆవును గాని గుర్రమును గాని మానవుని గాని నీవు చంపితి వేని నిన్ను సీసపుగోలితో చంపుదు నని సూచించవలయు నని మానవులకు వేదములో ఆదేశించబడినది. దీనిచే ఒకరివలన ఒకరికి దుఃఖములు లభించునని తెలియుచున్నది.

మానవుడు ఇతరులకు సుఖదుఃఖములు, హాని లాభములు కలిగించు నని మనుమహర్షి పేర్కొనుచున్నాడు:-

గురుం వా బాలవృద్ధౌ వా బ్రాహ్మణం వా బహుశ్రుతం ।
ఆతతాయినమాయాంతం హన్యాదేవావిచారయన్ । ౮ - ౫౦ ॥

గురువు, బాలుడు, వృద్ధులు, విద్వాంసుడైన బ్రాహ్మణుడు ఎవరైనా కావచ్చును, ఆతతాయిని ఆలోచించక పూర్వమే చంపవలయును. చంపిన తరువాత ఆలోచించవలయును.

నా౽తతాయివధే దోషో హంతుర్భవతి కశ్చన ॥ ౮ - ౩౧ ॥

ఆతతాయిని చంపినవానికి ఏ పాపము లభించదు.

వాగ్దుష్టాత్తస్కరాచ్చైవ దండేనైవ చ హింసతః ।
సాహసస్య నరః కర్తా విజ్ఞేయః పాపకృత్తమః ॥ ౮ - ౪౫ ॥

దొంగ, తప్పు చేయకుండగనే దండించువాడు, బలాత్కారము చేయువాడు ఈ మూడు విధముల పాపము చేయువారికన్నా దుర్భాషలాడువాడు అధిక పాపాత్ముడు.

న మిత్ర కారణాద్రాజా విపులాద్వా ధనాగమాత్ ।
సముత్సృజేత్ సాహసికాన్ సర్వభూతభయావహాన్ ॥ ౮-౪౭ ॥

బలాత్కారముచేయువాడు మిత్రుడైనా అతని వలన పుష్కల ధనము లభించు అవకాశమున్నా సకల ప్రాణులకు భీతిని కలిగించు బలాత్కారము చేయువానిని రాజు శిక్షించక వదలగూడదు.

ఆతతాయి యొక్క లక్షణములు వసిష్ఠ ధర్మశాస్త్రములో నిటుల పేర్కొనబడినవి.

అగ్నిదో గరదశ్చైవ శస్త్ర పాణిర్ధనాపహః ।
క్షేత్రదారహరశ్చైవ షడేతే హ్యాతతాయినః ॥ 3 - ౧౬ ॥

గృహములను తగులబెట్టువాడు, విషదాత, శస్త్రాస్త్రములను చేతబూని నిరపరాధులకు హానికలిగించువాడు, భూమిని ఆక్రమించువాడు, స్త్రీలను అపహరించువాడు ఈ ఆరుగురు ఆతతాయులనబడుదురు.

ఇటువంటి ప్రమాణములు కోకొల్లలు. ఇటువంటివారిచే ఎవరికి అపకారము జరగదనుకొనుట అజ్ఞానమే.

ఒక ఆవు యొక్క ఒక్క తరమువలన ౪౭౫౬౦౦ నాలుగు లక్షల

డెబ్బది ఐదువేల ఆరువందల మానవులకు ఒకసారి భోజనము లభించును. దానిని చంపుటవలన దాని మాంసముచే దాదాపు ౮౦ ఎనుబది మంది మానవులకు ఒకసారి భోజనము లభించును. కావున గోహత్య చేయగూడ దని మహర్షి దయానందుడు విక్టోరియా రాజ్యకాలమున గోవధను మాన్పుటకు ప్రయత్నించెను. నిరపరాధులైన ఆవులను చంపువాడు ఆవులకు అపకారము చేయుట లేదా ?

మానవులు పరస్పరము దుఃఖమును కలిగించిన ఎడల ఈశ్వరుని వ్యవస్థ భంగమగుననుట, నిరపరాధియైనవానికి దుఃఖమెందులకు లభించవలయు ననుట సారహీనము, నిరాధారము.

ఆంగ్లేయులు భారతీయులపైన జరిపిన కిరాతక చర్యలను వర్ణించుటకు అలవి కాదు. ఉదా:- పట్టుపనివారిని సాధ్యము కానంత పని చేసి ఇవ్వుడని కోరుట, అది సాధ్యము కాక కొంత తక్కువ పని చేసినపుడు వారి ఇంటి లోని వస్తువులను వేలం వేసి ధనము తీసికొనుట జరిగినది. ఆ బాధలను సహించలేక కొందరు తమ బొటన వ్రేళ్ళను నరికి వేసికొన్న ఘట్టములు గలవు. ఆంగ్లేయులు తెల్లటివారా నల్లటివారా స్పష్టము. దీనిని తెలిసియుండియు ఈశ్వరుని వ్యవస్థలో నిరపరాధులైనవారిని ఎవరు బాధపెట్టలేరనుట అతివిచిత్రమే.

ఋషి దయానందుడు నిరపరాధియే గదా ! ఆయనకు ఎందులకు విషమివ్వబడినది ? విషముచే ఆయన మరణించ లేదా? అది ఋషి దయానందుడు చేసిన కర్మ ఫలమా ?

వందల క్రాంతికారులను చంపిన ఆంగ్లేయులు క్రాంతికారులకే కాక ఈ దేశవాసులకు బాధ కలిగించినవారు కాలేదా ?

ఒకానొకడు ఒకానొకనికి బాధ కలిగించడేని ప్రపంచములో పాపము లుండగూడదు గదా ! పాపము దేని నందురు ? లోకములో అన్యాయ మని దేని నందురు ? దండవిధాన మెవరికి ? ఎందులకు ?

వీటిని బట్టి పరస్పరము దుఃఖములు కలుగజేయుదురని స్పష్ట మగుచున్నది. కావున అన్యాయముచే చంపబడినవానిని అతడు తన కర్మచే చనిపోయె ననుకొనుట మిథ్యా , భ్రాంతి, అజ్ఞానము.

౭. మానవులు కర్మజేయుటలో స్వతంత్రులు గదా ! వారు నిరపరాధులకు బాధ కలిగించ జాలనపుడు ప్రపంచమున అన్యాయముండ గూడదు గదా! మానవుల స్వేచ్ఛాచారిత్వమును ఈశ్వరునిపై మోపడ మెందులకు ? మానవులు పరస్పరము చేసికొను అపకారమును, అన్యాయమును ఈశ్వరుని వ్యవస్థ దోషమనుట ఎటుల పొసగును? ఈశ్వరుడు ఎవరికి బాధ కలిగించడు. కాని మానవు లటుల కాదు. మానవులు ఒకరికొకరు బాధ కలిగించుకొందురు. కలిగించ గలుగుదురు. దీనిని ఈశ్వరుని వ్యవస్థలోని దోష మనుకొనుటలో ఏ ప్రమాణము లేదు. కావున జీవులు కర్మ జేయుటలో స్వతంత్రులగుటచే ఈశ్వరుని వ్యవస్థలో పరస్పరము దుఃఖములు కలిగించుకొనగలరు. మానవులు చేసికొను కర్మలలో ఈశ్వరుని వ్యవస్థ దోషమనుకొనుట ఈశ్వరుని వ్యవస్థను సరిగా తెలిసికొనకపోవుటయే.

౮. తల్లిదండ్రులు, గురువులు హితచింతకులు, ఉపకార మొనర్తురు. దానివలన సంతానము శిష్యులు మున్నగువారికి హితము జరుగును. మాతా పితరులు పిల్లల కుపకారము చేయజాలరనుట తనను తాను నమ్మకపోవుటయే. శత్రువు లపకారము చేయజాల రనుట మిథ్యయే. భారత పాకిస్తానుకు యుద్ధము జరుగలేదా? పాకిస్తానీయులు పంజాబులో తీవ్రవాదమును నడిపించుటలేదా ? వేలమంది నిరపరాధులను నిర్దాక్షిణ్యముగా చంపుట లేదా? బాల కార్మికుల ముక్తి వలన బాల కార్మికులకు హితము జరుగుట లేదా? వరకట్నము పేర అనేక స్త్రీలను చంపుట లేదా? చంపబడిన ఆ స్త్రీలకు భర్తలో, అత్తమామలో అపకారము చేయలేదా ?

పరస్పరము హాని, అపకారము, బాధ కలిగించజాలరేని సీమ (భారత పాకిస్తాన్ సరిహద్దు) ప్రాంతమున సైన్యము నుంచనేల? రక్షకభటు లెందుకు ? దొంగలకు భయపడనేల ?

౯. మానవు డనుభవించు దుఃఖము తన కర్మఫల మనుకొనుట కాధార మేమియు లేదు. ఉదా:- ఒక గజదొంగ రాత్రి ఒక ధనికుని గృహమున ప్రవేశించి ఎదురు వచ్చినవారిని కాల్చి చంపి ధనము దొంగిలించుకొని పారిపోవును. దానివలన

కుటుంబీకులు బాధ పడుదురు. కుటుంబీకులకు కలిగిన ఈ బాధకు కారణము ఆ కుటుంబము వారేనా? దొంగ కాదా? కాదేని ఆ ఇంటివారు ఆదొంగను పూలమాలతో ఊరేగింపు ద్వారా గౌరవించవలయును. గోహత్యనిరోధముకొరకు ప్రయత్నించకూడదు. భారత ప్రభుత్వము సైన్యమును పోషించగూడదు. సైన్యము అనవసరమే కదా! చికిత్సాలయము లవసర ముండవు. చికిత్సాలయములను స్థాపించుట అజ్ఞానము. న్యాయాలయము లనవసరము. ఇండ్లకు తలుపులు, తాళము లనవసరము. కారావాసము లవసర ముండవు. దీని నెవరేని స్వీకరింతురా? ఇది కర్మసిద్ధాంతమా? లేక అకర్మణ్యుల సిద్ధాంతమా? ఇది తత్త్వశాస్త్రమా? లేక తత్త్వము లేని శాస్త్రమా?

౧౦. కర్మఫల సిద్ధాంతము ఈశ్వరకృతము. కాని పరస్పరము ఒకరినొకరు బాధ కలిగించజాల రనునది ఈశ్వరకృతము కాదు. ఇది కర్మఫలసిద్ధాంతము కాదు. ఇది వేదము మొదలుకొని సత్యార్థప్రకాశము వరకు గల సమస్త ధర్మశాస్త్రములకు విరుద్ధము. వ్యవహారమునకు విరుద్ధము.

౧౧. పూర్వము కర్మ సిద్ధాంతమున కాధారమను విషయములో ఒక విషయము పేర్కొనబడినది. అందులో తెలిసికొనవలసిన కొన్ని అంశములు గలవు. ౧. కర్మ. ౨. భోగము.

౧. కర్మలు:- వ్యవసాయము, కూలి, దానము, అధ్యయనము, అసత్యము చౌర్యము మున్నగునవి.

౨. భోగములు:- నిద్రించుట, అన్నపానాదులు గ్రహించుట మున్నగునవి.

కర్మఫలము గురించి ఆలోచించునపుడు (క) కర్మవిపాకము (ఖ)కర్మఫలము (గ) కర్మ సంస్కారము గూర్చి స్పష్టముగా తెలిసికొనవలయును. వీటిని స్పష్టముగా తెలిసికొనని వ్యక్తి కర్మసిద్ధాంతమును పూర్తిగా తెలిసికొనజాలడు. అందుచే అనేకవిధముల భ్రాంతులకు, అనర్థములకు గురియగును. వీటిగూర్చి సంక్షిప్తముగా వ్రాయుచున్నాను.

(క) కర్మవిపాకము:- ఈశ్వరునిచే లభించు కర్మఫలము కర్మ విపాక మనబడును. అది కర్తకే లభించును. జీవునిచే లభించు విపాకము ఇతరులకు కూడ లభించవచ్చును.

(ఖ) కర్మఫలము:- ఇది కర్తతో పాటు ఇతరులకు కూడా లభించును.

ఉదా:- ఋషి దయానందుని ఉపన్యాసము కర్మ. దానివలన ౯౫% జనులు ఆయన కనుకూలము కాగా ౨ % జనులు ఆయనకు శత్రువు లగుదురు. ౨% జనులు తటస్థులుగా నుందురు. ౧% జనులు ఆయనను చంప ప్రయత్నింతురు. కర్మ ఒకటే దాని పరిణామము అనేక విధములు. దానినే కర్మఫలమందురు. అధి కర్మవిపాక మనబడదు. సామాన్యముగా జనులు కర్మవిపాకమును కర్మ ఫలమందురు. వీటి భేదమును సరిగా తెలిసికొనవలయును. కర్మఫలము కర్తకే గాక ఇతరులకు కూడ లభించును.

వేరొక ఉదాహరణము :- ఒకదొంగ ఒకానొక ధనికుని ఇంటిలో ప్రవేశించును. అందలి ధనికుని చంపును. ధనము తీసికొని పారిపోవును. దొంగతనము, హత్య ఒక కర్మ. దాని ఫలము ధనప్రాప్తి, హత్య. ధనము దొంగకు లభించగా హత్య ధనికునికి లభించును. ఇది ఫలము. ఇట్టి ఫలమును కర్మ పరిణామ మందురు. ఇది కర్మ విపాకము కాదు. దొంగ పట్టుబడినపుడు న్యాయాధీశునిచే లభించు కర్మఫలము లేదా ఈశ్వరునిచే లభించు కర్మఫలము కర్మవిపాక మనబడును. లోకమున అది కర్మఫల మనబడును. నిర్దోషియైన ధనికుని హత్య అతని కర్మవిపాకము కాదు. దొంగ చేసిన కర్మకు ఫలము దొంగ నేరమునకు పరిష్కార రూపమున న్యాయాధీశునిచే గాని, ఈశ్వరునిచే గాని లభించునదే కర్మవిపాక మనబడును. న్యాయాధీశునివలన లభించు కర్మవిపాక (ఫల)ములో అనేక లోపము లుండవచ్చును. కాని ఈశ్వరునివలన లభించు కర్మఫలమున లోపము లుండవు. ఆ కర్మవిపాకము కర్తకే లభించును. తప్పక లభించును. ఇందులో సందేహము లేదు. మానవులచే లభించు కర్మవిపాకము కర్తకు లభించవచ్చును, అకర్తకు లభించవచ్చును. ఎవరికి లభించకపోవచ్చును కూడ.

౧౨. ఒకరు చేసిన కర్మఫలము వేరొకరికి లభించు నని పూర్వము పేర్కొంటిని ఉదాహరణ సహితముగా నిరూపించితిని. దానిని నమ్మకపోవుట వలన కలుగు అనర్థములను గూడ పేర్కొంటిని.

౧౩. తమ సుఖమును, దుఃఖము నివ్వజాలరు. కాని తమ సుఖసాధనముల, దుఃఖసాధనముల నివ్వగలరు, ఇచ్చుచుందురు. చూడుడు - కొందరు న్యాయార్జిత ధనమును దానము చేయుదురు. దానము చేయుమని వేదాది శాస్త్రములు బోధించుచున్నవి. ప్రతివ్యక్తి దానము చేయుచునే యుండును. జలదానము, అన్నదానము, భూదానము, గోదానము, విద్యాదానము ప్రసిద్ధము. అనేక సంస్థలు, గురుకులములు, శుభకార్యములు, పుస్తకముల ముద్రణ దానమువలననే జరుగుచున్నవి.

వంచకులవలన ఒక్కొక్కరి ప్రాణనాశనమే కాక వేల జనుల ప్రాణనాశనము జరుగుచునేయున్నది. ప్రత్యక్షమునకు వేరొక ప్రమాణ మే మవసరము. వేదము కూడ ఆవును తదితర పశువులను చంపగూడ దని ఉద్ఘోషించుచున్నది. ఈ వేద సిద్ధాంతము నర్థము చేసికొనని వారు తమను రక్షించుకొనజాలరు. దేశమును రక్షించజాలరు. ఇట్టి వారివలననే దేశము పరాధీనమగును.

౧౪. ఇది కేవలము ఛలమే. హంతకుడు హత్యలో ఒకా నొకప్పుడు సఫలత సాధించకపోవచ్చును. చాలావరకు సాధించును. దొంగ పలుమారులు దొంగతనము చేసి పట్టుబడడు. ఒకానొకప్పుడు మాత్రమే పట్టుబడును. దొంగ తన ప్రయత్నములో సఫలత సాధించకున్న ఎడల ప్రపంచములో దొంగ లుండెడివారు కారు. హత్యలో సఫలత లభింపకున్న ఎడల ప్రపంచములో హత్యలు జరిగెడివి కావు.

౧౫. అహితము చేయగోరువాడు కొంతవరకు చేయునని వ్రాయుచు స్వయముగా గ్రంథకర్త ఇచట మందస్వరముతో కర్తకు గాక వేరొకనికి కర్మఫలము లభించు నని స్వీకరించుచున్నాడు. ఇది ఒప్పుకొనక తప్పదు. రాజ్యవ్యవస్థ ఒకదినము జరుగదు. ప్రభుత్వము ఒకదినము మనుగడ సాగించజాలదు. పుస్తకములు వ్రాయుట, ఇతరుల కుపదేశము చేయుట చాల సరళము. కాని ఒక దినము ఆచరించి చూపించిన ఎడల దీని నిస్సారత తెలియును.

౧౬. ఇతరులకు అపకారము తలపెట్టియు అపకారము చేయజాల డని పలుకుట ప్రతిజ్ఞ మాత్రమే. ఆంగ్లేయులు భారతీయులకు అపకారము చేయలేదా? భగత్ సింహ, రాంప్రసాద్ బిస్మిల్ వంటి దేశమునకే గర్వకారణ మైన లెక్కకు మించిన ఆర్యవీరులను ఉరిశిక్ష వేసి చంపలేదా ? ఈ గ్రంథకర్త ననుసరించి ఇవి క్రూర కర్మలు కావని ఉరిశిక్షలకు కారణము ఆ క్రాంతికారులు చేసిన క్రాంతి పాప మనియు తెలియుచున్నది. రాంప్రసాద బిస్మిల్, భగత్ సింహ, సుఖదేవ, రాజగురు, అశఫాకఉల్లాఖాన్, రాజేంద్ర లాహిరి, రోశన్‌సింహ, ఖుదీరాం బోస్ మున్నగు వారికి ఆంగ్లేయులచే ఉరిశిక్ష విధించబడినది. ఈ గ్రంథకర్తననుసరించి వీరందరు చంపదగిన దుష్కర్మలు చేసినవారు. వీరిని చంపవలసి యుండెను. ఆంగ్లేయులు ఉరిశిక్ష విధించని ఎడల భారతీయులు వీరిని ఉరిశిక్ష వేసి చంపవలసియుండె నని తెలియుచున్నది. ఋషి దయానందుడు, వినాయక దామోదర సావర్కర్, సుభాష చంద్రబోసు మున్నగువారు ఎవరికి ఏమాత్రము ఉపకారము చేయలేదనియు తెలియుచున్నది. ఇది వైదిక సిద్ధాంతము కాదు. కర్మసిద్ధాంతము కాదు. ఇది కర్మసిద్ధాంతము పేర అకర్మ సిద్ధాంతము. అకర్మణ్యుల సిద్ధాంతము.

౧౭. దొంగ చేసిన దొంగతనమునకు ప్రభుత్వముయొక్క అన్యాయము కారణము గాదు. ప్రభుత్వము అసమర్థత కొంతవరకు కావచ్చును. దొంగను పట్టకపోవుట, పట్టి శిక్షించకుండుట ప్రభుత్వముయొక్క దోషమే.

ఈశ్వరుని వ్యవస్థయు అటులనే యుండును. దొంగను చేయి పట్టుకొని దొంగతనము చేయకుండునటుల నిరోధించుట=నిలిపివేయుట ఈశ్వరుని కర్తవ్యము గాదు. ఈశ్వరుడు ఆవిధముగా మంచి చెడులు చేయువానిని నిరోధించడు. కర్మ తరువాత తప్పక ఫల మొసగును.

చంపినవానికి ఈశ్వరుని వైపు నుండి శిక్ష లభించవచ్చును గాక ! చంపబడిన వానికి కలిగిన దుఃఖమునకు బాధ్యులెవ రనునది ప్రబలప్రశ్న. అంతమాత్రముననే చనిపోయినవాని దుష్కర్మయే కారణమనుట నిరాధారము, అప్రామాణికము.హంతకుని చేత జరిగిన హత్యను కారణము కాదనుట కర్మసిద్ధాంతము కాదు.

"హతుడు పూర్వజన్మములో ఒకానొకనిని హత్య చేసియుండవచ్చును. దానికిది ఫలము. హంతకుడు నిమిత్తమాత్రమే" యందుమేని ఆ హంతకుడు కూడ పూర్వజన్మలో ఇతరులను చంపజాలడు గదా! చంపియుండె నని ఎటుల ఊహించుచున్నారు ? ఎటుల నమ్ముచున్నారు ?

హతునికి భగవంతుడు రక్షంచుకొనుటకు బుద్ధి, వాక్కు, శరీరము మున్నగు సాధనములనొసగి యున్నాడు గదా ! ఈ సాధనములు ఆత్మరక్షణకే కాని ఎడల మరి ఎందుల కొసగబడెను ?

దీనితో హతుని హత్యకు హంతకుడు నిమిత్త మాత్రము కాదు, కారణ మని ఋజువగుచున్నది.

ఒకవేళ హంతకుని నిమిత్తమాత్రు డందురేని అతనికి చంపబడువానిని ఎపుడు ఎచట ఏ విధముగా ఎంత సమయములో చంపవలయు నని ఎటుల తెలిసెను ? ఈశ్వరుడే హతుని చంపవలసి యున్నదని ప్రేరేపించి హతుని సమీపమునకు హంతకుని పంపెనా ? ఔనందురేని విలుప్త వైదిక పునరుద్ధారకుడు భారత స్వాతంత్ర్య ప్రథమ సందేశవాహకుడు యుగనిర్మాతయు నైన మహర్షి దయానందుని చంపినవారు ఆయన కర్మఫల మొసగుటకు వచ్చినవారేగదా !

ఋషి దయానందుని పాపకర్మల ననుభవింప జేయుటలో విషదాతలు నిమిత్త మాత్రులే గదా? ఇది కర్మఫల సిద్ధాంతమా? ఇందులో కర్మకు, ఫలమునకు సంబంధము గోచరించుచున్నదా? ప్రత్యక్షమునకు ఆగమప్రమాణమునకు విరుద్ధ మగుటచే ఇది అపసిద్ధాంతము. ఇది కర్మసిద్ధాంతము కాదు. కర్మబాహ్య సిద్ధాంతము.

౧౮. వైదిక సాహిత్యమునం దంతట త్రివిధ దుఃఖముల గూర్చి పేర్కొనబడినది. అందొకటి ఆధిభౌతికము. ఇతర ప్రాణుల వలన కలుగు బాధలనుండి రక్షించు మని భగవంతుని ప్రార్థించుట జరుగును. ఇతర ప్రాణులనుండి ఈశ్వరుని వ్యవస్థ ననుసరించి బాధయే లేనపుడు ప్రయత్న మెందులకు? ప్రార్థన ఎందులకు? అట్టి ప్రార్థనలను మహర్షులెందుకు విధించిరి? అవి వేదములలో ఎందుకు వ్రాయబడినవి ?

ఆలోచించవలసిన విషయ మొకటి. చంపబడినవానికి రక్షించుకొనుటకు సాధనము లెందుల కివ్వబడినవి? ప్రతి మానవునికి సాధనము లెందుల కివ్వబడినవి. ఈశ్వరుని వ్యవస్థలో నిరపరాధులకు ఇతరులచే ఏకీడు జరుగదు గదా? జరగకుండుటకు ప్రార్థన లేల? రక్షణకు సాధనము లేల ?

౧౯. శత్రువులను వధించుటకు తీవ్రమైన శస్త్రాస్త్రములను సిద్ధము చేసికొను మని వేద మెందుల కాదేశించుచున్నది? వేద మనగా ఈశ్వరుని ఆదేశమే కదా ?

ఇతరులచే అపకారము, మృత్యువు సంభవించినపుడు సైన్యమెందులకు? శస్త్రాస్త్రము లెందులకు? ప్రయత్న మెందులకు? ప్రార్థన లెందుకు ?

౨౦. పరస్పరము అపకారము ఉపకారము చేసికొనజాలరని నమ్మేదుమేని క్రింది ప్రశ్నలకు సమాధానములు తెలిసికొనవలయును.

౧. ఆధునికులు నిరపరాధులైన కప్పలను చంపుచున్నారు. వాటి కాళ్ళను ఎగుమతి చేయుచున్నారు. ఇందులో ఏమి దోషము ? ఎందులకు ?

౨. గోవులను, పశువులను, కోళ్ళను, కుందేళ్ళను, పందులను, చేపలను వధించుచున్నారు. విదేశముల కెగుమతి చేయుచున్నారు. ఇది సత్కర్మనా? దుష్కర్మనా? ఎందులకు ?

3. బలాత్కారాలు, మానభంగాలు, హత్యలు జరుగుచున్నవి. ఇందులో ఏ దోషముండ గూడదు గదా? ఇవి పరాపకార, అన్యాయ, పాప్ కర్మలు కావా? ఎందులకు? పరోపకారము, పరాపకారము, పాపము, అన్యాయ మనగా నేమి? ఎందులకు? హింసయనగా ఇతరులకు బాధ కలిగించుటయే కదా? బాధయే కలుగని ఎడల దానిని వదులుట యనగా నేమగును ?

యోగశాస్త్రము మున్నగు గ్రంథములలో హింస శారీరక, వాచిక, మానసిక మని, చేసిన, చేయించిన, బలపరచిన హింస యని, మాంసము, చర్మాదుల కొరకు జరుగు లోభపూరిత హింసను, క్రోధముతో జరుగు హింసను, మోహముతో జరుగు పశుబలి మున్నగు వాటిని శాంతిని కోరువాడు వదలి వేయవలయు నని వ్రాయబడినది. అట్లే దొంగతనము త్యాజ్య మని ఇటువంటి ఇతర అనేక నియమములు విధించబడినవి. వీటివలన ఇతరులకు అపకారము జరుగుననియే

గదా ఇవి నిషేధించబడినది? కావున ఇతరులవలన దుఃఖము లభించదనుకొనుట నిరాధారము, నీతి బాహ్యము. జరుగు పాపములకు, అత్యాచారములకు ఈశ్వరుడు కారణము గాదు. దుష్టులను దుష్టత నుండి ఈశ్వరుడు కూడా చేయి పట్టుకొని ఆపడు. ఈ పక్షములో దుష్టులే ఉండరు గదా! దుష్టు లెవరు? ఎందులకు?

ఈశ్వరుడు సర్వ శక్తిమంతుడనగా అన్యాయము చేయువానిని చేయి పట్టుకొని ఆపునని కాదు. సృష్టిని నిర్మించుటలో, పాలించుటలో, ప్రళయము చేయుటలో ఎవరి సహాయము అవసరము లేనివాడగుటచే అతనిని సర్వశక్తిమంతుడందురు.

సర్వజ్ఞుడనగా సర్వము తెలిసినవాడు. జీవుడు కర్మ చేయనంతవరకు ఈశ్వరుడు అతనిని శిక్షించజాలడు. సర్వహితైషియైన ఈశ్వరుడు జీవుని కర్మ స్వాతంత్ర్యములో విఘ్నము చేయజాలడు. కావున జీవులు పరస్పరము ఉపకారాపకారములు చేయుదురు. సుఖదుఃఖముల ననుభవింతురు.

౨౨. మానవునికి లభించు సర్వవిధముల మృత్యువు ఈశ్వరునివలననే యనుకొనుట నిరాధారము. ఆత్మహత్యలు, హత్యలు ఈశ్వరుని వ్యవస్థ గాదు. ప్రతి మృత్యువు ఈశ్వరుని వలననే జరుగునేని జీవించగోరుమని ఈశ్వరుడు యజుర్వేదము (౪౦/౨) లో ఏల ఆదేశించినాడు? మానవుని చంపినవానిని సీసము(గోలి)తో చంపవలయు నని ఎందు కాదేశించినాడు? ఈమంత్రమును బట్టి మృత్యువు ఈశ్వరుని వ్యవస్థ కాదని తెలియుచున్నది. మృత్యువు ఈశ్వరుని వ్యవస్థానుసారము జరుగునేని అందరు సంతోషించవలసినదే. గ్రంథకర్త ఆలోచనను బట్టి హంతకులచే, ఉగ్రవాదులచే జరిగిన మృత్యువు గూడ ఈశ్వరుని వ్యవస్థయే. కావున హంతకులను, ఉగ్రవాదులను దానమానములచే సమ్మానించవలయును. ఇది వైదిక ధర్మమును ఎగతాళి చేయుటయే గాని కర్మఫలసిద్ధాంతము గాదు. ఇటువంటి వారివలననే దేశము పరాధీనమైపోయినది.

౨౩. గ్రంథకర్త ఇంతకు క్రితము పరస్పరము అపకారము గాని, ఉపకారము గాని చేయ రని ప్రతిపాదించియున్నాడు. ఇచట ఒకడు ఇంకొకనిని

అన్యాయముగా చంపు నని ప్రతిపాదించుచున్నాడు. ఇది పరస్పర విరుద్ధము. పరస్పరము హాని లాభములు, సుఖదుఃఖములు జరుగు ననునదియే వేద సిద్ధాంతము, వ్యావహారికము, లోకసమ్మతము.

౨౪. గ్రంథకర్త ననుసరించి ఒకరికొకరు సుఖదుఃఖము కలిగించుకొనరు గదా. చంపుదురేని సుఖదుఃఖములు కలిగించగలరని ఋజువగుచున్నది. ఇది పరస్పర విరుద్ధము.

౨౫. గ్రంథకర్త అభిప్రాయముననుసరించి ఒకరిచే ఒకరికి సుఖదుఃఖములు లభించవు గదా. ఇపుడు లభించుననుట ఎంత విరుద్ధము? ఇది కర్మసిద్ధాంతము కాదు. ఒకరికొకరు సుఖదుఃఖములను కలిగింతు రనునదే వేద సిద్ధాంతము.

౨౬. ఈశ్వరీయ వ్యవస్థలో నిరపరాధికి దుఃఖము లభించదు. లభించునేని అది ఈశ్వరీయ వ్యవస్థ కాదని గ్రంథకర్త పూర్వము ప్రతిపాదించియున్నాడు. ఇచట దానికి విరుద్ధముగా నిరపరాధికి దుఃఖము లభించునని ఒప్పుకొనుచున్నాడు. లభించుననునదే వైదిక సిద్ధాంతము. గ్రంథకర్త ప్రతిపాదించిన సిద్ధాంతము వేదబాహ్యము వేదవిరుద్ధము.

౨౭. మరణించువాడు కేవలము తన కర్మల చేతనే మరణించునేని ఎవరును తమ రక్షణ చేసికొనగూడదు. తనను తాను రక్షించుకొనుటకు ప్రయత్నించుటను వదలి అనగా రక్షణలేకయే ప్రధానమంత్రిని కార్యక్రమాలకు వెళ్ళుమని మనము సూచించగలమా ? మనము స్వరోగ నివృత్తి కొరకు ప్రయత్నించుట మానుకొనగలమా? ఈ సిద్ధాంతమును నమ్ము వారు ఆత్మరక్షణ చేసికొనుట ఎందులకు? న్యాయాలయము నెందుల కాశ్రయింతురు? వారి మంతవ్యము ననుసరించి పరస్పరము సుఖదుఃఖములకు కారణము కారు గదా? వారి దృష్టిలో న్యాయాన్యాయము లన నేమి? ఒకరికి సుఖము, దుఃఖము కలుగునపుడు ధర్మాధర్మములని వేనినందురు? మోసము, భ్రష్టాచారమని దేనినందురు? హతుడు తన కర్మచేతనే మరణించు ననుటలో వేదాదిశాస్త్రముల ప్రమాణమేమైన గలదా? వేదప్రమాణము చూపించలేదేమి?

౨౮. పూర్వము విమానములు లేకుండె ననగా నేమి? రామాయణములో, మహాభారతములో వివిధ విమానముల వర్ణన గలదు. మీరు చదువకపోవచ్చును. బృహద్విమానశాస్త్ర గ్రంథమును చదువగలరు. అందు మూడు విధముల విమానముల వర్ణన గలదు. మహాభారతము తరువాత ఆ విద్య నష్టమగుటచే విమానముల ఉనికి లేకుండపోయినది. ఋషి దయానందుని ప్రేరణ వలన శివకర బాపూజీ తళపదే వేదములు, వైశేషిక శాస్త్రము, పక్షుల నాధారముగా గొని ముంబాయిలో ఆధునిక జగత్తులో మొదటిసారిగా విమానమును నిర్మించెను.

౨౯. కాలాకాలమృత్యువు గుర్చి చరక సంహితలో రెండు స్థలములలో యుక్తి పూర్వకముగా ఆలోచించబడినది. కాలాకాలమృత్యువులు గలవని నిరూపించబడినది. కావున అకాల మృత్యువు జరుగును. దీనిచే ఇతరులవలన మానవునికి పరస్పరము సుఖదుఃఖములు కలుగుననుట అప్రామాణికము, ప్రమాణవిరుద్ధము, అవైజ్ఞానికము, అవ్యావహారికము. ఈ పక్షము సర్వథా త్యాజ్యము.

30. ఒకరి కర్మలు ఇంకొకరి మృత్యువునకు కారణమగును. ఏలన జీవులు కర్మలు జేయుటలో స్వతంత్రులు. జీవులను కర్మల జేయకుండ ఈశ్వరుడు నిరోధించడు. జీవుడు తన వ్యవస్థలో హస్తక్షేపము చేయకుండునటుల ఈశ్వరుడు వ్యవస్థను ఏర్పాటు చేసియున్నాడు. సృష్టిని ఉత్పన్నము చేయుట, పాలించుట, ప్రళయము చేయుట,జీవుల కర్మలకు ఫలమొసగుట ఈశ్వరుని వ్యవస్థ. అందులో జీవులు అవరోధము కల్పించజాలరు. కర్మలు చేయకుండ నిరోధించుట ఈశ్వరీయ వ్యవస్థ గాదు.

హంతకుడు ఒకనిని చంపుటకు ప్రయత్నించగలడు గాని చంపజాలడనునది ప్రతిజ్ఞ మాత్రమే. అందులో హేతువే లేదు. ఋషి దయానందునికి విషమొసగి చంపలేదా? ఇటువంటి ఘట్టములు ప్రతిదినము జరుగుచునే యున్నవి. హంతకుడు అపరాధి కాని ఎడల వేదాది శాస్త్రములలో అతనిని అపరాధియని పేర్కొనబడి యుండెడిది కాదు. ఒకరి కర్మఫలము (పరిణామము) మరియొకరికి లభించునని పూర్వము నిరూపించితిని. ఒకరి కర్మఫలము మరియొకరికి ఈశ్వరీయసృష్టిలో లభించదు. ఇచట ఫలమనగా

విపాకమని యర్థము. ఈశ్వరునిచే ఒసగబడు కర్మవిపాకము అది కర్తకే లభించును. కాని కర్మఫలము (కర్మ పరిణామము) ఇతరులకు కూడ లభించును.

ఉదా:- ఋషి దయానందని ఉపన్యాసము విన్నవారలనుండి అనేకులు ప్రభావితులైరి. ఒకడు ఆ ఉపన్యాసము విని ఆయనకు విషమొసగెను. ఆ ఉపన్యాస విపాకము విషభక్షణమేనా? ఇది కర్మఫలమే గాని కర్మవిపాకము గాదు. ఋషి దయానందుని ఉపన్యానము విని పౌరాణికులు ఆర్యసమాజికులను హింసించిరి. ఇది కర్మవిపాకము కాదు, కర్మఫలము. కర్మఫలము ఇతరులకు లభించును. ఎక్కువ తక్కువగా లభించును. లేదా విరుద్ధముగా లభించును. ఇది ఈశ్వరునిచే లభించినది గాదు. ఇది కర్మపరిణామము. ఇది తనపైన ఇతరులపైన బడును. ఈశ్వరునిచే లభించు కర్మవిపాకము కర్తకే లభించును.

కర్మ, కర్మవిపాకము, కర్మఫలము, కర్మప్రభావమును తెలిసికొనకుండ ప్రతి దానికి కర్మఫల మనుకొనుటవలన అనేక విసంవాదములు, పొరపాట్లు జరుగును. కర్మవిపాకము ననుసరించి జీవుడు ఏ దేశమున, ఏ సమయమున, ఏ మాతాపితరులకు జన్మించవలయునో అది ఈశ్వరునికి చెందిన విషయము. ఇందులో మానవుడు హస్తక్షేపము చేయజాలడు. కర్మవిపాకమునుండి తప్పించుకొనలేడు. ప్రతి పరిణామము కర్మవిపాకము గాదు. ఈశ్వరుని వలన జరిగినది గాదు.

౩౧. భార్య మరణములో భర్త కర్మలు, భార్య కర్మలు కారణమని ఎటుల ఋజువు చేయగలరు? అనేకులు వరకట్న రోగమువలన భార్యలను చంపివేయుచున్నారు. ఇందుకు భార్యకర్మలే కారణమా? ఇట్టి ఘట్టము లీనాడు సామాన్యమైపోయినవి. ఏకారణము వలన మరణించినదో మరణమును తెలిసికొనియే కారణమును కొంతవరకు నిర్ణయించవచ్చును. భార్య మరణమునకు భర్త కారణము కావచ్చును, భార్య కారణము కావచ్చును. ఇరువురు కారణము కావచ్చును. ఇరువురు కారణము కాకపోవచ్చును

వి. సం. ౨౦౫౬
సంపుటి : ౧౩ సంచిక : ౪-౧౨
పంజీకరణ సంఖ్య ౪౪౪౫ / ౪౪ తపాలా హెచ్/నిజామా/౬౪

సార్వభౌమ నియమములు

★ సమస్త సత్యవిద్యలకును, విద్యవలన దెలియు సకల పదార్థములకును ఆదిమూలము పరమేశ్వరుడు.

★ ఈశ్వరుడు సచ్చిదానంద స్వరూపుడు, నిరాకారుడు, సర్వశక్తిమంతుడు, న్యాయకారి, దయాళువు, అజన్ముడు, అనంతుడు, నిర్వికారుడు, అనాది. అనుపముడు, సర్వాధారుడు, సర్వేశ్వరుడు సర్వవ్యాపకుడు, సర్వాంతర్యామి. అజరుడు, అమరుడు, అభయుడు, నిత్యుడు, పవిత్రుడు, సృష్టికర్త. అతనినే ఉపాసించుట యోగ్యము.

★ వేదము సమస్త సత్యవిద్యల గ్రంథము. వేదమును చదువుట, చదివించుట, వినుట, వినిపించుట ఆర్యులందరి పరమ ధర్మము.

★ సత్యమును గ్రహించుటకును, అసత్యమును త్యజించుటకును ఎల్లప్పుడు సిద్ధముగా నుండవలయును.

★ సకల కార్యములను ధర్మానుసారముగా, అనగా సత్యాసత్యములను ఆలోచించి చేయవలయును.

★ ప్రపంచమునకు ఉపకారము అనగా శారీరక, ఆత్మిక, మఱియు సామాజికోన్నతి చేయుట ఈ సమాజము యొక్క ముఖ్యోద్దేశ్యము.

★ అందఱితో ప్రేమపూర్వకముగ, ధర్మానుసారముగ యథాయోగ్యముగ వ్యవహరించవలయును.

★ అవిద్యను నశింపజేసి విద్యను పెంపొందించవలయును.

★ ప్రతి ఒక్కరు తన యున్నతితోనే సంతృప్తినొందక అందఱి యున్నతిలోనే తన యున్నతి కలదని తలంచవలయును.

★ సమస్త మానవులు సర్వహితకరములగు సామాజిక నియమములను పాలించుటలో పరతంత్రులై, వ్యక్తిహితకరములగు నియమములందు స్వతంత్రులగుట తగును.

చిరునామా :

ప్రకాశకులు : ఆర్షగురుకులము, వడ్లూరు, కామారెడ్డి - ౫౦౩ ౧౧౧